CENTENARY OF STRUGGLES & SACRIFICES

రేపే 100 ఏళ్ల సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 185 | గురువారం | 25-12-2025 | హైదరాబాద్

Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12 | వెల రూ. 5.00

## శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' క్రిస్మస్ శుభాకాంక్షలు



### సెలవు

క్రిస్మస్ సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి గురువారం సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

- ఎడిటర్

# కక్ష్యలోకి బ్లూబర్డ్ బ్లాక్–2

## బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3–ఎం6 ప్రయోగం విజయవంతం

6,100 కిలోల బరువున్న భారీ ఉపగ్రహాన్ని పంపడం ఇస్రోకి ఇదే తొలిసారి

శ్రీహరికోటలో సర్వత్రా వెల్లివిరిసిన ఆనందోత్సవాలు



**శ్రీహరికోట:** అమెరికాకు చెందిన అతి బరువైన బ్లూబర్డ్ బ్లాక్–2 ఉపగ్రహాన్ని ప్రతిష్ఠాత్మకమైన భారతదేశ 'బాహుబలి' వాహకనౌక ఎల్‌విఎం3–ఎం6 విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. చరిత్రాత్మకమైన ఈ విజయాన్ని భారత్‌కు క్రిస్మస్–న్యూ ఇయర్ కానుకగా ఇస్రో అభివర్ణించింది. 6,100 కేజీలు బరువుగల కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్‌వి ఎం3–ఎం6 వాహకనౌక దాదాపు 600 కి.మీ ఎత్తున లో ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఇఓ–భూ నిమ్న కక్ష్య)లో విజయవంతంగా ప్రవేశపెట్టింది. ప్రపంచంలో ఇంతవరకూ అత్యధిక పేలోడ్‌గల లో ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహం ఇదే. శ్రీహరికోటలోని రెండో లాంచ్‌ప్యాడ్ నుండి బుధవారం ఉదయం 8.55 గంటలకు బాహుబలి వాహకనౌక ప్రయాణం ప్రారంభించి 15 నిమిషాల్లో పని పూర్తి చేసింది.15 నిమిషాలు గగనంలోకి దూసుకువెళ్ళిన బాహుబలి వాహకనౌక నుండి బ్లూ బర్డ్ బ్లాక్–2 ఉపగ్రహం విజయవంతంగా విడిపోయి నిర్దేశిత కక్ష్యలోకి చొరబడింది. దీంతో భూతలంపై శ్రీహరికోటలో సర్వత్రా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. 43.5 మీటర్ల పొడవుగల ఎల్‌విఎం 3–ఎం 6 వాహకనౌక జిఎస్ఎల్‌వి ఎంకె–3గా ప్రసిద్ధి చెందింది. దీనికి 'బాహుబలి' అని నిక్ నేమ్ పెట్టారు. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఇస్రో వాణిజ్యవిభాగం)తో ఎఎస్‌టి స్పేస్ మొబైల్‌కు కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. అమెరికా కేంద్రంగా పని చేసే ఎఎస్‌టి స్పేస్ మొబైల్ సంస్థ నుండి స్మార్ట్ ఫోన్లకు నేరుగా ఉపగ్రహం ద్వారా ఇక శరవేగంగా సేవలు లభిస్తాయి. ముఖ్యంగా ఫోర్ జీ, ఫైవ్ జీ వాయిస్, వీడియో కాల్స్ తరువాయి 2లో

# 29 నుంచి అసెంబ్లీ

## నోటిఫికేషన్ జారీ

ప్రజాపక్షం /హైదరాబాద్

తెలంగాణ శాసనసభ, శాసనమండలి శీతాకాల సమావేశాలు ఈనెల 29న తేదీ ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ ఆదేశాల మేరకు తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహాచార్యులు బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సమావేశాలలో కృష్ణా, గోదావరి నదీ జలాల వాటాలు – తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య వివాదాలపై విస్తృత ప్రధాన చర్చ జరిగే అవకాశం ఉంది



# కెసిఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వ...

## సిఎం రేవంత్‌రెడ్డి

- రెండేళ్ల తర్వాత కెసిఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటారా?
- బిఆర్‌ఎస్ చీఫ్‌వి సోయిలేని మాటలు, స్థాయిలేని విమర్శలు
- 2029 అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే 2/3 వంతు మెజారిటీతో అధికారంలోకి వస్తాం
- సర్పంచ్‌ల సన్మాన సభలో ముఖ్యమంత్రి

ప్రజాపక్షం / నారాయణపేట

తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కెసిఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లాలోని కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మాజీ సిఎం, బిఆర్‌ఎస్ చీఫ్ కెఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రెండేళ్ల తర్వాత కెసిఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటారా అని ఆయన మండిపడ్డారు. కెసిఆర్‌వి సోయిలేని మాటలు, స్థాయిలేని విమర్శలని రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో తనను తన కుటుంబాన్ని, ఎన్నో విధాలుగా ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టానని వివరించారు. తాను ప్రమాణ స్వీకారం చేసినప్పుడే కూలబడ్డారని వివరించారు. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుందని అన్నారు. ఫాంహౌస్‌ను కెసిఆర్ తరువాయి 2లో

## పల్లెలకు ప్రత్యేక నిధులు

### చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు

నూతన సంవత్సరంలో పల్లెలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రామ పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) కేటాయిస్తామని ప్రకటించారు. శాసన సభ్యులు, ఎంపిలు, మంత్రులతో సంబంధం లేకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు గ్రామాల్లో సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఉపయోగించాలన్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి గ్రామం, తండాకు రోడ్లు పూర్తి చేస్తామని హామీ తరువాయి 2లో

# పరస్పర విమర్శలతో జల సమస్యలు పరిష్కారమవ్వవు

- కృష్ణా, గోదావరి జలాల వివాదంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ వైఖరి సరికాదు
- రాష్ట్ర ప్రయోజనాలకోసం సమష్టిగా కేంద్రంపై పోరాడాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణా, గోదావరి జలాల వివాదాల విషయంలో ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్, అధికార కాంగ్రెస్ పరస్పర విమర్శల వల్ల సమస్యలు పరిష్కారం కావని, రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరు కలిసి సమష్టిగా కేంద్రం, ఎపి సిఎం చంద్రబాబుపై పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్లోబల్ సమ్మిట్, యూనివర్సిటీల సదస్సు లాంటి పలు కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని, ఇక ప్రజలు కూడా తమ సమస్యల పరిష్కారం, హామీల అమలు గురించి అడుగుతారని, అందుకే హామీల అమలు చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో ఒక మాయా ప్రభుత్వం నడుస్తోందని, రాజ్యాంగం, రాజ్యాంగ విలువలు, దేశ స్వాతంత్ర్యం, మహానుబావులు అంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ఒక మిథ్యే అని విమర్శించారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ, సమితి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, ఇ.టి.నర్సింహా, కార్యదర్శివర్గ సభ్యులు తరువాయి 2లో

## జనవరి 18న ఖమ్మంలో సిపిఐ వందేళ్ల వేడుకలు

ఖమ్మం జిల్లాలో 'డిసెంబర్ 26న' జరగాల్సిన జాతీయ స్థాయి సిపిఐ వందేళ్ల ఉత్సవాలను స్థానిక ఎన్నికల కారణంగా జనవరి 18వ తేదీన నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా 5 లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేస్తామని కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. జనవరి 18,19,20,21 జరిగే వేడుకలలో జాతీయ సెమినర్, జాతీయ సమితి సమావేశం జరుగుతుందని, విదేశాల నుంచి ప్రతినిధులు, ఇతర వామపక్ష పార్టీల నాయకులు హాజరుకానున్నారన్నారు. ఈ సమావేశాలకు సౌహార్థ సందేశం నిమిత్తం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తామని కూనంనేని తెలిపారు.

# పూజారుల అనుమతితోనే గద్దెల తరలింపు



- మంత్రి సీతక్క స్పష్టీకరణ
- మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజుల ప్రతిష్ఠాపన

ప్రజాపక్షం/ములుగు

మేడారంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల తరలింపు పూజారుల అనుమతితోనే ప్రతిష్ఠాపన చేస్తున్నామని, పూర్వీకులు ఇచ్చిన ఆదేశాలతో పాటు ప్రకృతి సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులు చేపట్టగా భక్తులకు దర్శన సౌకర్యార్థం ఒకే వరుసలో నూతనంగా ఆదివాసీ సాంప్రదాయల ప్రకారం పూజారుల సంస్కృతి పద్ధతిలో గద్దెల ప్రాంతంలో చేస్తున్న పునరుద్ధరణ పనులలో భాగంగా నూతన గద్దెల మీద బుధవారం ఉదయం ఆదివాసీ డోలు చప్పుళ్లతో, సంప్రదాయ నృత్యాలతో అంగరంగ వైభవంగా పగిడిద్దరాజు, గోవిందరాజుల ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క తరువాయి 12లో

# ప్రతిభావంతమైన వ్యవస్థ రూపొందించాలి

- అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచన
- విద్య, సంక్షేమం పట్ల నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం

ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రతిభావంతమైన వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నేటి విద్యార్థులే రేపటి రాష్ట్ర భవిష్యత్తు అని ప్రపంచ దేశాలతో పోటీపడేవిధంగా రాష్ట్రం ఉండాలంటే అత్యుత్తమ ఫలితాలను సాధించడంతో పాటు నాణ్యమైన మానవ వనరులను దేశానికి అందించాలని ఆయన సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో తరువాయి 12లో







## సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

# 26న నలుమూలలా ఎర్రజెండా ఎగరాలి

100 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'కటౌట్' ఆవిష్కరణ

03

## పగలూ రాత్రి

# వణుకుడే

- ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలులు
- అత్యల్ప స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు
- వృద్ధులు, పిల్లలు, రోగులలో తీవ్ర ప్రభావం
- పదేళ్ల తరువాత చలిపులి పరిస్థితులు

ప్రజాపక్షం/హనుమకొండ

ప్రజలు చలికి గజగజ వణుకు తున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతున్నాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న గాలులు చలి తీవ్రతను పెంచుతున్నాయి. గత 4 రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 10 డిగ్రీలకన్నా తక్కువ నమోదవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాలైన ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో చలితో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ రెండు జిల్లాల్లో 2రోజులుగా ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలకు పడిపోయాయి. పట్టణాలు, పల్లెలను సైతం చలి బాధిస్తోంది. ఉష్ణోగ్రతలు తరువాయి 12లో



## దక్షిణ అమెరికాకు

# ట్రంప్ బెడద

### భద్రతా మండలిలో వెనిజులా ఫిర్యాదు

### ట్రంప్ పాలనాయంత్రాంగం దోపిడీ నుంచి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి





**కారకస్:** దక్షిణ అమెరికా ప్రాంతం మొత్తానికి అమెరికా పెద్ద బెడదగా తయారైందని, ట్రంప్ పాలనాయంత్రాంగం అత్యంత దారుణమైన దోపిడీ చర్యలకు పాల్పడుతోందని ఈ ప్రమాదం నుండి తమకు రక్షణ ఇవ్వాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో వెనిజులా రాయబార విజ్ఞప్తి చేశారు. రెండు వెనిజులా చమురు నౌకలను స్వాధీనం చేసుకోవడం దోపిడీ, పైరసీ కంటే మించిన దారుణమని విమర్శించారు. కరీబియన్ సముద్రంలో వెనిజులాను సైన్యంతో చుట్టుముట్టిన అమెరికా వెనిజులా నౌకలను తిరగనివ్వకుండా అడ్డుకుంటున్నది. సైనికబలంతో ఒక చిన్న దేశాన్ని దురాక్రమణ చేయాలని అమెరికా ప్రయత్నం చేస్తోందని, తమ దేశంలోకి చమురు తీసుకు వెళ్ళేందుకు వచ్చే వాణిజ్య నౌకలను రానివ్వకుండా అమెరికా సైన్యం అడ్డుకుంటున్నదని, ఇప్పటివరకూ మూడు చమురు నౌకలను తన స్వాధీనంలోకి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## మాస్కోలో మళ్ళీ పేలుడు

### పోలీసు అధికారులు సహా ముగ్గురు మృతి

**మాస్కో :** రష్యా దక్షిణ మాస్కోలో మరో పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో ఇద్దరు పోలీసు అధికారులు సహా ఒక నిందితుడు కూడా మరణించారు. మాస్కోలో సైనిక జనరల్ ఉన్నతాధికారి మరణించిన ఘటనపై పోలీసులు ఒక నిందితుణ్ణి నిలదీస్తున్న సమయంలో బాంబు పేలుడు సంభవించింది. బుధవారం పూర్తిగా తెల్లారకముందుగానే ఈ పేలుడు ఘటన సంభవించింది. ఈ పేలుడుతో ఇద్దరు పోలీసు అధికారులు సహా సదరు నిందితుడు కూడా మరణించాడని రష్యా ఇన్వెస్టిగేటివ్ కమిటీ తెలియజేసింది. మాస్కోలోని ఎలెట్స్కయా వీధిలో పోలీసు అధికారులు తమ వాహనం దగ్గర నిందితుణ్ణి నిలబెట్టి ప్రశ్నిస్తున్న సమయంలో పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనల వెనుక ఉక్రేన్ హస్తం ఉందని అనుమానిస్తున్నారు.రష్యా అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించలేదు. ఫో రెన్సిక్ అధికారులు ఈ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. ఎమర్జెన్సీ సేవలను రంగంలోకి దించారు. ఆ ప్రాంతంలో ఉన్న వీడియో ఫూటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నేరస్థులకోసం భారీ ఎత్తున గాలింపు చర్యలు ప్రారంభించారు.

# తూర్పు రష్యా నుండి దళాల ఉపసంహరణ

### ఉక్రేన్ ప్రతిపాదన

### రష్యాకు చేరిన 20 అంశాల జెలెన్స్కీ శాంతి ప్రణాళిక



**కీవ్ :** రష్యా తూర్పు ప్రాంతం నుండి దళాలను ఉపసంహరించేందుకు శాంతి ప్రణాళికలో ఉక్రేన్ ప్రతిపాదన చేసింది. డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ముసాయిదా ప్రణాళికలో అనేక మార్పులు చేర్పుల తర్వాత ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ తాజా 20 అంశాల ముసాయిదా ప్రతిపాదనలను విడుదల చేశారు. ఫ్లోరిడాలో అమెరికా–ఉక్రేన్ ప్రతినిధుల మధ్య గడచిన వారాంతంలో ముమ్మరంగా చర్చలు జరిగాయి. ఈ చర్చల్ల మల్లగుల్లాల తర్వాత ఈ ఇరవై అంశాల ప్రణాళికను ఖరారు చేశారు. ఈ ప్రణాళిక ఇవ్వాలని రష్యా అడుగుతున్నది. ఆ మేరకు రష్యాకు ఈ ప్రణాళికను అందజేశారు. ఈ ప్రతిపాదనలపై కొద్ది గంటల్లోనే రష్యా కూడా ప్రతిస్పందించి తన అభిప్రాయం చెబుతుందని జెలెన్స్కీ ప్రకటించారు. కానీ యూరప్‌లో అతిపెద్దదైన ప్రస్తుతం రష్యా అధీనంలో ఉన్న ఝపోరిఝియా అణు విద్యుత్ కర్మాగారం, తూర్పు డాన్‌బాస్ ప్రాంతాలే చర్చల్లో పరిష్కారం దొరకని వివాదాలుగా మారాయి. ఐతే వివాదాస్పద ప్రాంతాలను కీలకమైన శక్తిమంతమైన స్వేచ్ఛా ఆర్థిక మండళ్ళుగా ఉండాలని లేదా యుద్ధం కొనసాగాలని జెలెన్స్కీ చెప్పారని వార్తలు వెలువడ్డాయి. భవిష్యత్తులో రష్యా మళ్ళీ దాడి చేస్తే నాటో, యూరోపియన్‌యూనియన్, అమెరికాలు ఉమ్మడిగా భద్రతాహామీ ఇవ్వాలని కూడా జెలెన్స్కీ పట్టుపడుతున్నారు. ట్రంప్ తొలుత 28 అంశాలతో శాంతి ప్రణాళిక ప్రతిపాదించారు. ప్రస్తుతం ఇది వడపోతల తర్వాత 20 అంశాలకు పరిమితమైంది.

ఐతే దాదాపు ఈ ఒప్పందంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఖరారైంది. కానీ భూభాగాలకు సంబంధించిన కీలక అంశాలు మాత్రం ఇంకా పరిష్కారం లేకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి. బాగా మార్పులు,చేర్పులతో వడపోతకు గురైన ఈ ప్రణాళికలోని కీలక అంశాలను జెలెన్స్కీ కీవ్ నగరంలో పాత్రికేయులకు వివరించారు. ఐతే ఈ ప్రణాళికపై ఆయన చేసిన వ్యాఖ్యలన్నింటిపైనా ముందస్తు ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ ముసాయిదా ప్రతిపాదన ఉక్రేన్ ఆలోచనలను, ఆశలను ప్రతిబింబిస్తోందని జెలెన్స్కీ మీడియాకు చెప్పారు. ఈ ప్రతిపాదనల్లో ఉక్రేన్ రాజకీయ, వాణిజ్య ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయని, ముఖ్యంగా ఉక్రేన్ భద్రతాంశాలు ఇందులో ఉన్నాయన్నారు. ఉక్రేన్‌కు పూర్తి భద్రత, ఆర్థిక సామర్థ్యం పెంపొందించే అంశాలు ప్రణాళికలో ఉన్నాయన్నారు. డోనెట్స్క్, లూహాన్స్క్ రీజియన్లను డాన్‌బాస్‌గా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాంతంపైనే వివాదం కొనసాగుతోంది. ఈ అంశమే శాంతికి పెద్ద ఆటంకంగా ఉంది. ఐతే నాయకుల స్థాయిలోనే ఈ అంశంపై చర్చలు జరుగుతాయి. డాన్‌బాస్‌లో రష్యా స్వాధీనం చేసుకోకుండా మిగిలిపోయిన భూభాగాన్ని కూడా ఉక్రేన్ వదులుకోవాలని రష్యా ఒత్తిడి చేస్తున్నది. కానీ ఉక్రేన్ అందుకు తిరస్కరిస్తున్నది.

నాలుగేళ్ళ యుద్ధంలో ఇప్పటికే డాన్‌బాస్‌లో 70 శాతం భూభాగాన్ని రష్యా తన అధీనంలోకి తెచ్చుకుంది. ఐతే అమెరికా మాత్రం ఈ ప్రాంతాన్ని ఒక ప్రత్యేక స్వేచ్ఛాయుత ఆర్థిక మండలంగా రూపాంతరీకరణ చేసి రాజీ కుదిర్చేందుకు ప్రతిపాదన చేసింది. ఐతే ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్నాగానీ ప్రజాభిప్రాయ సేకరణే ప్రధానంగా ఉండాలని ఉక్రేన్ కోరుతున్నది. ఉక్రేన్ ప్రజలు తమ భవితవ్యాన్ని తామే నిర్దేశించుకోవాలని జెలెన్స్కీ కోరుతున్నారు. ఈ ప్రాంతాన్ని నిస్సైనికీకరణ మండలంగా మార్చాలని ఉక్రేన్ కోరుతున్నది. అంతర్జాతీయ దళాలు ఈ ప్రాంతంలో ఉండాలని, ఈ ప్రాంత స్థిరత్వానికి అంతర్జాతీయ దళాలు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.

### టర్కీలో విమాన ప్రమాదం

# లిబియా ఆర్మీ చీఫ్ దుర్మరణం



**అంకారా :** లిబియా సాయుధ బలగాల ప్రధానాధిపతి జనరల్ మహ్మద్ అలీ అహ్మద్ అల్–హద్దద్ విమాన ప్రమాదంలో మరణించారు. ఈ ప్రమాదంలో మొత్తం ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఒక ప్రైవేటు విమానంలో ప్రయాణం చేస్తున్న సమయంలో టర్కీలో విమానం కూలిపోయింది. ఈ విమానంలో హద్దద్‌తోపాటు మరో నలుగురు ఉన్నతస్థాయి సైనిక అధికారులు కూడా మరణించారు. మరణించినవారిలో ముగ్గురు విమాన సిబ్బంది ఉన్నారు. అంకారాకు దక్షిణంగా 70 కి.మీ దూరంలో ఉన్న కెసిక్కవక్ గ్రామం వద్ద విమానం కూలిపోయిన ప్రాంతంలో విమాన శకలాలను, మృతదేహాలను స్వాధీనం చేసుకోవడానికి చర్యలు కొనసాగుతున్నాయని టర్కీ ప్రభుత్వ వార్తాసంస్థ తెలియజేసింది. మంగళవారం రాత్రి చర్చల అనంతరం 8.30 గంటల సమయంలో టర్కీ రాజధాని అంకారా ఎసెంబోగ్ విమానాశ్రయం నుండి విమానం బయలుదేరిన తర్వాత విపరీతమైన వర్షం, మంచులో ఇరుక్కుపోయింది. సాంకేతిక లోపం వల్ల తక్షణం దిగాల్సి ఉందని చెప్పిన తర్వాత రాత్రి 9.10 గంటల సమయంలో విమానంతో భూతలకేంద్రానికి సంబంధాలు తెగిపోయాయి. అప్పటికే విమానాన్ని ఎస్సెన్‌బోగాలో దించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. టర్కీ అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం ఫాల్కన్–50 రకం బిజినెస్ జెట్‌లో వారంతా బయటుదేరారు. ప్రమాదం జరిగిన మరునాడు గాలింపు చర్యల్లో ఫ్లైట్ రికార్డర్‌ను కనుగొనే ప్రయత్నంలో ఉన్నారు. సాంకేతిక లోపం కారణంగానే విమానం కూలిపోయి ఉండవచ్చునని లిబియా అధికారులు వ్యాఖ్యానించారు. టర్కీ రాజధాని అంకారాలో లిబియా సైనిక వర్గం ఉన్నతస్థాయి సమావేశంలో సంప్రదింపుల తర్వాత లిబియా రాజధాని ట్రిపోలీకి బయలుదేరి వెళుతుండగా ప్రమాదం జరిగింది. టర్కీ–లిబియా దేశాలమధ్య సైనిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ బృందం చర్చలు జరిపింది. విమానంలో ప్రయాణం చేస్తున్న అందరూ మరణించినట్లు లిబియా ప్రధానమంత్రి అబ్దుల్ హమిద్ డేబైబాహ్ ధృవీకరించారు. తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. విషాదకరమైన ఈ విమాన ప్రమాదం తమ దేశానికి తీరనినష్టం కలిగించిందన్నారు. పశ్చిమ లిబియాలో అల్–హదాద్ ఒక ఉన్నత స్థాయి కమాండర్‌గా ఉన్నారు. లిబియా సైన్యాన్ని సమీకృతం చేసేందుకు ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చల్లో అల్–హదాద్ చాలా ముఖ్యభూమిక నిర్వహిస్తున్నారు. ఈ ప్రమాదంలో లిబియా భూతల దళాల ప్రధానాధిపతి జనరల్ అల్–ఫితౌరి ఘ్రాబిల్,మిలిటరీ ఉత్పత్తుల అథారిటీ నాయకుడు బ్రిగేడియర్ జనరల్ మహ్మద్ అల్–కత్తవి, బలగాల ప్రధానాధిపతి సలహాదారు మహ్మద్ అల్–అతవి దయాబ్, చీఫ్ స్టాఫ్ ఆఫీస్‌లో మిటిటరీ ఫొటోగ్రాఫర్ మహ్మద్ ఒమర్ అహ్మద్ మహ్‌జౌబ్ మరణించిన ప్రముఖులలో ఉన్నారు. కాగా ముగ్గురు విమాన సిబ్బంది వివరాలు వెంటనే తెలియరాలేదు.

## అమెరికా సరిహద్దుల్లో 30 మంది భారతీయుల అరెస్టు

**న్యూయార్క్ :** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 30 మంది భారత జాతీయులను ఆ దేశ సరిహద్దు గస్తీ ఏజంట్లు అరెస్టు చేశారు. వీరంతా ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండా అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నారని, కమర్షియల్ డ్రైవర్స్‌గా లైసెన్సులు పొంది సెమీ ట్రక్స్‌ను నడుపుతున్నారని గస్తీ ఏజెంట్లు చెప్పారు. కాలిఫోర్నియా ఎల్ సెంట్రో సెక్టర్ లోని సరిహద్దు గస్తీ ఏజెంట్లు మొత్తం 49మంది అక్రమ నివాసితులను అరెస్టు చేశారు. నవంబరు 23 నుండి డిసెంబరు 12వ తేదీ మధ్యకాలంలో 42 మంది అక్రమంగా వచ్చి ట్రక్ డ్రైవర్లుగా చెలామణీ అవుతున్నట్లు గుర్తించారు. వీరిలో 30 మంది భారతీయులు కాగా, ఇద్దరు ఎల్‌సాల్వడార్ జాతీయులున్నారు. మిగిలిన వారు చైనా, హైతీ, హోండూరస్, మెక్సికో, రష్యా, సోమాలియా, టర్కీ, ఉక్రేన్ దేశాల నుండి వచ్చారు. కాలిఫోర్నియా మొత్తం 31 కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులను ఇచ్చింది. వీటిల్లో ఎనిమిది లైసెన్సులు ఫ్లోరిడా, ఇల్లినోయిస్, ఇండియానా, ఒహియో, మేరీలాండ్, మిన్నెసోటే, న్యూజెర్సీ, న్యూయార్క్, పెన్సిల్వేనియా, వాషింగ్టన్‌ల నుండి ఇచ్చినవే ఉన్నాయని గస్తీ ఏజంట్లు చెప్పారు.

## బ్రిస్టల్ నర్సింగ్‌హోంలో పేలుడు

### కుప్పకూలిన భవనం : ఇద్దరు మృతి

**బ్రిస్టల్ :** పెన్సిల్వేనియాలోని ఫిలిడెల్ఫియా సిటీ శివారు ప్రాంతం బ్రిస్టల్ టౌన్‌షిప్‌లో ఉన్న హెల్త్ అండ్ రీహేబిలిటేషన్ సిల్వర్ లేక్ నర్సింగ్ హోం (వృద్ధుల ఆశ్రమం)లో బుధవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి భవనం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించినట్లు ధృవీకరించారు. అనేకమంది గాయపడ్డారు. ఇంకా అనేకమంది జాడ తెలియడంలేదు. తేల్చిన లెక్కల ప్రకారం ఇప్పటివరకూ ఐదుగురు వృద్ధుల జాడ తెలియడంలేదు. శిథిలాలు తొలగించేందుకు సహాయ కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. గ్యాస్ లీకేజీ కారణంగా పేలుడు ప్రమాదం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా అంచనావేశారు. స్థానికులు కూడా సహాయ చర్యలకు ఉపక్రమించారు.

## అవామీలీగ్‌కు ఎన్నికల్లో అవకాశమివ్వండి

### మహ్మద్ యూనుస్‌కు అమెరికా చట్టసభ్యుల విజ్ఞప్తి

**న్యూయార్క్/ఢాకా:** బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై అమెరికా చట్టసభ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పదవీచ్యుతురాలైన షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై ఆ దేశంలో పూర్తిస్థాయి నిషేధం అమలు చేయడంపట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పాల్గొనేందుకు అవకాశం లేకుండా అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. స్వేచ్ఛగా,న్యాయబద్ధంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా తమకు నచ్చిన రాజకీయ పార్టీకి అధికారం అప్పగించేందుకు ఎన్నికల్లో పాల్గొనే హక్కు బంగ్లాదేశ్ ప్రజలకు ఉందని అమెరికా చట్టసభ సభ్యులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అమెరికా విదేశీ వ్యవహారాల కమిటీ కూడా అవామీలీగ్‌ను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్‌కు ఒక విజ్ఞప్తి చేసింది. విదేశీ వ్యవహారాల హౌస్ కమిటీ ర్యాంకింగ్ సభ్యుడు గ్రెగరీ మీక్స్, దక్షిణ, సెంట్రల్ ఆసియా సబ్ కమిటీ ఛైర్మన్ హ్యూజెంగా, దక్షిణ, సెంట్రల్ ఆసియా సబ్ కమిటీ ర్యాకింగ్ సభ్యుడు కంలాగర్ దోవ్, కాంగ్రెస్ సభ్యుడు జూలీ జాన్సన్‌లు ఈమేరకు మహ్మద్ యూనుస్‌కు ఒక లేఖ పంపారు. బంగ్లాదేశ్ క్రైమ్ ట్రిబ్యునల్ గతనెలలో షేక్ హసీనాకు మరణశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది.

# కొత్త గనుల లీజుపై పూర్తి నిషేధం

### ఆరావళిపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

**న్యూఢిల్లీ :** ఆరావల్లి పర్వత శ్రేణిలో కొత్త గనుల లీజుల మంజూరుపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి నిషేధం విధించింది. ఆరావల్లి కొండల నిర్వచనంపై ఇటీవల వచ్చిన వివాదం నేపథ్యంలో, అలాగే సుస్థిర గనుల నిర్వహణ ప్రణాళిక (ఎంపిఎస్‌ఎం) సిద్ధం అయ్యే వరకు కొత్త లీజులు ఇవ్వవద్దని సుప్రీంకోర్టు ఆదేశించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రకారం, ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించిన ఆరావల్లి శ్రేణి మొత్తంలో అక్రమ గనుల తవ్వకాలను అడ్డుకోవడం, పర్వత శ్రేణి సమగ్రతను కాపాడడం ఈ నిషేధం లక్ష్యం. గుజరాత్ నుంచి ఎన్‌సిఆర్ వరకు ఆరావల్లిని ఒక నిరంతర భౌగోళిక శ్రేణిగా రక్షించేందుకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే నిషేధిత ప్రాంతాలకుపైగా, పర్యావరణ–భౌగోళిక అంశాల ఆధారంగా మరిన్ని గనుల నిషేధ ప్రాంతాలను గుర్తించేందుకు భారత అటవీ పరిశోధన మరియు విద్యా మండలి (ఐసిఎఫ్‌ఆర్‌ఇ)కి కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం పనిచేస్తున్న గనుల విషయంలో మాత్రం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కఠిన పర్యావరణ నిబంధనలు పాటించాలని రాష్ట్రాలకు సూచించింది.

ఈ ఆదేశాలు టిఎన్ గోదావర్మన్ తిరుముల్పాడ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో నవంబర్ 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా వచ్చాయి. అరావల్లులు థార్ ఎడారి విస్తరణను అడ్డుకునే హరిత కవచంగా కీలక పాత్ర పోషిస్తున్నాయని కోర్టు స్పష్టం చేసింది. సమగ్ర, శాస్త్రీయ ఆధారిత సుస్థిర గనుల ప్రణాళిక పూర్తయ్యే వరకు కొత్త లీజులు ఇవ్వకూడదని కోర్టు ఆదేశించింది. ఆరావల్లి నిర్వచనంపై ఉన్న అపోహల మధ్య ఈ ప్రకటన వచ్చింది.

కొండల ఎత్తు ప్రమాణాల వల్ల పెద్ద భాగం గనులకు తెరుచుకుంటుందనే ఆరోపణలను పర్యావరణవాదులు ఖండించారు. అరావళీ పర్వతాలు ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల మీదుగా విస్తరించి, జీవ వైవిధ్యం, భూగర్భజల రీచార్జ్‌కు కీలకంగా ఉన్నాయి.

## పల్లెలకు ప్రత్యేక నిధులు

**(మొదటి పేజీ తరువాయి)**

ఇచ్చారు. గుడి, బడి, తాగునీరు, పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తామని వెల్లడించారు. నిరుద్యోగుల కోసం ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తామన్న సీఎం నూతనంగా ఎన్నికైన సర్పంచిలు గ్రామాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజా సేవ చేయాలని పిలుపునిచ్చారు. దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని గాంధీజీ చెప్పారన్న ఆయన, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'ఎన్నికలు ముగిశాయి, ఇక ఎలాంటి రాజకీయాలు లేవు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే పార్టీలు, పంథాలు ఉండాలి. తెలంగాణ రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్న మనం అందరినీ కలుపుకొని పోదాం. నియోజకవర్గంలో చిన్నచిన్న ఘటనలను పక్కనపెట్టి పనిచేయాలి. ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నిధులు వాడాలి. ప్రతి ఇంటికి రేషన్ కార్డు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. సర్పంచ్‌లు ఇంటింటికీ వెళ్లి రేషన్ కార్డు రాని వారి పేర్లు రాసుకోవాలి' అని అన్నారు.




**పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు**

పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కెసిఆర్ సిఎం అయినా కొడంగల్‌కు నీళ్లు రానివ్వలేదని ఆక్షేపించారు. పాలమూరు, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులు పూర్తి చేయలేదన్న రేవంత్ రెడ్డి కృష్ణాపై ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్నారు. పదేళ్లలో కాంట్రాక్టర్లకు రూ.1.83 లక్షల కోట్ల బిల్లులు మాత్రం చెల్లించారని విమర్శించారు. కమీషన్ల రూపంలో రూ.వేల కోట్లు కెసిఆర్ కుటుంబం పొందిందని సిఎం ఆక్షేపించారు.

చెప్పులు లేకుండా తిరిగిన వాళ్లకు బిఆర్‌ఎస్ పాలనలో బెంజ్ కార్లు వచ్చాయన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాత్రం బాగుపడిందని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

## అధికారంలోకి రానివ్వ...

**(మొదటి పేజీ తరువాయి)**

బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులు ఉన్నారని రేవంత్ రెడ్డి వివరించారు. 'చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల ప్రాంతం నుంచి వచ్చి జెడ్‌పిటిసి, ఎమ్మెల్యే, ఎంపి తర్వాత ముఖ్యమంత్రిని అయ్యా' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ తామే అధికారంలోకి వస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఒకవేళ 153 సీట్లయితే 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. 'బిఆర్‌ఎస్, కెసిఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదు' అని అన్నారు.

కెసిఆర్ అసెంబ్లీకి వస్తే ఏ అంశంపైనైనా చర్చిద్దాం శాసనసభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను ఓడించామని, పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చామని రేవంత్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టామన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినమని చెప్పారు. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నామన్నారు. ఇన్నిసార్లు ఓడించినప్పటికీ ఇంకా నాదే పైచేయి అంటారా? అని రేవంత్ రెడ్డి కెసిఆర్‌ను ప్రశ్నించారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి అని కెసిఆర్‌కు సిఎం రేవంత్ సవాల్ విసిరారు. ఇప్పటికైనా కెసిఆర్ వయసును గౌరవిస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయన్న సిఎం మీరు(కెసిఆర్) చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి అని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదని నిజమైన చర్చ అసెంబ్లీలో చేద్దామన్నారు. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు వింటారని రేవంత్ రెడ్డి చెప్పారు.

## పరిష్కారమవ్వవు

**(మొదటి పేజీ తరువాయి)**

బాగం హేమంతరావు, ఎం.బాలనరసింహాతో కలిసి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

**నీటి వివాదాలను రాజకీయంగా చూస్తే తెలంగాణకు నష్టం :**

నీటి వివాదాలపై దృష్టి మళ్లించే రాజకీయాలతో ప్రజలకు ఉపయోగంలేదని కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభలో జరిగే చర్చలో నీటి వివాదాల అంశంలో ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలని, అలాగే కెసిఆర్ కూడా ఏం చేస్తే బాగుంటుందో, ఎక్కడ పొరపాట్లు జరిగాయో చెబితే మంచిదని సూచించారు. నీటి వివాదాలను రాజకీయ అంశంగా చూస్తే తెలంగాణ రాష్ట్రానికే నష్టం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అసలు రెండేళ్లు కెసిఆర్ ఇంట్లో ఉండడమే తప్పు అని, అన్ని సవ్యంగా ఉంటేనే వస్తారా? ప్రజల తీర్పును గౌరవించబోరా? అని కూనంనేని ప్రశ్నించారు. ఇప్పటికే కెసిఆర్ తన విలువైన సమయాన్ని వృధా చేసుకున్నారని, ఈ పాటికే ఆయన తన విలువైన సూచనలు ఇస్తే, ప్రభుత్వం కూడా సరిదిద్దుకునే అవకాశం ఉండేది కదా అని అన్నారు.

**కెసిఆర్‌కు భిన్నమైన పాలన అని రేవంత్ రెడ్డి రుజువు చేసుకోవాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత బస్సు లాంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, కానీ ఇంకా ఇవ్వాల్సిన మహిళలకు మహాలక్ష్మి రూ.2500ల ఆర్థిక చేయూత, రూ.4 వేల పెన్షన్, కళ్యాణలక్ష్మికి తులం బంగారం లాంటి హామీలను కూడా అమలు చేయాలని సూచించారు. కెసిఆర్‌కు భిన్నమైన పరిపాలన అని రేవంత్ రెడ్డి రుజువు చేసుకోవాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను తగ్గిస్తున్నారని, చిన్న ఉద్యోగులకు బకాయిలు పేరుకుపోతున్నాయని, అవుట్ సోర్సింగ్ పేరుతో కార్మికులు, ఉద్యోగుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు.

**స్నేహ పార్టీలను కలుపుకుంటే మంచిది**

సాధ్యమైనంత వరకు స్నేహపూర్వకమైన పార్టీలను కలుపుకుంటే మంచిదని, పార్టీ గుర్తులతో జరిగే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల తరహా పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీకి సూచించారు. స్నేహితులకు మద్దతు ఇవ్వాలని, సిపిఐ ఒక్క నియోజకవర్గంలో కూడా ప్రశాంతంగా ఉండనివ్వకపోతే ఎలా అని అన్నారు. కొత్తగూడెంలో కాంగ్రెస్ మద్దతు లేకపోగా, తమకు, కాంగ్రెస్‌తోనే పోటీ జరిగిందన్నారు. కమ్యూనిస్టులు ఏంది అని అనుకున్న ప్రాంతాల్లో కాంగ్రెస్ దెబ్బ తిన్నదని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో సిపిఐకి మంచి ఫలితాలు వచ్చాయని, ప్రజలు తమపై విశ్వాసంతో 94 మంది సర్పంచ్‌లను, 104 మంది ఉప సర్పంచ్‌లను, 1015 వార్డులలో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించినందుకు ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**కేంద్రం తెచ్చిన 'శాంతి'తో భారతదేశానికి 'అశాంతి'**

భారతదేశ శత్రువులు అణు ఇంధన వ్యాపారం రూపంలో వచ్చి భారతదేశాన్ని ముక్కలు ముక్కలు చేస్తే ఎవరు బాధ్యులని సాంబశివరావు నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం అణు విద్యుత్ రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం అవకాశం కల్పిస్తూ ప్రవేశపెట్టిన 'శాంతి' బిల్లు భారతదేశానికి అశాంతి లాంటిదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వంద శాతం ఎఫ్‌డిఐ పెట్టుబడులకు అవకాశం కల్పించడంతో ఎల్‌ఐసి లాంటి సంస్థ ప్రైవేటు చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఇతర దేశాల తరహా భారతదేశంలో కూడా ప్రభుత్వాలు మారితే ప్రధాని మోదీకి ఉరిశిక్ష వేసే వారని అన్నారు. ప్రజల సొమ్మును విక్రయించేందుకు మోదీ ఎవరు? అని నిలదీశారు.

దేశ భక్తునిగా చెప్పుకునే మోదీ ప్రభుత్వం దేశ భక్తులా? లేదా దేశ ప్రజలను భక్షించే రాక్షస భక్తులా? అని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి జగన్‌మోహన్ రెడ్డి, చంద్రబాబు లాంటి వారు మద్దతు ఇస్తున్నారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీపేరును తొలగించడం మూర్ఖత్వమన్నారు.

## కక్ష్యలోకి బ్లూబర్డ్ బ్లాక్–2

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా శరవేగంగా అందుబాటులో ఉంటాయి. అమెరికాతోపాటు ఎంపిక దేశాలకు ఈ స్మార్ట్‌ఫోన్ సేవలు అందుబాటులో ఉంటాయి.

**గగనయాన్ దిశగా విశ్వాసాన్ని పెంచిన బాహుబలి ప్రయోగం ః ఇస్రో**

ప్రయోగం విజయవంతమైన తర్వాత ఇస్రో ఛైర్మన్ నారాయణన్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుండి మాట్లాడుతూ, దేశం తలపెట్టిన గగనయాన్ ప్రయోగానికి ఈ విజయం తమలో మరింత గొప్ప విశ్వాసాన్ని పెంచిందన్నారు. బాహుబలి ప్రయోగం భారత్‌కు ఎంతో ముఖ్యమైనదని, రాబోయే కాలంలో గగనయాన్ ప్రయోగంలో వ్యోమగాములను తీసుకువెళుతుందన్నారు. ఈ మిషన్ ద్వారానే వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకూ తొమ్మిదిసార్లు బాహుబలి వాహకనౌకను విజయవంతంగా ప్రయోగించామని చెప్పారు. 52 రోజుల వ్యవధిలో 'బాహుబలి' రాకెట్‌ను రెండుసార్లు ప్రయోగించామని చెప్పారు.

గడచిన నవంబరు రెండో తేదీన చాలా విజయవంతంగా ఈ వాహకనౌక ద్వారా ప్రయోగం జరిగిందని చెప్పారు. ఈ ప్రయోగ విజయం భారత దేశానికి క్రిస్‌మస్–న్యూ ఇయర్ కానుక అని సంతోషంగా చెప్పారు. ఈ ప్రయోగం ద్వారా ఇప్పటివరకూ 34 దేశాలకు చెందిన 454 ఉపగ్రహాలను ప్రయోగించినట్లయిందని ఇది గొప్ప విజయమని చెప్పారు. ఎంతో గొప్ప కృషికి ఇది దేశానికి లభించిన బహుమతి అన్నారు. ఇంకా మరింత కృషి చేయాల్సి ఉందని, తాము చేయవల్సిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయన్నారు. భారత్ భూభాగం నుండి ఇప్పటివరకూ చేసిన ప్రయోగాలలో ఎన్నడూలేనివిధంగా చాలా అత్యుత్తమస్థాయిలో ఈ ఉపగ్రహం చాలా ఖచ్చితత్వంతో స్థిరకక్ష్యలోకి ప్రవేశించి కుదుటపడిందన్నారు. "ఈరోజు ప్రయో గానికి మరో ప్రాముఖ్యత కూడా ఉంది. భారత్ భూభాగం నుండి ఇప్పటివరకూ ఇంత బరువైన భారీ ఉపగ్రహాన్ని ప్రయోగించలేదు. ఇంత భారీ ఉపగ్రహ ప్రయోగం ఇదే మొదటిసారి. దీని బరువు 6,100 కిలోలు, ఎంత తక్కువలో తక్కువ అనుకున్నాగానీ దీని బరువు 5,908 కిలోలు ఉంటుంది" అని నారాయణన్ చెప్పారు. ఈ ఉపగ్రహాన్ని 518.5 కి.మీ ఎత్తున ప్రవేశపెట్టామని చెప్పారు. 520 కి.మీ ఎత్తు కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలన్నది ఇస్రో లక్ష్యమని, ఈ ప్రయోగం ద్వారా లక్ష్యానికి ఇంకా 1.5 కి.మీ చేరువ కావాల్సి ఉందన్నారు.

గగనయాన్ మానవ రహిత ప్రయోగాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎల్‌ఎంవి 3 వాహకనౌక పట్ల ప్రపంచదేశాలలో ఆసక్తి పెరుగుతోందని న్యూ స్పేస్ ఇండియా తాత్కాలిక ఛైర్మన్, ఎండి పి.మోహన్ అన్నారు. చాలా తక్కువ సమయంలో ఈ ప్రయోగం చేశామని మిషన్ డైరెక్టర్ టి.విక్టర్ జోసఫ్ చెప్పారు.

## ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

### రాష్ట్ర ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంతటా క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏసు ప్రభువు బోధనలను అనుసరించి అన్ని మతాల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, క్రిస్టియన్ మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. అన్నిమతాల సారాంశం మానవత్వమేనన్నారు.

**రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు**

ఏసుక్రీస్తు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత, కె. చంద్ర శేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాపులను సైతం క్షమించమనే త్యాగశీలత, ఓర్పు, సహనం, మానవ సమాజానికి క్రీస్తు చూపిన అత్యద్భుతమైన అహింసా శాంతి మార్గమన్నారు. పీడన నుంచి విముక్తి లభించేలా దీవిస్తూ, రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఏసు క్రీస్తును కెసిఆర్ ప్రార్థించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పోలీసు శాఖలో కొనసాగుతున్న బదిలీల పరంపర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసు శాఖలో బదిలీల పరంపర కొనసాగుతుంది. పరిపాలన సౌలభ్యం, సమర్థవంతమైన పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎనిమిది మంది సీనియర్ అధికారులను బదిలీలు చేస్తూ బుధవారం హోంశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సిఐడి ఎస్‌పిగా కె.ప్రసాద్, కమాండ్ కంట్రోల్ ఎస్‌పిగా ఐ.పూజ, రాచకొండ అదనపు ఎస్‌పిగా ఎస్.రవి, ఎసిబి డిజి ఆఫీసుకు (అటాచ్) ఎస్.సూర్యనారాయణ, ఎస్‌వోటి అదనపు డిసిపిగా టి.గోవర్ధన్ ఇంటెలిజెన్స్ అదనపు ఎస్‌పిగా జి.నరేందర్, సైబరాబాద్ అదనపు డిసిపిగా ఎం.సుదర్శన్, హైదరాబాద్ సిటీ డిసిపిగా కె.వెంకటలక్ష్మి బదిలీ అయిన వారిలో ఉన్నారు. కాగా, ఈ బదిలీలతో పాటు పలువురు అదనపు ఎస్‌పి ర్యాంకు అధికారులకు కూడా కొత్త బాధ్యతలు అప్పగించారు. ఇటీవలి కాలంలో పోలీసు శాఖలో వరుస బదిలీలు చర్చనీయాశంగా మారాయి. ఈ మార్పులు పోలీసు వ్యవస్థలో మరింత సమన్వయం, సామర్థ్యం పెంపొందించడానికి దోహదపడతాయని పోలీసు ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

## ఆదర్శ రైతు వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించండి : కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఆదర్శ రైతు వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో రైతులకు రాష్ట్ర ప్రభుత్వానికి వారధిగా ఆదర్శ రైతులు పనిచేసే అవకాశం ఉంటుందని, వ్యవసాయ అధికారులకు మద్దతుగా ఆదర్శ రైతు వ్యవస్థ పనిచేస్తుందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు కోదండరెడ్డి లేఖరాశారు. ప్రభుత్వానికి కమిషన్ లేఖ ద్వారా వివరించింది. అనంతరం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారులు వేం.నరేందర్ రెడ్డి, సిఎంఒ కార్యదర్శి శేషాద్రిలను కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భూమి సునీల్ సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలు రైతులకు చేరడంలో ఆదర్శ రైతులు కీలకంగా పనిచేస్తారని ఆయన ఆ లేఖలో వివరించారు. ఆదర్శ రైతు వ్యవస్థను తిరిగి ప్రారంభించడం ద్వారా రైతులకు మరింత ప్రభుత్వ ఆలోచన విధా నం, పథకాలు తెలుస్తాయని వివరించారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడదని, ఇప్పటికే రైతు సంఘాలు, ఆదర్శ రైతులు కూడా ఎలాంటి గౌరవ వేత నం కూడా లేకుండా సేవ చేయడానికి ముందుకు వచ్చినట్టు వివరించారు. ఆద ర్శ రైతు వ్యవస్థ పట్ల అసెంబ్లీ సమావేశంలో చర్చించి, ఆమెదించేలా చేయాలని కోరారు.




హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్‌ను అవిష్కరిస్తున్న నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు పల్లా వెంకట్ రెడ్డి , సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎన్‌విఎస్ కార్యదర్శి బిఎస్‌ఆర్ మోహన్‌రెడ్డి గవర్నింగ్ బాడీ సభ్యులు విఎస్ బోస్, బొమ్మగాని ప్రభాకర్, కలవేన శంకర్, ఎన్. జ్యోతి, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, బాగం హేమంత రావు, మాజీ ఎంపి అజీజ్‌పాషా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఇటి నరసింహ్మ , ఎం.బాలనరసింహ్మ, బాలరాజు, పల్లా నర్సింహారెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు

## సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం
# నలుమూలలా ఎర్రజెండా ఎగరాలి

**ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'కటౌట్'ను ఆవిష్కరించిన పార్టీ శ్రేణులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ) ఏర్పడిన వందేళ్లలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ అన్నారు. 'డిసెంబర్ 26'న సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని, హైదరాబాద్ నలుమూలల్లో జెండాలను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. సిపిఐహైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగే సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హిమాయత్ నగర్‌లోని సిపిఐ హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం 'కటౌట్'ను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఇ.టి.నర్సింహ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేస్తున్న క్రమంలో సిపిఐ నిషేధానికి గురైందని, నాయకులపైన అక్రమ కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. కుట్ర కేసులను చేదిస్తూ జైలు జీవితాన్ని అనుభవిస్తూ నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన పార్టీ సిపిఐ అని అన్నారు. వేల ఎకరాలు కలిగిన భూస్వాములకు వ్యతిరేకంగా సిపిఐ పోరాటం చేసిందని, పేద ప్రజలకు ఆ భూములను పంపిణీ చేసిందని వివరించారు.భూ సంస్కరణలు, కౌలు దారుల రక్షణ చట్టం, ఆదివాసి ప్రాంతాలలో 1/70 యాక్ట్, ఇలా మొదలుకుని కార్మిక ,రైతాంగ కోసం అనేక హక్కులు, చట్టాలు సాధించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని ప్రాంతాల్లో పార్టీ జెండాలను, ఎగరవేసి,శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు కోసం సిపిఐ పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. విద్యార్థి, యువజన, మహిళ, సాంస్కృతిక , రచయిత, మేధావుల ,న్యాయవాదుల, డాక్టర్లతో పాటు సబ్బండ వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం సంఘాలను ఏర్పాటు చేసి, వారి సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం నిర్వహించిన ఘనచరిత్ర సిపిఐకి ఉన్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపైన భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రి, ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మూర్తి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టు కింది శ్రీనివాస్, బాలకృష్ణ ,కళ్యాణ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

- మహాత్మా గాంధీ పేరును తొలగించొద్దు
- ఇన్నయ్య అరెస్టుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి
- సిపిఐ శతవసంతాల ముగింపు సభను విజయవంతం చేయండి : చాడ వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మా గాంధీ పేరును కేంద్రం తొలగించ డం సరికాదని, మహ్మాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని అలాగే కొనసాగించాలని.. బడుగు బలహీన వర్గాలకు ఊతమిచ్చే చట్టాన్ని మార్పు చేయడం తగదని, చట్టంలో చేసిన మార్పులను సవరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, న్యాలపట్ల రాజులతో కలిసి బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ, రెక్కాడితే గాని డొక్కాడని పేదలకు వరప్రసాదమైన ఉపాధి హామీ చట్టంలో చేసిన మార్పుల కారణంగా వ్యవసాయ కార్మికులు, కూలీల బతుకులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటి వరకు ఈ చట్టంలో 90 శా తం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తూ,10 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేదని, ప్రస్తుతం కేంద్రం చేసిన సవరణలతో 60 శాతం మా త్రమే కేం ద్రం ఇస్తూ 40 శాతం రాష్ట్రాలు భరించాలనే విధంగా చట్టం లో మార్పులు చేశారన్నారు. పేదలకు ఉపాధి కల్పించే బాధ్యత నుంచి కేంద్రం తప్పుకుంటూ రాష్ట్రాల హక్కులను హరిస్తూ రాష్ట్రాల ను అప్పుల ఊబిలోకి నెట్టబోతుందన్నారు. కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా కుట్ర చేస్తుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అలాగే కొనసాగించాలని చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు మొదటి నుంచి మహాత్మా గాంధీ అంటే గిట్టదని అందుకే ఆయన పేరును తొలగించేందుకు పూనుకున్నారని అన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని, దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలని, గ్రామ స్వరాజ్యాన్ని కాంక్షించిన మహాత్మా గాంధీ పేరును తొలగించడం కక్షపూరిత చర్యగా బావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభు త్వం కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చే స్తుందన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టే నాటి కి 100 లక్షల కోట్ల అప్పులుంటే ప్రస్తుతం అవి 160 లక్షల కోట్ల అప్పులయ్యాయన్నా రు. ఎల్‌ఐసి సొమ్ము 29 వేల కోట్ల రూ పాయలను అదానికి అప్పజెప్పారని అన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ వంటి సంస్థలను నిర్వీర్యం చేసిన కేంద్రం ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థలను దారదత్తం చే సేందుకు పూనుకున్నదన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో వందల మంది మావోస్టులను చంపుతున్న కేంద్రం మోడ్రన్ టెక్నాలజీ సాయంతో నిర్బం దం కొనసాగిస్తుందన్నారు. అనాథ పిల్లల కోసం ఆశ్రమాన్ని నడుపుతున్న గాదె ఇన్నయ్యను ఎన్ఐఎ అరెస్టు చేయడాన్ని దుర్మార్గపు చర్యగా బావిస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నించే గొంతులను అణచి వేయడం దారుణమన్నారు. ఇన్నయ్యను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్న య్య అరెస్టుపై స్పందించాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల ఉత్సవాలలో భాగంగా జనవరి 18న ఖమ్మం పట్టణంలో నిర్వహించే ముగిం పు సభను విజయవంతం చేయాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గడిచిన వందేళ్లలో పేదల పక్షాన నిలబడి ఎన్నో ప్రజా పోరాటాలు నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందన్నారు. ఈ సభకు దేశంలోని కవులు, కళాకారులు, మేధావు లు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. లక్షల సంఖ్యలో ప్రజలు హాజరై ముగింపు సభలను విజయవంతం చేయాలని వెంకటరెడ్డి కోరారు.



హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్స్‌ను సందర్శించిన తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఎస్‌వి. సత్యనారాయణ. ఈ సందర్భంగా ఆయనకుపుస్తకాలను పరిచయం చేస్తున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోశాధికారి నారాయణ రెడ్డి.




# సాంకేతికత పెరిగినా తగ్గని పుస్తక ప్రాధాన్యత

- 'బుక్ వాక్' ప్రారంభోత్సవంలో సిఎస్. కె. రామకృష్ణారావు
- తరలివచ్చిన రచయితలు, సాహితీవేత్తలు, విద్యార్థులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మారుతున్న ప్రపంచంలో సాంకేతికత ఎన్ని మార్పులు తీసుకొచ్చినప్పటికీ, పుస్తకానికి ఉన్న విలువ ఏమాత్రం తగ్గలేదని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. 38వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన 'బుక్ వాక్'ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బుధవారం సాయంత్రం లోయర్ ట్యాంక్ బండ్ కట్ట మైసమ్మ ఆలయం నుండి ఎన్‌టిఆర్ స్టేడియంలోని అందే శ్రీ ప్రాంగణం (బుక్ ఫెయిర్) వరకు ఈ యాత్ర ఉత్సాహంగా సాగింది.

**జ్ఞానానికి వారధి.. పుస్తకం**

ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ పుస్తకాలు అనేవి మనల్ని మరో లోకానికి తీసుకెళ్లే అద్భుతమైన కిటికీల వంటివని అభివర్ణించారు. వ్యక్తిగత వికాసంతో పాటు ఇతరుల జీవిత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవడానికి పఠనం ఒక వారధిలా ఉపయోగపడుతుందన్నారు. బాహ్య ప్రపంచం వేగంగా మారినా, పుస్తకాల ద్వారా పొందే జ్ఞానం శాశ్వతంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

**తరలివచ్చిన సాహితీ లోకం..**

హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకుబ్, ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి, కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ బుక్ వాక్‌లో తెలుగు సాహిత్య, పాత్రికేయ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, సుద్దాల అశోక్ తేజ, వేణుగోపాల్. విరాహత్ అలీ, వల్లీశ్వర్, విజయ్‌కుమార్, శిల్పి రమణారెడ్డి, మల్లేపల్లి లక్ష్మ య్య, ఎకె ప్రభాకర్, ఆనందా చారి, మోహన కృష్ణతో పాటు రచయితలు ఎస్.వి.సత్యనారాయణ, నిఖిలేశ్వర్, బిఎస్. రాములు, జయదేవ్, మెర్సీ మార్గరెట్, సజయ్, రియాజ్, వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొని పఠనాసక్తిని చాటారు.

**పుస్తక విరాళం**

ఈ సందర్భంగా బుక్ ఫెయిర్ ప్రాగణంలో ఏర్పాటు చేసిన 'బుక్ డొనేషన్ బాక్స్'ను తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛా న్స లర్ ఎస్‌వి. సత్యనారాయణ ప్రారంభించి, పుస్తక దాన ప్రాధాన్యతను వివరించారు.

## గ్రామీణ మహిళలకు అండగా ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ భవనాలు

**రూ.10 లక్షల వ్యయంతో ప్రతీ గ్రామంలో మహిళా భవనాలు : మంత్రి సీతక్క**


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలు, ఫెడరేషన్‌లకు శాశ్వత వేదికగా నిలిచే భవనాల నిర్మాణానికి సవరించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. గ్రామస్థాయిలో మహిళా సంఘాల బలోపేతానికి ఇది చారిత్రాత్మక ముందడుగు అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో గ్రామ సంస్థలు (విఒలు),కోసం శాశ్వత భవనాల నిర్మా ణం చేపట్టాలని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వానికి ఎం తో కాలంగా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

**ఒక్కో భవనానికి గరిష్టంగా రూ.10లక్షలు**

ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ల కోసం ఒక్కో భవనానికి గరిష్టంగా రూ.10 లక్షల వరకు వ్యయం చేయనున్నామని సీతక్క చెప్పారు. 200 గజాల్లో, కనీసం 552 చదరపు అడుగుల్లో భవనం ఉండేలా డిజైన్ సిద్ధం చేశారు.మంత్రి సీతక్క మాట్లాడుతూగ్రామీణ మహిళలు కేవలం పొదుపు సంఘాలకే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి, నిర్ణయాధికార కేంద్రాలుగా ఎదగాలని, అందుకే ప్రతి గ్రామంలో ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ భవనం ఉండాలే చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహిళలకు గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణలో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ

- నిలబెట్టేలా కార్యాచరణ రూపొందించాలి
- రవాణా శాఖ అధికారులకు మంత్రి పొన్నం అదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన సంవత్సరం జనవరి1నుంచి నెల రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమాల్లో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టాలా కార్యాచరణ రూపొందించాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మాసోత్సవాల్లో మంత్రులు ,ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, జిల్లా కలెక్టర్ లు ,పోలీస్ అధికారులను ,నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు పాల్గొనేలా ఆర్‌టిఎ సభ్యులు ఆహ్వానించాలని సూచించారు. విద్యార్థులు ,లారీ ,స్కూల్ బస్ డ్రైవర్లు ,అంబులెన్స్ డ్రైవర్లు భాగస్వామ్యం చేయాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ఏర్పాట్లపై బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధింత అధికారులతో జూమ్ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి రాజధాని వరకు ఉన్న ప్రతి స్కూల్ , కాలేజి లలో రవాణా శాఖ అధికారి స్వయంగా వెళ్లి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాల వల్ల 20 మంది వరకు మరణిస్తున్నారని, దీనిని జీరో కి తగ్గించడమే లక్ష్యంగా అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ లయన్స్ క్లబ్,రోటరీ క్లబ్ లను భాగస్వామ్యం చేసి వారిని జనవరి 26 న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంస పత్రంతో సత్కరించాలని తెలిపారు.

**జిల్లాల వారిగా రోడ్డు భద్రతా ర్యాలీలు :** జిల్లాల్లో రోడ్డు భద్రతా ర్యాలీలు నిర్వహించాలని మంత్రి అదేశించారు. వాక్ థన్‌లు , హెల్మెట్ అవగాహన కార్యక్రమాలు , రిపబ్లిక్ డే వేడుకల్లో రవాణా శాఖ శకటాల ప్రదర్శన ,రంగోలి, క్విజ్ , వ్యాసరచన పోటీలు , సీటు బెల్ట్,కంటి పరీక్షలు, బ్లెడ్ డొనేషన్ క్యాంపులు,పాఠశాల బస్సుల భద్రతా తనిఖీలు , పాదచారుల భద్రత అవగాహన , ఓవర్ లోడింగ్ , విద్యార్థులకు వర్క్ షాపులు తదితర కార్యక్రమాలు జిల్లాల్లో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జెటిసి లు చంద్రశేఖర్ గౌడ్‌రమేష్ ,శివ లింగయ్య, డిటిసిలు, ఎంవిఐలు, ఎఎంవిఐలు పాల్గొన్నారు.

# బొగ్గు టెండర్లలో 'జెన్‌కో'ను తప్పించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్' అధ్యక్షుడు వి.సీతారామయ్య




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన బొగ్గు టెండర్లలో ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కో కంపెనీ పాల్గొనకుండా చూడాలని, తద్వారా ఆ టెండర్ సింగరేణి సంస్థకు దక్కుతుందని సింగరేణి సంస్థలో గుర్తింపు పొందిన 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్' అధ్యక్షుడు వి.సీతరామయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గతంలో కోల్ టెండర్‌ను దక్కించుకున్న జెన్‌కో ఒక ప్రైవేటు సంస్థకు ఆ పనులను అప్పగించిందని, ప్రస్తుతం కూడా అదే జరుగుతుందని, అందుకే టెండర్ ప్రక్రియ నుంచి తప్పుకునేలా చూడాలన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ,ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌తో కలిసి వి. సీతారామయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో కోల్ టెండర్‌లో పాల్గొనకపోవడంతో ఆ టెండర్ ఒక ప్రైవేటు కంపెనీ దక్కించుకుందని,అందుకే ఈ ప్రస్తుత టెండర్‌లో సింగరేణి సంస్థ కూడా పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఏ ప్రైవేటు సంస్థలు కూడా టెండర్ వేయలేదని, కేవలం సింగరేణి, ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కో మాత్రమే టెండర్‌లో పాల్గొన్నదని వివరించారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి డొల్లగా ఉన్నదని, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి కో రూ. 45 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలకు సింగరేణి సంస్థ రూ.10 కోట్లను స్పాన్సర్ చేసిందని, కానీ సింగరేణి వద్ద నిధుల సమస్యతో ఆవిర్భావ దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా సింగరేణి సంస్థలో జోక్యం చేసుకునేది కాదని, కానీ బిఆర్ఎస్ అధికారంలోనికి వచ్చిన తర్వాతే జోక్యం పెరిగిందని, దీంతో క్రమశిక్షణ లోపించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుంటుందని అన్నారు. మెడికల్ బోర్డ్ సమావేశాలు కూడా జరగడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని ప్రవేశపెట్టేందుకు అంగీకరించి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే అందరినీ కలుపుకుని ఆందోళనకు దిగుతామని సీతారామయ్య తెలిపారు.

## పేదల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జి రామ్ జి చట్టం పేరుతో గ్రామీణ ఉపాధి హామీ పేదల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తున్నదని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ విమర్శించారు. పేదల అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నూతన సర్పంచ్‌లు పోరాటం చేయాలని, జి రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని నూతన గ్రామపంచాయతీ పాలక వర్గాలకు విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి కార్యక్రమాలలో 6040 నిధుల వాటా పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపి గ్రామీణ ఉపాధిని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద రాష్ట్రాలు ఆర్థిక భారాన్ని ఏ విధంగా భరిస్తాయని ఆయన ప్రశ్నించారు. మహాత్మా గాంధీని గాడ్సే చంపితే గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరుతో మార్చడం ద్వారా గాంధీ పేరును చంపాలని ప్రధాని మోదీ, మంత్రి అమిత్ షా చూస్తున్నారన్నారు. ఢిల్లీలో ఉన్న వారికి గ్రామాల గురించి ఏమి తెలుస్తుంద ని ఆయన ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్‌లు పేదలకు వ్యతిరేకంగా ఉన్నాయని, పేద వర్గాలకు వ్యతిరేకంగా జిరామ్‌జి చట్టాన్ని తీసుకువచ్చి పేదలను ముంచి కార్పోరేట్ శక్తులకు దోచి పెట్టాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ GHMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
NIT No. 40/GHMC/MPT/EE/2025-26, పని పేరు: కమ్యూనిటీ హాల్ పని. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: 27.12.2025న మ.3.00గం.ల నుండి 31.12.2025న ఉ.10.30గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ ఇ.యు.రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట్ సర్కిల్-23. సెల్ నెం. 9949994029. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, మూసాపేట్ డివిజన్-23.
DIPR R.O. No. : 12565-PP/CL/ADVT/1/2025-26, Date: 24-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## జిహెచ్ఎంసిలో సమీప మున్సిపాల్టీల విలీనంపై పిటిషన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : జీహెచ్ఎంసీలో తుక్కుగూడ ఇతర మున్సిపాల్టీలను విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్సు సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ బెంచ్ విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శు లను ఆదే శించింది. విచారణను వచ్చే నెలాఖరుకు వాయిదా వేసింది. జీహెచ్ఎంసీ సమీప, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం కోసం వెలువరించిన ఆర్డినెన్స్ చట్ట వ్యతిరేకమంటూ రంగారెడ్డి జిల్లా తుక్కు గూడకు చెందిన బి. రాజు పిటిషన్ వేశారు. తమ అభిప్రాయాలతో సంబంధం లేకుండా ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా విలీన ఆర్డినెన్స్ జారీ అయ్యిందని పిటిషనర్ వాదన.



ఈ నెల 30 న వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహా స్వామి వారి పుణ్యక్షేత్రాన్ని దర్శించాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆహ్వానం అందజేసిన ఆలయ ఈఓ వెంకట్రావు, ఆలయ అర్చకులు.

## యుపిఎస్‌సికి డిజిపి అర్హుల లిస్ట్ పంపండి

ప్రజాపక్షం/హైదరాబాద్ : డిజిపిగా శివధర్రెడ్డి నియామకం సుప్రీం కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా జరిగిందంటూ దాఖలైన పిటిషన్ను విచారించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డీజీపీ పోస్టుకు అర్హులైన వాళ్ల లిస్టు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)కి పంపాలంది. ఆ లిస్టోని పేర్లను యూపీఎస్సీ ఆమోదించాక రిపోర్టుతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రాన్ని ఆదేశిం చింది. విచారణను వచ్చే నెలాఖారుకు వాయిదా వేస్తూ జస్టిస్ పుల్లా కార్తీక్ బుధవారం ఆదేశించారు. సుప్రీంకోర్టు గైడ్లైన్స్ అమలు చేయకుండా డిజిపిగా శివధర్రెడ్డిని ప్రభుత్వం నియమించిందంటూ హైదరాబాద్కు చెందిన ధన్గోపాల్రావు వేసిన రిట్ను కొట్టేయాలనీ ఏజీ సుదర్శన్రెడ్డి వా దించారు. యూపీఎస్సీకి లిస్ట్ పంపామని, అయితే, అందులో ఏపీకి కేటా యింపు జరిగిన మహిళా ఐపీఎస్ అధికారిణి ఉండటంపై అభ్యంతరం వచ్చిందని చెప్పారు. అభిలాష బిస్త్ను ప్యానెల్లో చేర్చడంపై సందేహాన్ని వ్యక్తం చేయడంలో ఆలస్యం అయ్యిందన్నారు. ప్రభుత్వం సహకరించడం లేదని, తగిన సమాచారం ఇవ్వడం లేదని యూపీఎస్సీ న్యాయవాది చెప్పారు.

### ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను
## ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలి
### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి అన్నారు. హైదరాబాద్,కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో బుధవారం జరిగిన ఎస్‌టియు టియస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పల్లా వెంకటరెడ్డి, అతిథిగా సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నూతన మార్పులు తీసుకురావాలన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు అని అన్నారు. అనంతరం నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రయోజనం,ప్రభుత్వ పాఠశాలల బలోపేతం లక్ష్యంగా ఎస్‌టియు పని చేస్తోందన్నారు. ఎస్‌టియు అధ్యక్షులు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ జాతీయ స్థాయిలో ఉమ్మడి ఉద్యమాలు చేపడుతున్నామన్నారు. 'ఈకుబేర్'లో పెండింగ్‌లో ఉన్న జి పిఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, మెడికల్, సరెండర్ లీవ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని వారు కోరారు. పిఆర్‌సి గడువు ముగిసి రెండున్నర సంవత్సరాల కాలం పూర్తయిందని, పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని కోరారు. సర్వీస్ రూల్స్ రూపొందించి, అర్హులైన ఉపాధ్యాయులకు ఎంఇఒ , డిప్యూటీ ఇఒ, డైట్, జూనియర్ లెక్చరర్లకు పదోన్నతులలు కల్పించాలని తెలిపారు. జిఒ 190 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను త్వరితగతిన వారి సొంత జిల్లాలకు డిప్యూటేషన్ చేసే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని , ఆశ్రమ, కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టి ఉపాధ్యాయులకు అన్ని రకాల సెలవులతో పాటు, కనీసం టైమ్ స్కేల్ మంజూరు చేయాలని కోరారు. మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా, సిపిఎస్‌ను రద్దుచేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని భాషా పండిత పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్ గ్రేడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సాబేర్ అలి, ఎ. వి. సుధాకర్, ఎల్. ఎం. ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, రంగారావు, రవీంద్ర, శీతల్ చౌహాన్, భార్గవి, అజా తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐ వంద సంవత్సరాల.. పాట, లోగో ఆవిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ రాష్ట్ర సమితి సౌజన్యంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మహబూబాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి రచించిన 'సిపిఐ వంద సంవత్సరాల సిపిఐ 1000 ఏళ్లు వర్ధిల్లు, శతాబ్ది సిపిఐ శతాబ్దాలుగా సాగిపో' అనే పాట, లోగోను హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు,జాతీయ కార్యదర్శి,మాజీ ఎంఎల్‌ఎ కె.రామకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,పాట రచయిత బి విజయసారథి, పంజాల రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు, రామకృష్ణ మాట్లాడుతూ పాట రాసిన అజయ్ సారధిని అభినంధించారు. గతంలో మూడు దశాబ్దాల తెలంగాణ జాతి పోరు పాటను కూడా రచించారని గుర్తు చేశారు. భవిష్యత్తులో అజయ్ సారధి మరిన్ని మంచి పాటలను రాయాలన్నారు. కాగా ఈ పాటకు స్వరకల్పన,గానం సారిహరన్,ఈ పాటకు మ్యూజిక్ డైరెక్టర్ కళ్యాణ్ కిస్ సంగీతాన్ని అందించారు. బండ వెంకన్న,కె.పాండురంగ చారి, కె.దాసు రమేష్ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, కట్లోజు పాండురంగాచారి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, కెదాసు రమేష్ , అనిల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు ద్రోహం చేస్తున్న పార్టీలు
### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకటరాములు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల శీతాకాల పార్లమెంటు సమావేశాల సందర్భంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లుపై చర్చించకుండా బిసిలను బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ తదితర పాలక వర్గ పార్టీలన్నీ మోసం చేశాయని టి.వెంకట్ రాములు అన్నారు. హిమాయత్ నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాలులో జరిగిన బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి రాజ్యాంగ సవరణ చేసి, తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చేంతవరకు బిసి హక్కుల సాధన సమితి దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో బిసిలకు 22 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాస్తవానికి 17 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, జనరల్ స్థానాలలో అగ్రకులాల ఆధిపత్యాన్ని అక్రమాలను బెదిరింపులను సైతం ఎదుర్కొని పోటీ చేసి బిసిలు 50శాతం పైగా గెలుపొందడం హర్షనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు మాట్లాడుతూ డిసెంబర్ 29న అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రిజర్వేషన్ల అంశంతో పాటు ఇతర కామారెడ్డి బిసి డిక్లరేషన్ హామీలను పరిష్కరించాలని కోరుతూ ధర్నాలకు పిలుపిచ్చారు. సమావేశంలో మాజీ ప్రధాన కార్యదర్శి రాయబండి పాండురంగ చారి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి వెంకటేశ్వర్లు. రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి. గీతపనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజె సాయిలు గౌడ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ దశరథ కార్యవర్గ సభ్యులు జి కృష్ణ ,ఎ బాపురాజు పి.విజయుడు నరసమ్మ, జి.రాములు, పి. శ్రీనివాస్, కె.మల్లాచారి తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీ ఎన్నికలు సామాజిక మలుపునకు ప్రతీక
### బిసి హక్కుల సాధన సమితి




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు ఒక సామాజిక మలుపునకు ప్రతీకగా నిలిచాయని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. హైదరాబాద్,హిమాయత్‌నగర్‌లో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి బిసిముఖ్య నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ బిసిల రాజకీయ చైతన్యాన్ని, వారి సంఘటిత శక్తిని, బిసిల స్వాభిమానాన్ని చాటాయన్నారు.గ్రామ స్థాయిలో బిసి వాదం ఎంత లోతుగా ప్రజల్లోకి వెళ్లిందో పంచాయతీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయన్నారు. రాష్ట్రంలో మొత్తం 12,760 గ్రామ పంచాయతీలు ఉండగా. వీటిలో 2,537 గ్రామ పంచాయతీలు ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు రిజర్వ్ చేయగా, ఈ ఏజెన్సీ ప్రాంతాలను మినహాయిస్తే,మిగిలిన 10,023 గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్లను కేటాయించారని, ఎస్‌సిలు 2,090,ఎస్‌టిలకు 714,బిసిలకు 2,186, జనరల్ కేటగిరీలో 5,233 గ్రామపంచాయతీలు కేటాయించారని వివరించారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలకు కేవలం 21.38 శాతం మాత్రమే రిజర్వేషన్ దక్కడం, వ్యవస్థాగత అన్యాయానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో బిసి రిజర్వ్ అయిన 2,186 సర్పంచ్ స్థానాలతో పాటు, జనరల్ కేటగిరీల్లో మరో 2,937 స్థానాల్లో బిసిలు విజయం సాధించారని, 50.11 శాతం స్థానాలను గెలుచుకున్నారని వివరించారు. బిజెపి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని,పార్లమెంట్‌లో బిసి బిల్లులను అడ్డుకోవడం ద్వారా బిసిల నోటి కాడి కూడును దూరం చేసిన పార్టీగా బిజెపి పట్ల ప్రజలలో అభిప్రాయం ఏర్పడిందన్నారు.లోకసభ ఎన్నికలలో 8 స్థానాలు గెలుచుకున్న బిజెపికి పంచాయతి ఎన్నికలలో కేవలం 688స్థానాలు(5.40 శాతం) గెలిచి ప్రజా ఆగ్రహానికి గురైందని అన్నారు. భవిష్యత్తులో బిసి వాదాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లి, ఉద్యమాన్ని బలంగా నిర్మిస్తే భవిష్యత్తు బిసిలదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాపు రాజు ప్రధాన కార్యదర్శి కృష్ణ గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, నరసమ్మ పాల్గొన్నారు.



## ఎక్సైజ్ సిఐ, ఎస్ఐల రాష్ట్ర కమిటీ ఏర్పాటు
### అధ్యక్షులుగా సిఐ సూర కృష్ణయ్య

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐలు, ఎస్ఐల సంఘం ఎన్నికలు హైదరాబాద్‌లోని రైల్వే ఆఫీసర్ క్లబ్‌లో జరిగాయి. తొలిసారిగా ఏర్పడిన ఈ సంఘానికి తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల కేంద్ర సంఘం (టిజిపిఇఇఒసిఎ)గా ఏర్పడింది. ఈ సంఘంలో తెలంగాణ ఎక్సైజ్‌శాఖలోని 762 మంది సిఐలు, ఎస్ఐలు సభ్యులుగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో టిజిపిఇఇఒసిఎ అధ్యక్షుడిగా సిఐ సూర కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఐ కె.చిరంజీవి, కోశాధికారిగా డి.భాస్కర్ రావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా టిజిపిఇఇఒసిఎ సంఘానికి ఎన్నికైన కార్యవర్గంతో పాటు సిఐలు, ఎస్ఐలు కలిసి ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్, అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషిలను మర్యాద పూర్వకంగా కలిశారు.

## 'పాలమూరు'కు 27వేల ఎకరాలు భూసేకరణ
### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం 27 వేల ఎకరాల భూసేకరణ చేసిందని బిఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బిఆర్ఎస్ హయాంలో జరిగిన పనులకు బిల్లులు మాత్రమే చెల్లించిందని, కనీసం రూ.500 కోట్ల పనులు చేసినా చూపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఆరు నెలలు పనులు చేపడితే, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీళ్లు అందేదని అన్నారు. 2023 సెప్టెంబరులోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు అటవీ అనుమతులు వచ్చాయని, 2023, మార్చి 17న కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ అనుమతులు ఇచ్చిందని, జూన్ ,2023లో సెంట్రల్ సాయిల్, మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ నుంచి అనుమతులు దక్కాయని ఆయన వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పని కూడా చేపట్టలేదన్నారు. ఏపిలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన కేంద్రంపైన వత్తిడి తీసుకొచ్చి డిపిఆర్‌ను వెనక్కి పంపించారని ఆరోపించారు. జూరాలలో 6.5 టిఎంసిల నీళ్లు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ఇక్కడికి 25 నుండి 30 రోజులు మాత్రమే వరద వస్తుందని, జూరాలపైన కుడి, ఎడమ కాలువల కింద లక్ష 10 వేల ఎకరాలు, భీమా ఫేజ్ 1, 2 కలిపి 2.3 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు 2 లక్షల ఎకరాలు, కోయిల్ సాగర్ 46 వేల ఎకరాలు ఆధారపడి ఉన్నాయని, జూరాల కింద నీళ్లు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతోనే క్రాప్ హాలిడే ప్రకటించారని వివరించారు. కేంద్ర జల వనరుల శాఖ సలహాదారుగా పనిచేసిన వెదిరె శ్రీరాం సెక్షన్ 3 కింద నీటి వాటా తేల్చాలని కేంద్రానికి ఎందుకు సలహా ఇవ్వలేదని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్ఎలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్దన్ రెడ్డి, మాజీ శాట్స్ చైర్మన్ ఆల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

### జనవరి మొదటి వారంలో
## 'రైతు యాంత్రీకరణ' పునఃప్రారంభం
### మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్: 'రైతు యాంత్రీకరణ' పథకాన్ని జనవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పునఃప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆపేసిన కేంద్ర ప్రభుత్వ పథకాలలో ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని, ఇప్పటికే జాతీయ ఆహర భద్రత మిషన్‌లో భాగంగా పప్పుదినుసుల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని, ప్రస్తుతం రైతు యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించాలని సిఎం నిర్ణయించినట్టు తుమ్మల వివరించారు. ఈ పథకంలో భాగంగా 1,31,000 మంది రైతులకు సబ్సిడీపై వివిధ పనిముట్లు/యంత్రాలు అందజేయనున్నట్టు వివరించారు. రైతు యాంత్రీకరణ పథకం కింద ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ ప్రక్రియను పూర్తిచేసి, రైతులకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఐదేళ్ల కాలంలో రైతుబంధు పేరుతో రైతు యాంత్రీకరణ పథకాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు జనవరి మొదటి వారంలో మండలాల వారిగా పర్యటించి, రైతులకు అందుతున్న సబ్సిడీలు, యాంత్రీకరణ పథకం దరఖాస్తులు, యూరియా యాప్ అమలు తదితర అంశాలపై క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ సేకరించాలని మంత్రి సూచించారు. కేంద్ర పథకాల కోసం స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి రూ 400 కోట్లను వినియోగించామని వివరించారు. ఆయిల్ పామ్ వంటి దీర్ఘకాలిక ఆదాయం ఇచ్చే పంటల సాగును ప్రోత్స హించేందుకు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రైతులకు సబ్సిడీలు అందిస్తూ, ఆయిల్ పామ్ పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని అధికారులను ఆదేశించారు. యూరియా యాప్‌పైన ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, ఇప్పటికే ఐదు జిల్లాల్లో యూరియా యాప్ సమర్థవంతంగా అమలవుతోందని, రైతులు కూడా దీనిపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రబీ సీజన్ రైతుభరోసా కోసం శాటిలైట్ ఇమేజ్ మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసి, రైతుభరోసా నిధులు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు.

### నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల
## 'ఫస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్' విడుదల
### 27వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో 2,322 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టుల భర్తీ ప్రక్రియలో మరో కీలక దశ పూర్తయింది. ఈ పోస్టులకు సంబంధించిన 'ఫస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్'ను తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బి) విడుదల చేసింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సిబిటి) రాసిన మొత్తం 40,423 మంది అభ్యర్థుల వివరాలను, వారు సాధించిన మార్కులతో సహా బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు బోర్డు ప్రతి దశలోనూ అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తోంది. సీబీటీ, కాంట్రాక్ట్,అవుట్‌సోర్సింగ్ సర్వీసు వెయిటేజీ మార్కులపై ఆగస్టులోనే ఒక దఫా అభ్యంతరాలను స్వీకరించి, అభ్యర్థుల సందేహాలను బోర్డు నివృత్తి చేసింది. తాజాగా విడుదల చేసిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాపైనా అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే తెలిపేందుకు మరోసారి అవకాశం కల్పించింది.

**27 వరకు గడువు :** అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు బోర్డు వెబ్‌సైట్‌లో లాగిన్ అయి తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థుల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం రెండవ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్'ను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత మెరిట్ ఆధారంగా 1:1.5 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తామని బోర్డు వెల్లడించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం,ఉద్యోగాలకు ఎంపికైన వారి తుది జాబితాను విడుదల చేయనున్నారు.

జనవరిలో ఉద్యోగాల్లోకి....

ఇటీవలే 1260 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల నియామక ప్రక్రియను బోర్డు పూర్తి చేసింది. ఈ1260 మంది ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు,ఉద్యోగాలు ఎంపికయ్యే 2322 మంది నర్సింగ్ ఆఫీసర్లు కూడా జనవరిలోనే ఉద్యోగాల్లో చేరే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. గతేడాది 7 వేలకు పైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు మరో 2322 పోస్టులను భర్తీ చేస్తోంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుల కొరత పూర్తిగా తీరనుండడంతో పాటు అవసరానికి సరిపడా సిబ్బంది అందుబాటులో ఉంటారని డాక్టర్లు చెబుతున్నారు.

రెండేళ్లలో 11 వేలకుపైగా పోస్టుల భర్తీ..

ఆరోగ్యశాఖలో గడిచిన రెండేళ్లలోనే 11 వేలకుపైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇందులో 9 వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు, 600లకుపైగా డాక్టర్ పోస్టులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తదితర పోస్టులను భర్తీ చేశారు. 2026లో మరో 5 వేలకుపైగా పోస్టులు భర్తీ చేయనున్నారు.. ఇందుకు సంబంధించి ప్రక్రియలో తుది దశలో ఉంది.ఇందులో 1600లకుపైగా స్పెషలిస్ట్ డాక్టర్(సిఏఎస్ స్పెషలిస్ట్) పోస్టులు, 600లకు పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 700లకుపైగా ఫార్మసిస్ట్ పోస్టులు, సుమారు 2 వేల వరకూ మల్టీ పర్పస్ మహిళ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి.

## హైకోర్టు నిర్ణయంపై 'సుప్రీం' ను ఆశ్రయిస్తా
### ఉన్నావ్ అత్యాచార బాధితురాలు వెల్లడి


**ఉన్నావ్ / బల్లియా (యుపి) :** అత్యాచార దోషియైన బిజెపి నాయకుడు కుల్‌దీప్ సింగ్ సెంగర్ జైలు శిక్షను నిలుపుదల చేస్తూ ఢిల్లీ హైకోర్టు తీసుకున్న నిర్ణయంపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నానని, ఆయన జైలుశిక్షను సస్పెండ్ చేయడం తన కుటుంబానికి 'కాల్' (మరణం) లాంటిదని ఉన్నావ్ అత్యాచార (2017 సంవత్సరం) బాధితురాలు బుధవారం పేర్కొన్నారు. ఈ కేసులో జీవిత ఖైదును అనుభవిస్తున్న కుల్‌దీప్ సింగ్ సెంగర్ శిక్షను మంగళవారం ఢిల్లీ హైకోర్టు సస్పెండ్ చేసింది. 2019 డిసెంబరులో ట్రయల్ కోర్టు అతడిని దోషిగా నిర్ధారించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన అప్పీల్‌ను పరిష్కరించే వరకూ బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. బాధితురాలి నివాసం నుండి 5 కి.మీ. పరిధిలో సెంగర్ రాకూడదని, బాధితురాలిని లేదా ఆమె తల్లిని బెదిరించడం చేయకూడదని, అలాంటి చర్యలకు పాల్పడినట్లయితే అతడి బెయిల్ దానంతటదే రద్దు అవుతుందని తన ఆర్డర్‌లో తెలియజేసింది.అయితే బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన కేసులో కుల్‌దీప్ సింగ్ సెంగర్ 10 సంవత్సరాల జైలుశిక్షను అనుభవించినందున, ఆ కేసులో అతడికి బెయిల్ లభించలేదు. కారణంగా ఆయన జైలులోనే ఉంటారు. 2017లో సెంగర్ కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన మైనర్ బాధితురాలు స్పందిస్తూ 'పిటిఐ'తో ఢిల్లీ నుండి ఫోన్‌లో మాట్లాడారు. తన కుటుంబ సభ్యులకు, న్యాయవాదులకు, సాక్షులకు భద్రతను ఇప్పటికే ఉపసంహరించుకున్నామ,'కోర్టు నిర్ణయం తన బాధను మరింత పెంచిందని చెప్పారు. ఇలాంటి కేసులో దోషికి బెయిల్ లభిస్తే దేశంలోని మిగతా కూతుళ్లు ఎలా సురక్షితంగా ఉండగలరని ఉన్నావ్ అత్యాచార బాధితురాలు ప్రశ్నించారు. మాకు ఈ నిర్ణయం 'కాల్' (మరణించడం) కంటే ఎక్కువ కాదు' అని ఆమె వ్యాఖ్యానించారు. 'డబ్బు ఉన్నవారు గెలుస్తారు. డబ్బులేనివారు ఓడిపోతారు' అని ఆమె తన తల్లితో కలిసి ఢిల్లీలో మండీ హౌస్ దగ్గర నిరసనకు వెళుతూ తాను హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

**మృత ఆర్థికవ్యవస్థగానే కాదు.. మృత సమాజంగా కూడా మారుతోంది : రాహుల్‌గాంధీ**

భారతదేశం మృత ఆర్థికవ్యవస్థగా మారటమే కాకుండా ఒక బాధితురాలి విషయంలో మృత సమాజంగా కూడా మారుతోందని కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్‌గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఉన్నావ్ అత్యాచార బాధితురాలి పట్ల దుర్మార్గంగా ప్రవర్తించడం దారుణమన్నారు. నిందితుడు కుల్‌దీప్ సింఘ్ సెంగర్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో నిరసన తెలుపుతున్న బాధితురాలి పట్ల ఆమెలో భయాన్ని పెంచేలా దుర్మార్గంగా, అగౌరవంగా వ్యవహరించడం శోచనీయమని, ఆమెపట్ల గౌరవంగా వ్యవహరిస్తూ న్యాయం కల్పిస్తామని భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఈ విషయమై తన 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో స్పందించారు.

### పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో
## నిర్వాకం బయటపడటంతో..

ప్రజాపక్షం/హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో సిఎం రేవంత్ రెడ్డి తన నిర్వాకం బయటపడటంతో తట్టుకోలేక అహంకారంతో అరుస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. నీటి హక్కులపై రాజీపడిన విషయాన్ని బయటపెడితే సమాధానం చెప్పలేక చిల్లర డైలాగులతో చిందులు తొక్కడం రేవంత్ నైజమని కెటిఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పనికిమాలిన శపథాలు చేయడం, తీరా సమయం వచ్చాక పత్తా లేకుండా పారిపోవడం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. శాసనసభ సమావేశాల్లో, జనసభలోనూ ప్రతిచోటా కాంగ్రెస్ చేస్తున్న జలద్రోహాన్ని తాము ఎండగడతామని అన్నారు. 2028 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టడం ఖాయమని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 'ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్'కు చురుకైన మద్దతు: ద్రౌపదిముర్ము

**న్యూఢిల్లీ :** దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం, లోకల్ సప్లయ్ చైన్స్‌ను బలోపేతం చేయడం, దేశీయ పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా కేంద్రం ప్రతిష్ఠాత్మకమైన 'ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్'కు చురుకుగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ఆమె బుధవారం ఇక్కడి రాష్ట్రపతి భవన్‌లో తనను కలిసిన ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ ఆఫీసర్స్ సమూహాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఆఫీసర్లుగా ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని, నిధులను సమర్థవంతంగా వినియోగించడానికి సాక్ష్యం ఆధారిత నిర్ణయాలకు మద్దతు ఇవ్వడానికి కృత్రిమ మేధస్సు ఆధారిత ఆర్థిక విశ్లేషణలు వంటి సాధనాలను ఉపయోగించాలని రాష్ట్రపతి కోరారు. 'యువ అధికారులుగా మీలో చాలామంది మీ కెరీర్ ప్రారంభంలో అధిక విలువైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రతిపాదనలను ఎదుర్కొంటారు. ఇది ఒక ప్రత్యేక హక్కు, బాధ్యత కూడా. మీరు సమగ్రత యొక్క అత్యున్నత ప్రమాణాలను కాపాడుకోవాలని భావిస్తున్నారు' అని రాష్ట్రపతి ముర్ము చెప్పారు

### తీవ్రమైన లోపాలున్న ఆరావళీ పర్వతాల

## పునర్నిర్వచనాన్ని విస్తృతం చేస్తున్నారెందుకు?

- మోదీ సర్కార్‌ను నిలదీసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** ఆరావళీ పర్వతాల విషయంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. తీవ్రమైన లోపాలున్న ఆ పర్వతాల పునర్నిర్వచనాన్ని ఎందుకు ముందుకు తీసుకెళ్తోందని నిలదీసింది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఆరావళీ పర్వతాల పునర్నిర్వచనాన్ని ఫారెస్ట్ సర్వే, సుప్రీంకోర్టు కేంద్ర సాధికార కమిటీ, సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ వ్యతిరేకించాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కొత్త నిర్వచనం ప్రకారం, 'అరావళి కొండ' అంటే దాని చుట్టుపక్కల భూభాగం కంటే కనీసం 100 మీటర్ల ఎత్తు ఉన్న భూస్వరూపం. 'అరవళి శ్రేణి' అంటే ఒకదానికొకటి 500 మీటర్ల దూరంలో ఉన్న రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండల సమూహం. ఆరావళీ వ్యవస్థలో పర్యావరణపరంగా ముఖ్యమైన అనేక భాగాలు 100 మీటర్ల పరిమితిని చేరుకోవడం లేదని (ఉదాహరణకు, తక్కువ ఎత్తు ఉన్న శిఖరాలు, వాలులు, పాదగిరులు, భూగర్భ జలాల పునర్భరణ ప్రాంతాలు), అయినప్పటికీ అవి భూగర్భ జలాల పునర్భరణ, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ నియంత్రణ, నేల స్థిరత్వానికి ముఖ్యమైనవని విమర్శకులు వాదిస్తున్నారు. కొత్త నిర్వచనం పర్యావరణ పరిరక్షణ చర్యలను బలహీన పరుస్తుందనే ఆరోపణను కేంద్రం తిరస్కరించింది. ఆరావళీ ప్రాంతంలో ఎక్కువ భాగం అంటే 90 శాతానికి పైగా, రక్షించబడి ఉందని, కొత్త నిర్వచనం మైనింగ్ నియంత్రణలను సడలించదని పేర్కొంది. ఆరావళీ పర్వతాల విషయంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి నిజాలను దాచిపెడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోందని జైరామ్ రమేష్ తన పోస్ట్‌లో అన్నారు. ఆరావళీ పర్వతాలు దేశ సహజ వారసత్వ సంపద అని, వాటికి గొప్ప పర్యావరణ విలువ ఉందని పేర్కొంటూ, ఈ పర్వత శ్రేణిని పునర్నిర్వచించడానికి మోదీ ప్రభుత్వం ఎందుకు అంత పట్టుదలతో ఉందని, ఎవరి ప్రయోజనం కోసం ఇలా చేస్తోందని కాంగ్రెస్ ఇంతకు ముందు ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయం విదితమే.

## ఒడిశాలో కదంతొక్కిన ఎర్రదండు

- ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శన
- లౌకిక రాజ్యాంగం మార్పునకు మోదీ కుట్ర
- సిపిఐ శతవార్షికోత్సవ సభలో రామకృష్ణ పాండా, కె.రామకృష్ణ





**విశాలాంధ్ర బ్యూరో-భువనేశ్వర్:** సిపిఐ శతవార్షికోత్సవం సందర్భంగా ఆకర్షణీయమైన ర్యాలీ జరిగింది. గ్రామీణ పేదలు, కష్టజీవులు, కార్మికులు, మహిళలు ఎర్రజెండాలు చేతబూని కదంతొక్కారు. విద్యార్థి, యువత ఎర్ర దుస్తులతో తరలివచ్చారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చాత్రపూర్ లో మంగళవారం సిపిఐ శతవార్షికోత్సవం సందర్భంగా జరిగిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి సిపిఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, కె.రామకృష్ణ, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ మిశ్రాతోపాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు హాజరయ్యారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, రామకృష్ణ మాట్లాడుతూ కష్టజీవు వెన్నంటే సీపీఐ నిలుస్తోందని, సిపిఐ శతవార్షికోత్సవాల్లో కష్టజీవులు భాగస్వాములు కావడం ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమం నుంచి ఇప్పటివరకు కష్టజీవులు, పేదలు, కార్మికుల పక్షాన సిపిఐ నిలుస్తోందని చెప్పారు. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీలు రెండే ఉన్నాయని, అందులో ఒక్కటి సీపీఐ కాగా, మరొకటి కాంగ్రెస్ అని వివరించారు. సిపిఐ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిందని, అనేక మంది జైళ్ల పాలయ్యారని తెలిపారు. ఒకవైపు మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్, మరోవైపు ఎర్రజెండా చేతబట్టి కమ్యూనిస్టులు పోరాడారని గుర్తుచేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో పోరాటం సాగించి... స్వాతంత్రోద్యమాన్ని విజయవంతం చేశారన్నారు. భూమికోసం, భుక్తి కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలబడిందని, దున్నే వాడికి భూమి నినాదం తెచ్చిందీ కమ్యూనిస్టు పార్టీనేనని తెలిపారు. భూమి కోసం జరిగిన పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు రక్త తర్పణ చేశారని, తెలంగాణలో పది లక్షల భూములు పంపిణీ చేయించారని వివరించారు. దేశవ్యాప్తంగా అనేక భూపోరాటాలకు సిపిఐ నాయకత్వం వహించిందని, రాబోయే రోజుల్లోను కార్మిక, కర్షకులు, మహిళలు, యువత, విద్యార్థి లోకం కోసం అలుపెరగని ఉద్యమాలు కొనసాగిస్తుందని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ మాత్రం సంబంధంలేని బిజెపి నేడు అధికారం చెలాయిస్తూ... రాజ్యాంగ వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని మండిపడ్డారు. చివరకు స్వాతంత్ర్యోద్యమ వీరులను, మహాత్మాగాంధీని సైతం అవమానించేలా ప్రధాని మోదీ పాలన కొనసాగటం సిగ్గుచేటన్నారు. ఇందుకు నిదర్శనంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పార్లమెంట్ వేదికగా అవమానించారని మండిపడ్డారు. 12 ఏళ్ల మోదీ పరిపాలనలో దేశానికి ఒరిగిందేమీ లేదని, మౌలిక సమస్యల పరిష్కారం శూన్యమన్నారు. రైతాంగ సమస్యలు, ధరల నియంత్రణ, నిరుద్యోగ సమస్యలు యథాతథంగా ఉన్నాయని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. వ్యవస్థలను మోదీ గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, రాజ్యాంగం మార్పునకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకంగా సమైక్య ఉద్యమాలకు సిద్ధమవుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఒడిశా పార్టీ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



## రెచ్చిపోయిన బిజెపి నేతలు

- సిపిఐ పుదుచ్చేరి కార్యాలయంపై దాడికి యత్నం

**పుదుచ్చేరి:** పుదుచ్చేరిలో బిజెపి శ్రేణులు రెచ్చిపోయారు. దీంతో సిపిఐ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకున్నది బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని సిపిఐ కార్యాలయంపై దాడికి యత్నించారు. అశాంతి సృష్టించే ప్రయత్నం చేశారు. ఆవిష్కరించేందుకు సిద్ధం చేసిన వీఐ లెనిన్ విగ్రహాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. విగ్రహానికి ముసుగు కప్పేందుకు యత్నించారు. లెనిన్‌కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. అయితే సిపిఐ శ్రేణులు అడ్డుకోవడంతో బిజెపి వర్గీయుల ప్రయత్నం విఫలమైంది. సిపిఐ పుదుచ్చేరి కార్యదర్శి ఏఎం సలీంతో పాటు మరింత మంది నాయకులు, నిబద్ధతల కేడర్ హుటాహుటిన చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. జరిగినదంతా అధికార యంత్రాంగానికి వివరించారు. లెనిన్ విగ్రహాన్ని పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు హామీనిచ్చారు. ఇది లెనిన్ విగ్రహానికి సంబంధించిన వ్యవహారం కాదు... చరిత్ర, సిద్ధాంతాలు, ప్రజాస్వామిక విలువను సమర్థించే ప్రయత్నమని సిపిఐ నాయకులు నొక్కిచెప్పారు. అసహనాన్ని, రెచ్చగొట్టేవారిని సీపీఐ ఐక్యంగా, అప్రమత్తంగా, బలంగా అడ్డుకున్నదని ఉద్ఘాటించారు.

### కాలుష్యాన్ని నివారించలేకపోతే

## ఎయిర్ ప్యూరిఫైయర్స్‌పై జిఎస్‌టి తగ్గించవచ్చు కదా?

- కేంద్రంపై హైకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో నెలకొన్న అత్యవసర వాయుకాలుష్య పరిస్థితులపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. 'మనం రోజుకు సగటున 21వేల సార్లు శ్వాస తీసుకుంటాం. ఈ విషపూరిత వాయువులు పీల్చడం వల్ల కలిగే నష్టాన్ని ఒకసారి అంచనా వేయండి. దేశరాజధాని నగరంలో గాలి నాణ్యత ఇంత దారుణంగా పడిపోయిన తరుణంలో కూడా ఎయిర్ ప్యూరిఫైయర్లపై ఇంకా 18 శాతం జిఎస్‌టిని ఎందుకు వసూలు చేస్తున్నారు' అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రస్తుతమున్న తీవ్ర వాయుకాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎయిర్ ప్యూరిఫైయర్లను వైద్య పరికరాలుగా గుర్తించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గెడెలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ఈ అంశంపై స్పందించేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత సమయం కోరగా, ఢిల్లీ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'సమయం అంటే ఎప్పుడు? వేల సంఖ్యల ప్రజలు చనిపోయిన తర్వాత స్పందిస్తారా? నగరంలోని ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత మీపై ఉంది. కానీ మీరు అందులో పూర్తిగా విఫలమయ్యారు. కనీసం ఎయిర్ ప్యూరిఫైయర్లనైనా అందుబాటులోకి తీసుకురావడం కనీస బాధ్యత కాదా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. అవసరమైతే జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద తాత్కాలిక పన్ను మినహాయింపు ఎందుకు ఇవ్వకూడదు? అని ధర్మాసనం పేర్కొంది. దీనిపై కేంద్రం తన ప్రతిపాదనలను ఈ రోజే కోర్టుకు వివరాలించాలని ఆదేశించింది.

**పిటిషనర్ వాదన ఇదే!**

అడ్వకేట్ కపిల్ మదన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీ వాయుకాలుష్యంతో మగ్గిపోతున్న ఈ తరుణంలో ఎయిర్ ప్యూరిఫైయర్లు ఇకపై విలాస వస్తువులు కాదు, కేవలం ప్రాణాలు కాపాడే అత్యవసర పరికరాలు అని అందులో పేర్కొన్నారు. అయితే వీటిపై జిఎస్‌టి 18 శాతం ఉండడం వల్ల అవి సామాన్యులకు భారంగా మారాయని అన్నారు. 2020లో కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం, శ్వాసకోశ సంబంధిత సమస్యలను నివారించే ఈ పరికరాలను వైద్య పరికరాలుగా గుర్తించి, వాటిపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలని కోరారు.

**ప్రస్తుతం జిఆర్‌ఎపి 4వ దశలో ఢిల్లీ**

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం, ప్రస్తుతం ఢిల్లీ కాలుష్యం జిఆర్‌ఎపి నాలుగో దశలో ఉంది. అయితే బుధవారం కాస్త గాలి నాణ్యత మెరుగుపడింది. సింపుల్‌గా చెప్పాలంటే, సిపిసిబిడేటా ప్రకారం, గాలి నాణ్యత సూచిక (ఎక్యూఐ) మంగళవారం 415గా ఉండగా, బుధవారం ఉదయం అది 336గా నమోదైంది.

## కార్యకర్తల అనుమానాలు తీర్చిన తరువాతే...

- అజిత్ పవార్ ఎన్‌సిపితో పొత్తుపై యోచన
- ఒక వేళ పొత్తు కుదిరితే తలెత్తే పరిణామాలపైనే చర్చిస్తాం
- ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే



**పుణె:** పుణె మున్సిపల్ ఎన్నికల కోసం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపితో తమ పార్టీ ఇప్పట్లో పొత్తు పెట్టుకోదని ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల సందేహాలు, ఆందోళనలన్నీ పరిష్కరించే వరకు పొత్తు ఆలోచనే లేదన్నారు. బుధవారం ఆమె పుణెలో విలేకరులతో మాట్లాడారు. తాము ఎన్‌సిపితో సంప్రదింపులు జరుపుతున్నామని, ఒకవేళ రెండు ఎన్‌సిపి వర్గాలు చేతులు కలిపితే తలెత్తే పరిణామాలపై కూడా చర్చిస్తామని సూలే చెప్పారు. జనవరి 15న పుణెలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల కోసం అజిత్ పవార్ ఎన్‌సిపితో పొత్తు పెట్టుకోవడంపై తమ పార్టీ నగర యూనిట్ అధ్యక్షుడు ప్రశాంత్ జగతాప్ వ్యక్తం చేసిన అసంతృప్తి గురించి ప్రస్తావిస్తూ, తాను ఆయనతో సుదీర్ఘంగా మాట్లాడి, అతని ఆందోళనలను అర్థం చేసుకున్నానని చెప్పారు. తాము ఎన్‌సిపితో చేతులు కలిపితే ఏ సిద్ధాంతానికి గానీ, పార్టీ విధానానికి గానీ రాజీ పడబోమని తాను జగతాప్‌కు హామీ ఇచ్చానని సూలే చెప్పారు. 'జగతాప్ ఆందోళనలు సరైనవే. ఆయన ప్రశ్నలు పూర్తిగా సమంజసమైనవి' అని అన్నారు. గత రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, సోనియా గాంధీ విదేశీ మూలాల సమస్యను లేవనెత్తిన తర్వాత తన ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ కాంగ్రెస్ నుండి బయటకు వెళ్లవలసి వచ్చిందని, ఆ తర్వాతే ఎన్‌సిపి ఏర్పడిందని సూలే గుర్తు చేశారు. 'తరువాత, సోనియా గాంధీ రాజకీయ ఔదార్యం ప్రదర్శించి, పవార్ సాహెబ్ వద్దకు వచ్చి, యుపిఎ ప్రభుత్వంలో చేరమని ఆయనకు ప్రతిపాదించారని ఆమె గుర్తు చేశారు. రాజకీయాల్లో ఒడిదుడుకులు ఉంటాయని, తాము ఎన్‌సిపితో చేతులు కలిపితే ఏ సిద్ధాంతానికి గానీ, పార్టీ విధానానికి గానీ రాజీ పడబోమని, ఈ హామీలన్నీ ఇచ్చానన్నారు. చెప్పిన దాంట్లో ఎలాంటి మార్పు ఉండదని ఆమె స్పష్టం చేశారు. జగతాప్ తమ పార్టీకి ఒక ముఖ్యమైన నాయకుడని, తాను ఆయనకు సంస్థాగత నిర్మాణాన్ని వివరించానని కూడా ఆమె తెలిపారు. ఇంకా ఏ పొత్తు కూడా ఖరారు కాలేదని ఆమె స్పష్టం చేశారు. ఇవి కేవలం చర్చలు మాత్రమే, ఏ బలమైన ప్రజాస్వామ్యంలోనైనా చర్చలు ముఖ్యమన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న తన బంధువు అజిత్ పవార్‌తో తాను ఇంకా మాట్లాడలేదని సూలే చెప్పారు. పార్టీ కార్యకర్తలందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాతే తాను అజిత్ దాదాతో మాట్లాడతానని చెప్పారు. అన్ని సందేహాలు, ఆందోళనలు పరిష్కరించే వరకు ఏ పొత్తుతోనూ ముందుకు వెళ్ళనన్నారు. రెండు ఎన్‌సిపి వర్గాల మధ్య పొత్తు కుదిరితే, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి తమ 'గడియారం' గుర్తుపైనే ఎన్‌సిపి (ఎస్‌పి) పోటీ చేయాలని పట్టుబట్టవచ్చని చర్చలు జరుగుతున్నాయని అడిగినప్పుడు, తనకు అలాంటి ప్రతిపాదన ఏదీ రాలేదని సూలే చెప్పారు. ఎన్‌సిపి (ఎస్‌పి) 'తుతారి' గుర్తుపైనే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

### ఒబిసి రిజర్వేషన్లను

## బిజెపి నిరాకరిస్తోంది: అఖిలేష్

గత ఐదేళ్లుగా రిజర్వ్‌డ్ కేటగిరీ పోస్టులను పెద్ద ఎత్తున దోపిడీ



**లక్నో:** ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ నియామకాల్లో ఇతర వెనుకబడిన తరగతులకు రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన రిజర్వేషన్‌ను అధికార బిజెపి నిరాకరిస్తోందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. గత ఐదేళ్లుగా రిజర్వ్‌డ్ కేటగిరీ పోస్టులను పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగం ప్రకారం ఇతర వెనుకబడిన తరగతులకు (ఒబిసిలకు) కేటాయించిన 27 శాతం రిజర్వేషన్‌లో దాదాపు మూడింట ఒక వంతును బిజెపి తిరస్కరిస్తోందని యాదవ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇది ఆ పార్టీ 'రాజ్యాంగ వ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక ముఖాన్ని' బయటపెట్టిందన్నారు. కాషాయ పార్టీ ఒబిసిలకు రాజ్యాంగబద్ధంగా కేటాయించిన 27 శాతం రిజర్వేషన్‌లో మూడింట ఒక వంతును నిరాకరిస్తూ, తన వాస్తవమైన రాజ్యాంగ వ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక ప్రదర్శిస్తోందన్నారు. ఇప్పుడు కొత్తగా నియమితులైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ముందుకు వచ్చి, ఒబిసి రిజర్వేషన్‌ను దోపిడీకి గురికాకుండా కాపాడాలి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉత్తరప్రదేశ్ రెవెన్యూ శాఖలో జరుగుతున్న లేఖ్‌పాల్ నియామకాలను మాజీ ముఖ్యమంత్రి ఉదాహరణగా చూపారు. 7,994 పోస్టులకు గాను, కేవలం 1,441 పోస్టులను మాత్రమే ఒబిసిలకు రిజర్వ్ చేశారని ఆయన అన్నారు. 27 శాతం రిజర్వేషన్ ప్రకారం, 2,158 పోస్టులను ఒబిసిలకు రిజర్వ్ చేయాల్సి ఉంది. అంటే, నియామకాలకు ముందే 717 ఒబిసి లేఖ్‌పాల్ పోస్టులను దోచుకున్నారని ఆయన ఆరోపించారు. ఒబిసి కోటాను కుదించగా, ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఇడబ్ల్యుఎస్) పూర్తి 10 శాతం కోటాను, అంటే 792 పోస్టులను కేటాయించారని యాదవ్ ఎత్తి చూపారు. మరో పోస్ట్‌లో, గత ఐదేళ్లలో జరిగిన అన్ని నియామకాల్లోనూ, పిడిఎ (పిచ్చడా, దళిత్, ) వర్గాలకు కేటాయించిన పోస్టులను లాగేసుకున్నారని యాదవ్ ఆరోపించారు. ఇవి గత నాలుగు నియామకాలకు సంబంధించిన వివరాలను, వీటిలో 30,000 కంటే ఎక్కువ పిడిఎ పోస్టులను దోచుకున్నారన్నారు. ఈ దొంగతనం బయటపడిన తర్వాత, ప్రభుత్వం నామమాత్రపు కమిటీలను ఏర్పాటు చేసింది, కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేవలం మీడియా మేనేజ్‌మెంట్ మాత్రమే జరిగిందని ఆయన ఆరోపించారు. ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఇంకెంత కాలం దోచుకుంటుందని ప్రశ్నించారు. రిజర్వేషన్ ప్రయోజనాలను నిరాకరించడానికి అభ్యర్థులను అర్హులుగా గుర్తించలేదని ప్రకటించడం వంటి చట్టవిరుద్ధమైన సూత్రాలను కోర్టులో సవాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని కూడా యాదవ్ అన్నారు. 'ఉద్యోగాలు బిజెపి అజెండాలో కూడా లేవు, పిడిఎ వ్యక్తులకు అస్సలు లేవు. బిజెపి పోయినప్పుడు, ఉద్యోగాలు, న్యాయమైన నియామకాలు వస్తాయి' అని ఆయన అన్నారు. 69,000 అసిస్టెంట్ టీచర్ల నియామకాలు, బండా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లఖింపూర్ కోఆపరేటివ్ బ్యాంక్, లేఖ్‌పాల్ పోస్టులలో అక్రమాలు జరిగాయని యాదవ్ ఆరోపించారు. బిజెపి పిడిఎ వ్యతిరేకమని, వారి రిజర్వేషన్లను లాక్కుంటుందని ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి యువతకు తెలుసునన్నారు.

## థాక్రేల మధ్య పొడిచిన పొత్తు

- బృహన్ ముంబయి మున్సిపల్ ఎన్నికల్లో కలిసే పోటీ
- శివసేన(యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే, ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ థాక్రే సంయుక్త ప్రకటన
- మరాఠీల, మహారాష్ట్ర ప్రయోజనాల కోసం తాము ఏకమయ్యామని స్పష్టీకరణ




**ముంబయి:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికల వేళ కొన్ని నెలలకు వస్తున్న ఊహాగానాలకు తెరపడింది. శివసేన (యుబిటి), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) మధ్య పొత్తు పొడిచింది. ఇరు పార్టీలు అధ్యక్షులు, సోదరులైన ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలు జనవరి 15న జరగబోయే బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికలకు ముందు తమ పార్టీల పొత్తును అధికారికంగా ప్రకటించారు. రాజ్‌తో కలిసి ముంబయిలో ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ మాట్లాడుతూ రెండు పార్టీలు కలిసి ఉండటానికే ఏకమయ్యాయని చెప్పారు. మరాఠీల, మహారాష్ట్ర ప్రయోజనాల కోసం తాము ఏకమయ్యామని ఈ ఇద్దరు సోదరులు స్పష్టం చేశారు. సాంఘిక సంస్కర్త, రచయిత అయిన తమ తాత ప్రబోధన్‌కర్ థాక్రే సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, అలాగే తన తండ్రి బాల్ థాక్రే, రాజ్ థాక్రే తండ్రి అయిన తన మామ శ్రీకాంత్ కూడా ముంబయి రాష్ట్రంలో భాగమై ఉండేలా చూడటంలో పాత్ర పోషించారని ఉద్ధవ్ అన్నారు. 'ముంబయి మేయర్ మరాఠీ వారే అవుతారు, ఆయన మా వాడే అవుతారు' అని రాజ్ అన్నారు. ముంబయి, రాష్ట్రంలోని ఇతర 27 మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు జనవరి 15న ఎన్నికలు జరగనున్న నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్ కోసం పార్టీలు తమ సీట్ల పంపకాన్ని ఖరారు చేశాయని ఉద్ధవ్ చెప్పారు. ఇతర పురపాలక సంఘాలలో కూడా రెండు పార్టీల మధ్య పొత్తు కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. బిజెపిలో జరుగుతున్న పరిణామాలను చూడలేని వారు కూడా మాతో చేరవచ్చని ఉద్ధవ్ పిలుపునిచ్చారు. 227 వార్డుల బిఎంసిలో సీట్ల పంపకంపై ఎటువంటి స్పష్టత లేకుండానే 16 నిమిషాల పాటు మాత్రమే ఈ విలేకరుల సమావేశం సాగింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బిఎంసి ఎన్నికల కోసం రెండు పార్టీల మధ్య సీట్ల పంపకం వివరాలను రాజ్ వెల్లడించలేదు. ఇది రెండు పార్టీల ప్రభావం ఉన్న కొన్ని వార్డులలో చర్చలు ఇంకా జరుగుతున్నాయనే ఊహాగానాలకు దారితీసింది. ఈ విలేకరుల సమావేశం శివసేన (యుబిటి) నాయకుడు ఆదిత్య థాక్రే నియోజకవర్గమైన వర్లీలోని ఒక లగ్జరీ హోటల్‌లో జరిగింది. విలేకరుల సమావేశం వేదికపై ఉన్న బ్యాక్‌డ్రాప్ బ్యానర్‌లో అవిభక్త శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే చిత్రం, శివసేన (యుబిటి), ఎంఎన్ఎస్ పార్టీల చిహ్నాలు ఉన్నాయి. వేదికకు రాకముందు, రాజ్, ఉద్ధవ్ శివాజీ పార్క్‌లోని బాల్ థాక్రే స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించారు. వారు రాజ్ వాహనంలో కలిసి వేదికకు చేరుకున్నారు. విలేకరుల సమావేశంలో కుటుంబ సౌహార్దత స్పష్టంగా కనిపించింది. ఉద్ధవ్ భార్య రష్మి, కుమారుడు ఆదిత్య, రాజ్ భార్య షర్మిల, కుమారుడు అమిత్ కూడా అక్కడ ఉన్నారు. గతేడాది జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యుబిటి) 288 స్థానాలకు గాను 20 స్థానాల్లో విజయం సాధించగా, ఎంఎన్ఎస్ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. పాఠశాలల్లో త్రిభాషా సూత్రాన్ని ప్రవేశపెట్టాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, హిందీ భాషను రుద్దడాన్ని వ్యతిరేకించడానికి ఈ పార్టీలు ఏకమయ్యాయి. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు మరాఠీ, ఇంగ్లీషుతో పాటు హిందీని ప్రవేశపెట్టడంపై జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో, ఆ నిర్ణయాన్ని జరుపుకోవడానికి వారు జూలైలో సంయుక్తంగా 'విజయ ర్యాలీ' నిర్వహించారు.

### బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు..

## బెంగాల్‌లో నిరసన ప్రదర్శనలు

**కోల్‌కతా:** బంగ్లాదేశ్‌లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి హత్యకు గురికావడంపై భారత్‌లో అక్కడక్కడా అల్లరు చెలరేగుతున్నాయి. బెంగాల్‌లో భారత్–బంగ్లాదేశ్ సరిహద్దులోని అనేక ల్యాండ్ పోర్టులలో బుధవారం హత్యకు వ్యతిరేకంగా హిందూ అనుకూల సంస్థ సభ్యులు ప్రదర్శనలు నిర్వహించారు. హౌరా జిల్లాలో జరిగిన నిరసన సందర్భంగా పోలీసు సిబ్బందికి, బిజెపి మద్దతుదారులకు మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. హౌరా వంతెన చేరుకునేలోపు కాషాయ పార్టీ ఊరేగింపును పోలీసులు ఆపిన తర్వాత ఇబ్బంది తలెత్తింది. నిరసనకారులు, భద్రతా సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదాలు జరిగాయి. నిరసనల ముసుగులో సాధారణ జీవితానికి అంతరాయం కలిగించడానికి, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేందుకు అనుమతి ఇవ్వమనిని, ఇబ్బంది కలిగించే ప్రయత్నాలను అడ్డుకోవడానికి చట్టానికి అనుగుణంగా వ్యవహరిస్తామని హౌరా పోలీసు సీనియర్ అధికారి పిటిఐకి తెలిపారు. పోలీసులు మార్చ్‌ను ముందుకు సాగకుండా నిరోధించడంతో, నిరసనకారులు రోడ్డుపై కూర్చొని బారికేడ్లను ఛేదించేందుకు ప్రయత్నించారు. దీనితో ఘర్షణ జరిగింది. ప్రదర్శనకారులు దూకుడుగా మారారని, భద్రతా సిబ్బంది వారిని చెదరగొట్టడానికి చర్యలు తీసుకోవాలని బలవంతం చేశారని పోలీసులు ఆరోపించారు. పొరుగు దేశంలో హిందువులపై దారుణాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సనాతన ఐక్య పరిషత్ సభ్యులు ఉత్తర 24 పరగణాల జిల్లాలోని పెట్రాపోల్, ఘోజదంగ ల్యాండ్ పోర్టులలో, మాల్దాలోని మనోహర్‌పూర్ ముచియా, కూచ్ బెహార్ జిల్లాలోని చంగ్రబంధ వద్ద ప్రదర్శనలు నిర్వహించారు.

**రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా, **చిలువేరు కుమారస్వామి, తండ్రి : పోషయ్య,** వయస్సు 42 సం.లు, నివాసం : పరకాల, మం: పరకాల, జిల్లా: హనుమకొండ. నేను పరకాలలోని పిట్టవాడలో నా కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో ఉన్నాను. గత 10 రోజుల క్రితం ఆ ఇంటిని ఖాళీ చేసి మరో చోటికి వెళ్లేందుకు సామానులను సర్దుకునే క్రమంలో నా పేరుపై ఉన్న **రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 2126/2019** గల నివేశన స్థలంకు చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్ ఎక్కడో పోయినది. వాటి కోసం వెతకగా దొరుకలేదు. కావున ఎవరికైనా దొరికినచో సెల్ నంబర్‌కు **9704050401** ఫోన్ చేయగలరని మనవి.

ఇట్లు
**చిలువేరు కుమారస్వామి**
గ్రామం & మండలం : పరకాల
జిల్లా : హనుమకొండ.
ఫోన్ : 9704050401

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24H 5567 | Umila Donikela | TAIGUN TOPLINE BS6 PETROL 5 SEATER | 2023 |
| 2 | TG24 5493 | Ravi Eslavath | KUBOTA MU5502 | 2024 |
| 3 | TG24T 1297 | Vanam Bikshapathi | APE XTRA LDX BS6 DIESEL | 2024 |
| 4 | TS07UB 0637 | Naniganti Srikanth | CHEVROLET TAVERA NEO-P | 2014 |
| 5 | TS24B 8577 | Yugundar Gorre | JOHN DEERE W70 COMBINE HARVESTER | 2018 |
| 6 | TG24T 1162 | Erra Sagar | SONALIKA DL 42 RX | 2024 |
| 7 | TG24 982 | Ravi Pallapu | KUBOTA MU5502 | 2024 |

AUCTION DATE 27-12-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road , Cell : .9000230006 & 8008900443

ప్రజాపక్షం
గురువారం, 25 డిసెంబరు

# ఆర్థిక నేరగాళ్ల ఇష్టారాజ్యం!

ప్రభుత్వపరంగా సరైన ప్రయత్నాలు... చర్యలు లేనికారణంగా ఆర్థిక నేరగాళ్ల ఇష్టారాజ్యం కొనసాగుతుంది. వేల కోట్ల రూపాయల రుణం తీసుకోవడం.. ఎగవేయడం.. విదేశాలకు పారిపోవడం ఒక ప్రహసనంగా మారింది. విదేశాల్లో తలదాచుకున్న వారిని తిరిగి రప్పించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. లండన్‌లో విజయ్ మాల్యా 70వ పుట్టినరోజు వేడుకల నుంచి సోషల్ మీడియాలో వెలువడిన వీడియో కేవలం ఒక వ్యక్తిగత పార్టీ దృశ్యాన్ని మాత్రమే గాక, భారత ఆర్థిక వ్యవస్థలో జరిగిన ఒక తీవ్రమైన అన్యాయాన్ని కూడా వివరిస్తున్నది. కార్పొరేట్ వర్గాల దుర్మార్గపు పోకడలకు ప్రతీకగా మారింది. దేశంలో వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు చెల్లించకుండా విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడుపుతున్న వ్యక్తుల వ్యవహారం, దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బగా మారింది. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటి వారు తీసుకున్న రుణాలు సాధారణంగా ప్రజల డిపాజిట్లతోనే బ్యాంకులు ఇస్తాయి. రైతులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు తమ పొదుపులను బ్యాంకుల్లో జమచేసిన డబ్బే ఈ రుణాలకు ఆధారం. ఆ రుణాలు తిరిగి చెల్లించకుండా దేశం విడిచి వెళ్లినప్పుడు, ఆ నష్టం బ్యాంకుల ఖాతాల్లో నిరర్థక ఆస్తి (ఎన్‌పిఏ)గా మారుతుంది. ఈ ఎన్‌పిఏ భారాన్ని భరించేందుకు బ్యాంకులకు ప్రభుత్వం మూలధనాన్ని అందిస్తుంది. ఆ డబ్బు ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల నుంచే వస్తుంది? కొద్దిమంది ఆర్థిక నేరస్తులు చేసిన మోసాల వల్ల ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రభుత్వానికి సామాజిక సంక్షేమం, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులపై ఖర్చు చేయాల్సిన డబ్బు బ్యాంకులను కాపాడేందుకు వెచ్చించాల్సి వస్తుంది. ఫలితంగా ప్రజలకు రావాల్సిన సేవలు తగ్గిపోతాయి లేదా పన్నులు పెరుగుతాయి. ఇంకోవైపు, బ్యాంకులు నష్టాలు పెరిగితే అవి కొత్త రుణాలు ఇవ్వడంలో జాగ్రత్తగా వ్యవహరిస్తాయి. వడ్డీ రేట్లు పెరుగుతాయి. పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, రైతులు అధిక వడ్డీలతో రుణాలు తీసుకోవాల్సి వస్తుంది. ఫలితంగా, ఉత్పత్తి ఖర్చు పెరుగుతుంది. ఆ పెరిగిన ఖర్చును వ్యాపారులు చివరకు వస్తువుల ధరల రూపంలో వినియోగదారులపైనే మోపుతారు. ఇదే ద్రవ్యోల్బణంగా సామాన్యుడిని శరాఘాతమవుతుంది. ఒకవైపు పాల, కూరగాయలు, ఇంధనం, విద్య, వైద్యం ధరలు పెరిగి సగటు జీవి అల్లాడుతుంటే, మరోవైపు వేల కోట్ల రూపాయల రుణాలు ఎగ్గొట్టిన వారు విదేశాల్లో పార్టీల్లో జల్సాలు చేయడం వ్యవస్థలో నెలకొన్న నిర్లిప్తతను, ఉదాశీనతను స్పష్టం చేస్తున్నది. చట్టాన్ని తప్పించుకుని, న్యాయ ప్రక్రియను ఆలస్యం చేస్తూ విదేశాల్లో ఆస్తులను కాపాడుకునే ఈ తరహా చర్యలు, భారత ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక నష్టం చేస్తాయి. దేశంలో కష్టపడి పన్నులు చెల్లించే సామాన్య పౌరుడు మాత్రం పెరిగిన ధరలు, తగ్గిన సేవలు, పెరిగిన పన్నుల రూపంలో ఆ భారాన్ని మోయాల్సి వస్తుంది. కార్పొరేట్ నేరస్తులకు నేరుగా క్షమించి డబ్బు ఇచ్చింది ఏమీ లేదు. కానీ వాస్తవంలో జరిగిందేమిటంటే, బ్యాంకులు ఇచ్చిన భారీ రుణాలు తిరిగి రాకపోవడంతో వాటిని రైటాఫ్, బ్యాంక్రప్సీ సెటిల్మెంట్లు రూపంలో ఖాతాల నుంచి తొలగించాల్సి వచ్చింది. ఆ భారాన్ని చివరికి ప్రభుత్వమే, అంటే ప్రజల పన్నుల ద్వారానే భరించింది. విజయ్ మాల్యా, నీరవ్ మోదీసహా, ఇలాంటి పెద్ద కార్పొరేట్ డిఫాల్టర్ల వల్ల బ్యాంకులు సుమారు 10 లక్షల కోట్ల రూపాయలకుపైగా ఎన్‌పిఏలను రద్దు చేశాయి. ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇచ్చిన గణాంకాల ప్రకారం, గత దశాబ్దంలో బ్యాంకులు రైటాఫ్ చేసిన మొత్తం రూ. 12 నుంచి 15 లక్షల కోట్ల మధ్య ఉందని అంచనా. సాధారణ రైతు లేదా చిన్న రుణగ్రహీత ఒక కిస్తీ ఆలస్యం చేస్తే వెంటనే నోటీసులు... ఆస్తుల స్వాధీనాలు... కానీ పెద్ద కార్పొరేట్ రుణ కేసులు సంవత్సరాల తరబడి నడుస్తాయి. నిందితులు విదేశాలకు పారిపోతారు. చివరకు బ్యాంకులు రైటాఫ్ చేసి ఖాతాలు మూసేస్తాయి. చట్టపరంగా అది రైటాఫ్ అయినా, ప్రజల దృష్టిలో అది అన్యాయమైన మాఫీగా మారుతుంది. ఈ రుణ నష్టాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం బ్యాంకుల్లో వేల కోట్ల రూపాయల ప్రజాధనం పెట్టుబడి చేస్తుంది. కొద్దిమంది కార్పొరేట్ నేరస్తులు ఎగ్గొట్టిన వేల కోట్ల రూపాయల భారాన్ని చివరకు సామాన్య ప్రజలే మోయాల్సి వస్తుంది. కార్పొరేట్ నేరస్తుల వల్ల నేరుగా లేదా పరోక్షంగా లక్షల కోట్ల రూపాయల భారాన్ని దేశంలోని సామాన్యులే భరిస్తున్నారు. న్యాయం, సమానత్వం, వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బును నయాపైసాతో సహా తిరిగి తెప్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.. కార్పొరేట్ ఆర్థిక నేరస్తుల ఆట కట్టిస్తామని ప్రకటించి దశాబ్దాలు గడిచిపోయింది. పరిస్థితి మాత్రం 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' అన్న చందంగా ఉంది. మోదీ ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రలేచి, ఆర్థిక నేరస్తుల ఆటకట్టించాలి. న్యాయాన్ని గెలిపించాలి.

# అమెరికా–చైనా మధ్య ఎఐ ప్రచ్ఛన్న యుద్ధం

టి.ఎస్.అశోక్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ – కృత్రిమ మేథస్సు) రంగంలో ఆధిపత్యం కోసం వాషింగ్టన్, బీజింగ్‌ల మధ్య జరుగుతున్న పోటీ... సాంకేతికతను, భౌగోళిక రాజకీయాలను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తోంది. అయితే, ఈ పోటీలో ఎవరికీ విజయం లభిస్తుందనే గ్యారెంటీ లేదు.

2024 వసంత రుతువులో చైనాలోని ఒక ప్రముఖ ఎఐ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు ఊహించని రీతిలో ఫోన్ కాల్స్ ఎదుర్కోవాల్సి వచ్చింది. కేవలం ఒక నెలలోనే పది వేర్వేరు ప్రభుత్వ సంస్థలు వారిని సంప్రదించి, ఒకే అత్యవసర సందేశాన్ని అందించాయి – చైనాకు స్వదేశీ ఎఐ మోడల్స్ అవసరమని, అవి వెంటనే కావాలని స్పష్టం చేశాయి.

ఈ ఒత్తిడి బీజింగ్‌లో నెలకొన్న తీవ్ర ఆందోళనను ప్రతిబింబించింది. ఓపెన్ ఎఐ, గూగుల్ సంస్థలు జనరేటివ్ ఎఐ ఆవిష్కరణలతో దూసుకుపోతుంటే, చైనా కంపెనీలు మాత్రం చాలా వెనుకబడి ఉన్నాయి. ఎంతలా అంటే, చాలా కంపెనీలు మెటా(మెటా) వారి ఉచిత, ఓపెన్ సోర్స్ మోడల్స్‌పై ఆధారపడ్డాయి. అధునాతన చిప్‌లపై అమెరికా విధించిన ఎగుమతి ఆంక్షలు ఈ అంతరాన్ని మరింత పెంచేలా కనిపించాయి. ఈ శతాబ్దపు అత్యంత కీలకమైన సాంకేతిక పోటీలో తమ దేశం శాశ్వతంగా వెనుకబడిపోతుందేమోనన్న భయం చైనా నాయకత్వంలో నెలకొంది.



తొమ్మిది నెలల తర్వాత, 'డీప్‌సీక్' అనే పెద్దగా గుర్తింపు లేని చైనా స్టార్టప్, ఓపెన్ ఎఐ అత్యుత్తమ మోడల్‌తో పోటీపడగల ఒక పరిష్కార నమూనాను అతి తక్కువ ధరకే విడుదల చేసింది. ఈ ఆవిష్కరణ చైనా టెక్ రంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా, సిలికాన్ వ్యాలీని కూడా ఆశ్చర్యపరిచింది. చాలామంది పరిశీలకులు దీనిని 'ప్రచ్ఛన్న యుద్ధం' కాలం నాటి మాటల్లో ఈ విధంగా చెబుతున్నారు. : రెండు అగ్రరాజ్యాల మధ్య జరిగే పోటీలో 'విజేత' అన్నీ చేజిక్కించుకుంటాడు. అది పరిశ్రమలను, సమాజాన్ని, ప్రపంచ అధికారం గతిని పునః రూపకల్పన చేస్తుంది.

'చివరికి చైనా గర్వించదగ్గ ఒక మోడల్ లభించింది' అని డీప్‌సీక్ విడుదలైన తర్వాత ప్రధానమంత్రి లి కియాంగ్ అధికారులతో అన్నట్లు సమాచారం. ఈ ఆశావాదం ప్రభుత్వ మద్దతును వెల్లువలా పెంచడమే కాకుండా, అమెరికా కూడా తన పోటీని వేగవంతం చేసేలా చేసింది. ఈ పెరుగుతున్న పోటీ ప్రచ్ఛన్న యుద్ధ కాలపు సాంకేతిక పోరాటాలను గుర్తుకు తెస్తోంది. ముఖ్యంగా డిఫెన్స్ కంప్యూటర్ల తయారీ కోసం జరిగిన పోటీ, అప్పట్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. అయితే ఎఐ సామర్థ్యం చూస్తుంటే ఆ పాత పోటీ కూడా చిన్నదిగా అనిపిస్తుంది.

ఎఐ గనుక మానవ మేధస్సును మించిపోయి, తనను తాను మెరుగుపరుచుకునే సామర్థ్యాన్ని పొందితే, అది ఏ దేశం చేతిలో ఉంటే ఆ దేశానికి శాస్త్రీయ, ఆర్థిక, సైనిక రంగాల్లో తిరుగులేని ఆధిక్యాన్ని ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ అంతటి స్థాయికి చేరకపోయినా, భారీ డేటాను విశ్లేషించే, సంక్లిష్టమైన పనులను ఆటోమేట్ చేసే ఎఐ సామర్థ్యం, క్యాన్సర్ నిర్ధారణ నుండి క్షిపణి రక్షణ వరకు అన్నింటినీ సమూలంగా మారుస్తుంది.

ఈ పోటీ కారణంగా ప్రపంచవ్యాప్తంగా టెక్‌రంగంపై పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఇది ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను పెంచడమే కాకుండా ఆర్థిక వృద్ధికి కొత్త మార్గాలను తెరిచింది. 2025 మొదటి అర్ధభాగంలోనే అమెరికన్ ఇన్వెస్టర్లు ఎఐ స్టార్టప్‌లలో 104 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టారు. మరోవైపు, బెర్న్‌స్టీన్ విశ్లేషకుల ప్రకారం, ప్రముఖ చైనా టెక్ కంపెనీలు 2027 నాటికి ఎఐపై 361 బిలియన్ డాలర్లు ఖర్చు చేసే అవకాశం ఉంది.

రెండు వైపులా ఆశయం కంటే భయమే ఎక్కువగా ఉంది. చైనా 'నిరంకుశ ఎఐ (అథారిటేరియన్ ఎఐ)' అమెరికా టెక్ ఆధిపత్యానికి ముప్పు అని వాషింగ్టన్ హెచ్చరిస్తోంది. ఎఐలో వెనుకబడితే, చైనా మళ్ళీ ప్రపంచశక్తిగా ఎదగకుండా అమెరికా అడ్డుకుంటుందని బీజింగ్ భావిస్తోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ వాటా కోసం ఇరు దేశాలు పోటీపడుతున్నాయి. దానిద్వారా ప్రపంచ జనాభాలో పెద్ద భాగాలపై ప్రభావం చూపవచ్చు.

ఈ పోటీ తీవ్రత కారణంగా దుష్ప్రచారం, మానవ విలువలకి విరుద్ధంగా పనిచేసే సూపర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ వంటి ఎఐ కారణంగా కలిగే ప్రమాదాలను నాయకులు పక్కన పెడుతున్నారు. 'ఎఐ భవిష్యత్తు అనేది భద్రత గురించి ఆందోళన చెందడం ద్వారా లభించదు,' అని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఫిబ్రవరిలో ప్యారిస్‌లో చేసిన ఒక ప్రసంగంలో ప్రకటించారు.

అత్యంత శక్తివంతమైన ఎఐ మోడల్స్‌ను రూపొందించడంలో అమెరికా స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. అధునాతన చిప్ తయారీలో, ప్రైవేట్ ఇన్వెస్టర్ల నుండి లభించే భారీ ఆర్థిక వనరులలో అమెరికాకు తిరుగులేదు. కానీ చైనా వద్ద భారీ సంఖ్యలో ప్రతిభావంతులైన ఇంజనీర్లు ఉన్నారు. ఖర్చులు తక్కువగా ఉండడమే కాకుండా అమెరికాలోని మార్కెట్ ఆధారిత విధానం కంటే వేగంగా కదిలే ప్రభుత్వ నిర్దేశిత అభివృద్ధి నమూనా ఉంది.

ఎఐ సవాలుకు బీజింగ్ స్పందన సమగ్రంగా ఉంది. షీ జిన్‌పింగ్ 'ఎఐ ప్లస్' బ్లూప్రింట్ ప్రకారం, ఇన్నర్ మంగోలియా వంటి ప్రాంతాలలో భారీ కంప్యూటింగ్ క్లస్టర్ల నిర్మాణాన్ని అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఇక్కడ సోలార్, విండ్ ఫామ్‌ల ద్వారా చౌకగా విద్యుత్ లభిస్తుంది. 2028 నాటికి వందలాది డేటా సెంటర్లను ఒకే నెట్‌వర్క్‌గా కలపాలని, దానిని'నేషనల్ క్లౌడ్' అని పిలవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

2027 నాటికి చైనా ఆర్థిక వ్యవస్థలో 70 శాతం, 2030 నాటికి 90శాతం ఎఐ వినియోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది 'మానవ ఉత్పత్తి, జీవన విధానాన్ని' మారుస్తుందని జిన్‌పింగ్ అభివర్ణించారు.

చైనాకు ఒక చరిత్ర ఉంది. ప్రారంభంలో అమెరికన్ టెక్నాలజీ కంటే వెనుకబడి ఉన్నా, కాలక్రమేణా ఆ సాంకేతికతను అందిపుచ్చుకుని పైచేయి సాధిస్తుంది. సోషల్ మీడియాలో కూడా అమెరికన్ ప్లాట్ ఫామ్ ముందున్నా, చివరికి చైనీస్ ఇంజనీర్లు సృష్టించిన టిక్ టాక్ ప్రపంచాన్ని శాసించింది. ప్రస్తుతం కోడింగ్ నుండి వీడియో జనరేషన్ వరకు అనేక పనులలో చైనా మోడల్స్ అగ్రస్థానంలో ఉన్నాయి. అటానమస్ వాహనాలు, డ్రోన్లు, హ్యూమనాయిడ్ రోబోల ద్వారా ఎఐని భౌతిక ప్రపంచంలోకి తీసుకురావడంలో చైనా ఉత్పాదక రంగం దూసుకుపోతోంది.

అయినప్పటికీ, అధునాతన సెమీకండక్టర్లు అమెరికా వద్ద ఉన్న అతిపెద్ద అస్త్రం. అమెరికా ఆంక్షల కారణంగా, అమెరికాతో సమానమైన మైక్రోచిప్‌లను తయారు చేయడానికి చైనాకు మరో పదేళ్లు పట్టవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ కంప్యూటింగ్ శక్తి కొరత వల్ల డీప్‌సీక్ వంటి కంపెనీలు తదుపరి తరం మోడల్స్‌ను అభివృద్ధి చేయడంలో ఇప్పటికే జాప్యం ఎదుర్కొంటున్నాయి.

దీనికి సమాధానంగా, దేశీయ సెమీకండక్టర్ సరఫరాను మెరుగుపరుచుకోవడానికి చైనా తన టెక్ కంపెనీలను ఏకం చేస్తోంది. బైట్‌డ్యాన్స్ వంటి కంపెనీలపై ఎన్విడియా చిప్‌ల కొనుగోలు నిలిపివేసి, చైనా చిప్ తయారీదారులతో కలిసి పనిచేయాలని ఒత్తిడి చేస్తోంది. హువాయ్ ఇందులో ముందుండి, ఒకేసారి 10లక్షల చిప్‌లను కలిపి పనిచేసే వ్యవస్థలను అభివృద్ధి చేయటానికి వేలాది కంపెనీలతో పని చేస్తోంది. అయినప్పటికీ, సెమీకండక్టర్ సాంకేతికతలో అమెరికాకు ఉన్న అర్ధ శతాబ్దపు ఆధిక్యాన్ని అధిగమించడం చైనాకు అంత సులభం కాదు. 'గతంలో వేరే వాటిని సాధించినట్లుగానే దీనిని కూడా చిటికె లో సాధిస్తామనుకోవడం ప్రపంచంలోనే అత్యంత కష్టమైన పనిని తక్కువ అంచనా వేయడమే అవుతుందని అమెరికా జాతీయ భద్రతా మండలిలో పనిచేసిన మెక్ గెయిర్ అన్నారు. మరోవైపు, ఎన్విడియా, ఇతర అమెరికన్ కంపెనీలు భారీ పెట్టుబడులతో సాంకేతిక హద్దులను చెరిపివేస్తూ ముందుకు సాగుతున్నాయి.

అంతిమ విజేత ఎవరనేది ఇంకా స్పష్టంగా తెలియడం లేదని నిపుణులు అంటున్నారు. దీనికి కొంతవరకు కారణం, ఈ పోటీ కేవలం ఖర్చుతో మాత్రమే ముడిపడి ఉండకపోవడమే. ప్రస్తుతం ఒక క్లిష్టమైన అనిశ్చితి నెలకొంది: కేవలం అత్యుత్తమ చిప్‌లతో కంప్యూటింగ్ శక్తిని పెంచుకుంటూ పోతే సరిపోతుందా? అది మరింత శక్తివంతమైన ఎఐ మోడళ్లను నిరంతరం అందిస్తూనే ఉంటుందా? ఈ మధ్యకాలంలో ఎఐ పురోగతి కాస్త నెమ్మదించడంతో సిలికాన్ వ్యాలీలో ఈ ఆందోళన పెరుగుతోంది.

ఒకవేళ ఓపెన్ ఎఐ వంటి సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టినప్పటికీ, ఎఐ పనితీరు ఒకే స్థాయి వద్ద ఆగిపోతే, చైనాకు సమాన స్థాయిలో పోటీపడే అవకాశం దక్కుతుంది. 'వాస్తవానికి సాంకేతికత ఏ దిశలో వెళ్తుందో మాకు తెలియదు' అని జార్జ్‌టౌన్ సెంటర్ ఫర్ సెక్యూరిటీ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ స్ట్రాటజీ డైరెక్టర్, ఓపెన్ ఎఐ బోర్డు మాజీ సభ్యురాలు హెలెన్ టోనర్ అన్నారు.

ఈ పోటీకి అయ్యే ఖర్చు కేవలం డాలర్లతోనే ముగిసిపోదు. హ్యాకర్లకు ఎఐ మరింత శక్తివంతమైన సాధనాలను అందించడం, అలాగే మేధో సంపత్తిని దొంగిలించడానికి ప్రోత్సాహకాలు పెరగడం వల్ల సైబర్ దాడులు, సైబర్ గూఢచర్యం అనివార్యంగా మారుతున్నాయి. పెరుగుతున్న అపనమ్మకం కారణంగా ఉగ్రవాద ముఠాలు ఎఐ ని ఆయుధంగా మార్చుకోకుండా నిరోధించడం వంటి అంశాల్లో సహకారం దాదాపు అసాధ్యం అవుతుంది. 'ఎఐ ప్రచ్ఛన్న యుద్ధం ఖర్చులు ఇప్పటికే ఎక్కువగా ఉన్నాయి. అవి ఇంకా పెరగనున్నాయి' అని టెక్నాలజీ పాలసీ అనలిస్ట్ పాల్ ట్రియోలో అన్నారు. 'అమెరికా, చైనా ఎఐ ఆయుధాల పోటీ తాము ఊహిస్తున్నట్లుగా' అధునాతన ఎఐ సామర్థ్యాల అభివృద్ధిపై ఎదుటి పక్షం ఆంక్షలను పాటిస్తుందని ఏ పక్షం కూడా నమ్మలేని పరిస్థితి నెలకొంది.' పరిశోధన, అభివృద్ధి కోసం బిలియన్ల కొద్దీ నిధులు కుమ్మరిస్తున్నప్పటికీ,ఈ సాంకేతికత భవిష్యత్తుపై ప్రాథమిక ప్రశ్నల కు సమాధానాలు లేవు.ఈ కొత్త ప్రచ్ఛన్న యుద్ధం ఫలితం ఎంత అనిశ్చితంగా ఉందో, దానివల్ల కలిగే పరిణామాలు కూడా అంతే భారీగా ఉన్నాయి.

*(ఐపిఏ సర్వీస్)*

# ప్రేమ, భయం, పరువు మధ్య నలిగిపోయిన ఒక జీవితం



డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి
రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్,
ఫ్యామిలీ కౌన్సెలర్, 9703935321

సంగారెడ్డి జిల్లా కొల్లూరు డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద చోటు చేసుకున్న యువతి మృతి చెందిన ఘటన ఒక వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు. ఇది నేటి సమాజంలో యువత ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, భయం, సమస్యలెదురైనపుడు నిర్ణయం తీసుకోవడంలో కలిగే లోపాలను ప్రతిబింబించే అద్దంలాంటి యధార్థ సంఘటన.

ఒక క్షణం ప్రేమ, మరో క్షణం భయం, అంతలోనే జీవితం ముగింపు. హైదరాబాద్ పాతబస్తీ కోమటివాడకు చెందిన యువతి(20), చార్మినార్ ప్రాంతానికి చెందిన యువకునితో పరిచయం పెంచుకుంది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ప్రేమలో ఉన్న ఇద్దరూ భవిష్యత్తు కలలు కంటున్న సమయంలోనే ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది.

ఖాళీ ఫ్లాట్లో గడిపిన క్షణాలు, అనుకోని తండ్రి రాక, అంతా ఒక్కసారిగా మారిపోయింది.

తండ్రి ఎదురుపడితే ఏమవుతుందన్న భయం, పరువు పోతుందన్న ఆందోళన, ఆ క్షణంలో సరైన ఆలోచన చేయలేని మానసిక స్థితి. ఇవన్నీ కలిసి యువతిని ఒక తప్పటడుగు వైపు నెట్టాయి. బాల్కనీ ద్వారా తప్పించుకునే ప్రయత్నం చివరకు ఆమె ప్రాణాలకే ముప్పుగా మారింది. ఈ సంఘటనను కేవలం అప్రమత్తత లోపంగా లేదా తప్పుడు నిర్ణయం గా చెప్పేసి ముందుకు వెళ్లిపోవడం మన బాధ్యతారాహిత్యం అవుతుంది. ఎందుకంటే ఇక్కడ అసలు ప్రశ్న, యువత ఎందుకు అంతగా భయపడుతోంది? ఎందు కు ఒక క్షణంలో ప్రాణాలకంటే పరువే పెద్దదిగా కనిపిస్తోంది?

**అతి భయంతోనే చావు**

ఈ ఘటన వెనుక పని చేసిన ప్రధాన అంశం అతి భయం. అతిగా భయం కలిగినపుడు మనిషి మెదడులోని ఆలోచన, తర్కానికి బాధ్యమైన భాగం తాత్కాలికంగా పనిచేయడం తగ్గిపోతుంది. ఆ సమయంలో మనిషి పరిణామాలను అంచనా వేయలేడు, ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించలేడు, ప్రమాద స్థాయిని అర్థం చేసుకోలేడు, దీనినే సైకాలజీలో టన్నెల్ విజన్ అంటారు. అంటే ఒకే దారిలోనే ఆలోచన చేస్తూ ఉండడం. ఆ యువతి ఆ క్షణంలో ఆలోచించింది ఒక్కటే ఇక్కడ నుంచి తప్పించుకోవాలి. కానీ ఎలా? అన్న ప్రశ్నకు మెదడు సరైన సమాధానం ఇవ్వలేకపోయింది.

మన సమాజంలో ప్రేమ తప్పు కాదు అని మాటల్లో చెబుతాం. కానీ ఆ ప్రేమ బయటపడితే వచ్చే పరిణామాల భయం యువతను లోపల నుంచే చంపేస్తోంది. తల్లిదండ్రుల భయం, సమాజపు చూపు, బంధువుల మాటలు ఏమంటారో?అన్న ఆలోచన.. ఇవన్నీ కలిసి యువత మనసులో ఒక ఇన్ విజిబుల్ ప్రెస్సర్ కుక్కర్‌ను తయారు చేస్తా యి. ఈ ఒత్తిడి ఒక్కసారిగా పేలినప్పుడు, ఆ పేలుడు ఫలితంతోనే ఇలాంటి విషాదాంతాలు.

ఈ ఘటనను విషాద ప్రేమ కథగా మాత్రమే చూడ టం ప్రమాదకరం. ఇది అసలు ఒక మానసిక, సామాజిక వైఫల్యం. యువత తమ భావాలను భయం లేకుండా చెప్పుకోలేకపోవడం, తల్లిదండ్రులు వినే వాతావరణం లేకపోవడం, ప్రేమను నేరంగా ముద్ర వేసే ఆలోచనలు, భావోద్వేగ విద్య అవగాహన లేకపోవడం, ఇవన్నీ కలిసే ఇలాంటి సంఘటనలకు దారి తీస్తున్నాయి.

**మన సమాజం ఆలోచించాల్సిన ప్రశ్నలు**

ఈ ఘటన తర్వాత మనం వేసుకోవాల్సిన ప్రశ్నలు ఇవీ. ఒక యువతి తండ్రిని ఎదుర్కోవడానికంటే చావునే ఎందుకు ఎంచుకుంది?, ప్రేమను అంగీకరించలేని భయ వాతావరణం ఎవరు సృష్టించారు? మన ఇళ్లలో పిల్లలు భయపడకుండామాట్లాడగలుగుతున్నారా?, ఇవన్నీ ఆలోచించకపోతే, ఈ ఘటన చివరిది కాదన్నది చేదు నిజం.

తల్లిదండ్రులు భయంతో కాదు, భరోసాతో మాట్లాడే సంస్కృతి, పాఠశాల స్థాయి నుంచే భావోద్వేగ నైపుణ్యాలు నేర్పించడం, ప్రేమ, సంబంధాలపై సరైన అవగాహన కలిపించడం, యువతకు కౌన్సెలింగ్ సేవలు సులభంగా అందుబాటులో ఉండటం, ఇవి లేకుండా కేవలం చట్టాలు, హెచ్చరికలు మాత్రమే ఉంటే సరిపోవు అన్నది అక్షరాల సత్యం.

యువతి మృతి ఒక ప్రమాదం కాదు ఇది భయంతో నడిచే సమాజానికి అద్దం. తండ్రిని ఎదుర్కోవడానికంటే చావు సులభం అనిపించిన మన స్తత్వం ఎలా ఏర్పడింది? ప్రేమను అంగీకరించలేని వాతావరణం ఎవరు సృష్టించారు? తీవ్ర భయం మనిషిని ఆలోచించనివ్వదు. ఆ క్షణంలో సరైన దారి కనిపించదు. అందుకే ఒక యువతి ప్రాణాలనే మూల్యం గా చెల్లించింది. ఇది ప్రేమ కథ కాదు. ఇది కమ్యూనికేషన్ వైఫల్యం. భయం కాదు భరోసా కావాలి. శిక్ష కాదు సంభాషణ కావాలి. లేకపోతే ఇలాంటి వార్తలు మళ్లీ మళ్లీ చదవాల్సి వస్తుంది.

**ప్రాణం కన్నా పరువు పెద్దదా?**

యువతి మృతి ఒక ప్రమాదం మాత్రమే కాదు. ఇది మన సమాజానికి ఒక హెచ్చరిక. ప్రాణం కన్నా పరువు పెద్దదిగా అనిపించే పరిస్థితులు మనమే సృష్టించుకుంటే, ఇలాంటి విషాదాలు మళ్లీమళ్లీ మనల్ని వెంబడిస్తాయి. ఒక యువతి చేసిన తప్పటడుగు వెనుక మనందరి మౌనం కూడా కొంత కారణమే.

యువతకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలి, భయం వచ్చినప్పుడు మీరు ఒంటరిగా లేరు. ఆ క్షణంలో నిర్ణయం తీసుకోవద్దు. సహాయం అడగడం బలహీనత కాదు. తల్లిదండ్రులకు ఒక విజ్ఞప్తి–మీ పిల్లలు నిజం చెప్పడానికి భయపడుతున్నారంటే, అక్కడే ప్రమాదం మొదలవుతుంది. వినే మనసు, భరోసా ఇచ్చే మాట ఒక ప్రాణాన్ని కాపాడగలదు. సైకాలజీ చెబుతుంది ప్రేమ, భావోద్వేగాలు సహజం. వాటిని నేరంగా ముద్ర వేయడమే సరి కాదు. ఒక మంచి సంభాషణ ఒక ప్రాణాన్ని కాపాడ గల దు. ఒక మౌనం ఒక ప్రాణాన్ని తీసేయగలదు. అందులో నుండి ఎంచుకోవాల్సింది మనమే.

# 'పుస్తక ప్రదర్శన' వెలుగులై ప్రసరించాలి



మేరుగు రాజయ్య
9441440791

అందరికీ అందుబాటులో ఉంటుంది పుస్తకం. పుస్తకం అంటే అందరికీ ఇష్టం. పుస్తకాలు చదివితే మెదడులో న్యూరాన్లు వృద్ధి పొంది, సామర్థ్యం, జ్ఞాపకశక్తి, నిర్ణయాత్మక శక్తి, చురుకుదనం పెంపొంది ప్రశాంతత కలుగుతుందని సైన్స్ చెపుతుంది. పుస్తకం హస్త భూషణం. ఇప్పుడు ప్రైవేటు పాఠశాలలు వచ్చి పుస్తకాలను, చదువును ఖరీదు చేసినవి. ప్రభుత్వ పాఠశాలలు వర్ధిల్లినప్పుడు మడిసిన అరచేతిలో పుస్తకాలు పట్టుకుని లేదా భుజంమీద పెట్టుకుని మాట్లాడుకుంటూ నడకతో బడికి పోయేవారు. చదువుతున్న క్లాస్ పాసై పై తరగతిలో జాయిన్ అయిన తరువాత పాత పుస్తకాలను జూనియర్స్‌కు అమ్మి, సీనియర్స్ నుండి సగం లేదా ముప్పావు రేటుకు కొనుక్కొని తల్లిదండ్రులకు ఆర్థిక భారం పడకుండా పుస్తకాలను మంచిగా కాపాడుకునేది. పుస్తకాలు పట్టుకునిపోయి మంచెమీద కూర్చొని చదువుతూ, జొన్న కంకులను పిట్టలు తినకుండా కావలి కాసేది. సామాజిక వృత్తుల కుటుంబాల విద్యార్థులు బడి సెలవుల రోజుల లో వ్యవసాయ కూలీ పనులకు పోయి పుస్తకాలు, కాపీలు కొనుక్కునేది. పుస్తకాల రక్షణ గురించి పాత న్యూస్ పేపర్స్‌ను, అట్టల ను బుట్టలో వేసేది. పుస్తకాల మీద కనీసం పేర్లు కూడా రాసుకోకుండా భద్రపరచుకునేది.

**భాషకు భౌతిక రూపమే 'లిపి'**

భాష (నుడి)ఆలోచనలను పంచుకోవడానికి అలాగే విజ్ఞానానికి, వివేకానికి, అభివృద్ధికి, భవిష్యత్తుకు మార్గదర్శకాలుగా ఉపయోగపడడానికి అక్షరాలను పొందుపరచి పుస్తకాలను వెల్లడించ డం జరుగుతుంది. పుస్తకాల భౌతికతకు మూలం కాగితం. కాగితాన్ని మొదటగా లీయాంగ్‌లో చైనా కోర్టు అధికారి త్సాయ్ లున్ మల్బరీ బెరడు, జనపనార, గడ్డలను నీటితో కలిపి గుజ్జుగా చేసిన ద్రవాన్ని బయటకుతీసి సన్నని చాపలో ఎండలో ఆరబెట్టడానికి వేలాడదీశాడు. దాని తరువాత 1900 సంవత్సరాల క్రితం డ్రాయింగ్‌లను, రచనలను రికార్డు చేయడానికి చైనాలో కాగితాన్ని ఉత్పత్తి చేశారు. 8వ, శతాబ్దంలో సాంకేతికతతో తయారు చేసిన కాగితం ఆసియాకు, ఈజిప్టు, మొరాకో ద్వారా యూరప్‌కు వ్యాపించింది. అందుకే చైనా దేశాన్ని పేపర్ ఇన్వెంటర్‌గా కూడా పిలుస్తారు. భారత్‌లో తాటి ఆకుల మాన్యూ స్క్రిప్టులలో, బిర్చ్ బెరడులలో అక్షరాలను పొందుపరిచారు. 1467లో కాశ్మీర్‌లో మొదటి పేపర్ పరిశ్రమను స్థాపించారు. మొదటి మెకనైజ్డ్ పేపర్ మిల్లు 1812లో పశ్చిమ బెంగాల్‌లోని 'సోరంపూర్'లో స్థాపించారు. 12వ, శతాబ్దంలో కాశ్మీర్ చరిత్రకారుడు 'కల్హణచే' సంస్కృతం లో రాసిన 'రాజతరంగిణి'మొదటి పుస్తకంగా నిలిచింది. ఇక పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పొందడానికి అక్షరాస్యతను సాధించాలి. పుస్తకాల పఠనాన్ని కూడా కొనసాగించాలి. ఎవ్వరూ ఇవ్వలేని జ్ఞానాన్ని, మానసిక ఆరోగ్యాన్ని,ప్రశాంతతను,సమాజ సంస్కృతులపై అవగాహనను,ఆత్మ విశ్వాసాన్ని, భావవ్యక్తీకరణకు,సంభాషణ నైపుణ్యానికి,మేధో వికాసానికి పుస్తకం తోడ్పడుతుంది. పుస్తకాలను చదివేవారు వెయ్యి జీవితాలను తెలుసుకుంటారు. చదువనివారు ఒక జీవితానికే పరిమితం అవుతారు. అందుకే ప్రజాకవి వేమన 'చదువు చదువకున్న సౌఖ్యంబు నుండదు,చదువు చదివెనేని సరసుడగును,చదువు మర్మమెరిగి చదివిన చదువురా విశ్వదాభిరామ వినుర వేమ'! మరో కవి 'చదువురాని జనుల మెచ్చరు సుమ్ము, చదువు నేర్చువాని జనులు మెచ్చు, దేశకాల గతులు తెలియగా వచ్చును, తెలియు మంచి చెడ్డ తెలుగుబిడ్డనన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో, కాని మంచి పుస్తకం కొనుక్కో' అంటూ హితవు పలికారు.

**ప్రపంచంలో తొలి బుక్ ఫెయిర్**

పుస్తకాల ప్రదర్శన 1462లో జర్మనీలోని 'ఫ్రాంక్ ఫర్ట్ లోను, లీఫ్ జిగ్‌లోను జరిగిన మూలాలు ఉన్నవి. భారత్‌లో 1918న కోల్‌కత్తాలోని కాలేజీ స్ట్రీట్‌లో పుస్తకాల ప్రదర్శన జరిగింది. న్యూఢిల్లీలో 1972న నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'వరల్డ్ బుక్ ఫెయిర్' జరిగింది. మరల కోల్ కత్తాలో 1976 నుండి 'ఆధునిక బుక్ ఫెయిర్' కొనసాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా పుస్తకాలు మరియు పఠనాన్ని జరుపుకునేందుకు యునెస్కో 1995 ఏప్రిల్ 23ను 'పుస్తక దినోత్సవం'గా ప్రకటించింది. హైదరాబాద్‌లో 1985న అశోక్ నగర్ లోని 'సిటీ సెంట్రల్ లైబ్రరీలో బుక్ ఫెయిర్ ప్రారంభమైంది.ఆ తరువాత జరిగిన బుక్ ఫెయిర్స్ నిజాం కాలేజీ గ్రౌండ్స్, పబ్లిక్ గార్డెన్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కేశవరావు మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్స్, గత నాలుగు సంవత్సరాలుగా తెలంగాణ కళాభారతి(ఎన్టీఆర్ స్టేడియం)లో జరుగుచున్నవి. 2025 డిసెంబర్ 19న తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు '38వ, హైదరాబాద్ బుక్ ఫెయిర్' ను ప్రారంభించారు.







365 స్టాళ్లు నెలకొన్నవి. అందులో 13 రాష్ట్రాలకు చెందిన స్టాళ్లు కూడా పుస్తకాల ప్రదర్శనలు చేశారు. సాహిత్య, అభ్యుదయ, సామాజిక, చారిత్రక, పాఠ్య పుస్తకాలు, కార్మిక, ఉద్యోగ, వినియోగ, సమాచార, మానవహక్కులు, సైన్స్, మ్యాథ్స్, విజ్ఞానం, ఉద్యోగ, ఉపాధి, పోటీ పరీక్షల పుస్తకాలు, వ్యవసాయ, ఆహార, ఆరోగ్య సంబంధమైన రచన పుస్తకాలను ఎక్కువగా సందర్శకులు పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా 'తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ' ప్రచురణల విస్తరణ పెరగాలి. అందుకు ప్రభుత్వం కూడా చొరవ చూపాలి.

స్వరాష్ట్రం తెలంగాణ ఏర్పడి 12 ఏండ్లు కావస్తుంది. ఇప్పటి వరకు 'తెలంగాణ రాష్ట్ర అధికార భాషా చట్టం' రూపొందించబడలేదు. విద్యార్థుల, ఉపాధ్యాయుల, పరిశోధకుల తెలుగు జర్నల్స్‌తో పాటుగా కార్మిక, కర్షక, రైతు కూలీల సంక్షేమ, చట్ట, జిఒల సంబంధమైన ప్రచురణలను అందుబాటులోకి తేవాలి. భారత్ వ్యవసాయక దేశం. గ్రామాలు సాంస్కృతికంగా, సామాజికంగా, ఆర్థికంగా విద్య, వైద్యపరంగా అభివృద్ధి చెందినప్పుడే జనసాంద్రత ఒత్తిడిని తగ్గించకలుగుతాము. అందుకు గ్రామస్థాయిలో, మండల స్థాయిలో పనిచేస్తున్న మండల అభివృద్ధి, రెవెన్యూ, పంచాయితీ రాజ్, ఇరిగేషన్, వ్యవసాయ, పశు సంవర్ధక, పౌర సరఫరాల శాఖల విధులకు, నిర్వహణలకు, పథకాలకు, నిధులకు, ప్రజాఉపయోగ కార్యక్రమాలకు చేసిన ఖర్చులకు సంబంధించిన వివరాల ప్రచురణలు పుస్తక ప్రదర్శనలలో కానరాలేదు. సమాచార హక్కు చట్టం 2005,సెక్షన్ 4(1),(బి) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యక్రమం, నిర్వహణ, బాధ్యతలు, పర్యవేక్షణలను ప్రదర్శింపచేయాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు 10లక్షల రూపాయల చొప్పున పుస్తక ప్రదర్శనకు, గ్రామాల్లో గ్రంథాలయాల పరిపుష్టికి 'కోటి రూపాయలు' కేటాయిస్తున్నట్లుగా ప్రకటించడాన్ని హర్షించాలి.

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని ప్రత్యేక స్టాల్‌లో పి.వి శ్రీహరి ప్రచురణ రిజిస్ట్రార్ పుస్తక ప్రచురణ సంస్థలను ఉద్దేశించి ప్రకటనను ప్రదర్శించారు. 1867 ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ చట్టంలోని సెక్షన్ 20 కింద రూపొందించబడిన 'తెలంగాణ (ఆంధ్రప్రదేశ్) ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్ రూల్స్ 1960 నిబంధనల ప్రకారం పబ్లికేషన్స్ రిజిస్ట్రార్‌కు తెలంగాణ రాష్ట్రంలో ముద్రించబడిన, ప్రచురించబడిన అన్ని పుస్తకాల యొక్క మూడు కాపీలను ప్రింటర్స్,రచయితలు,ప్రచురణ సంస్థలు ఉచితంగా ఇవ్వాలి. ఇట్టి పుస్తకాల మూడు కాఫీలలో ఒకటి న్యూఢిల్లీలోని పార్లమెంటు లైబ్రరీకి, రెండో కాఫీ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, మూడో కాఫీని నిబంధనలలోని రూల్స్ 5 కింద ఆఫీస్ రిఫరెన్స్ లైబ్రరీలో భద్రపరుస్తామని పి.వి శ్రీహరి, ప్రచురణ రిజిస్ట్రార్, 155582, సిటీ సెంట్రల్ లైబ్రరీ క్యాంపస్, అఫ్జల్ గంజ్, హైదరాబాద్ 500012 తెలిపారు. పుస్తక ప్రచురణ సంస్థలు ఉచితంగా ఇచ్చే పుస్తకాల వలన కూడా పబ్లిక్ గ్రంథాలయాలు వర్ధిల్లుతాయి. పుస్తకాలకు జీవన విధానాలను పరిణితిగా మార్చే శక్తి ఉంది. జ్ఞానం, వివేకం, ఆత్మవిశ్వాసం పెంపొందించే శక్తి ఉంది. సమాజంలో గౌరవంగా, మంచి ఆలోచనలతో నడవడికగా నడవడానికి, సమస్యలను ఎదుర్కోవడానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, అర్థవంతంగా జీవించడానికి తోడ్పడే శక్తి పుస్తకానికి ఉంది. హైదరాబాద్ పుస్తకాల ప్రదర్శనను చూస్తే విశ్వాసం కంటే నిజమన్న, భౌతికమన్న సత్యం బోధపడింది. నా సహ రిటైర్డ్ సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు ఆళవందార్ వేణు మాధవ్‌తో కలిసి సహజ కవి అందెశ్రీ ప్రాంగణంలో వేడుకైన 'హైదరాబాద్ పుస్తకాల ప్రదర్శనను'' చూసిన పిదప మాకైతే తెలంగాణలో వెలుగులను ప్రసరింప చేస్తుందనే భవిష్యత్తు కనిపించింది.

## కానిస్టేబుల్ కుటుంబానికి అండ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తమతోపాటు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. వివరాల ప్రకారం నాగారం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ శీలం కమలాకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా 2009 బ్యాచ్‌కు చెందిన మిత్రులు తోటి మిత్రుల నుండి రూ.2లక్షల 67వేల మొత్తాన్ని సేకరించి కమలాకర్ కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 2009 బ్యాచ్ కానిస్టేబుళ్ళు జె శ్రీకాంత్, టి నరేష్, కె సైదులు, సిహెచ్ దుర్గాప్రసాద్, జోసెఫ్, మధుకర్, రవి, జానిమియా పాల్గొన్నారు.



## మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉద్యోగి సస్పెన్షన్




**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని గుంపుల తిరుమలగిరి ఉప కేంద్రంలో విధుల సమయంలో మద్యం సేవించి, మహిళ ఆరోగ్య కార్యకర్త, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉద్యోగి ఆవుల వెంకటేశ్వర్లును తక్షణమే విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనను అత్యంత గంభీరంగా పరిగణించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ వైద్యసేవలలో పనిచేసే ఉద్యోగులు విధుల సమయంలో క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందని డిఎంహెచ్ఓ స్పష్టం చేశారు. ఇలాంటి అనుచిత ప్రవర్తన పట్ల శాఖ ఎలాంటి సహనాన్ని ప్రదర్శించదని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ చేపట్టనున్నట్లు, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## 26న గ్రామగ్రామాన అరుణ పతాకావిష్కరణ

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 2026 జనవరి 18న ఖమ్మంలో జరగబోవు శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్యాణ్ కృష్ణ పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో పార్టీ కార్యాలయంలో పేరబోయిన బంగారి అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఈ నెల 26 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని కోరారు. గత వందేళ్లుగా పేద ప్రజల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని ఈవో రెండుసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ, కొన్ని రాజకీయ పార్టీలు నిబంధనలను బేఖాతరు చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానం, మున్సిపల్, పోలీస్ శాఖలు స్పందించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ కో_ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, గీత పనివారల సంఘం మండల అధ్యక్షులు గుండు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ 100 వసంతాల అరుణ పతాకావిష్కరణ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 100 సంవత్సరాలు ఉత్సవాలలో భాగంగా ఈనెల 26న సిపిఐ మండల కార్యాలయం వద్ద అరుణ పతాకావిష్కరణ ఉంటుందని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం లు హాజరవుతున్నట్లు తెలిపారు. మండల పార్టీ కార్యవర్గ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు శాఖ కార్యదర్శులు యావత్తు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సిపిఐ 100 వసంతాల అరుణ పతాకావిష్కరణ కార్యక్రమంలో భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## సమాజానికి నాణ్యమైన విద్య, వైద్యం కోసం పౌర స్పందన వేదిక పోరాటం



**ప్రజాపక్షం/కోదాడ:** సమాజంలో విద్యలో అంతరాలు తొలగించేందుకు కవులు, రచయితలు సాహితివేత్తలు తమ రచనలు, కవితల ద్వారా ప్రజల్లో చైతన్యం తేవాలని పౌర స్పందన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. బుధవారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆవరణలో పౌర స్పందన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. విద్యలోని అంతరాలకు పాలకుల విధానాలే కారణమన్నారు. విద్యలో అంతరాలు తోనే సమాజంలో సామాజిక ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పోరాటానికి కవులు, రచయితలు సాహితివేత్తలు మేధావులు ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వామలు కావాలని పిలుపునిచ్చారు. పౌర స్పందన జిల్లా అధ్యక్షులు ఆర్.ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెవి మంగా, డివిజన్ అధ్యక్షులు రమణ, జిల్లా కార్యదర్శి బొగ్గారపు రామ్మూర్తి, టిఎస్‌యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఆంజనేయులు, పుప్పాలకృష్ణమూర్తి పలువురు కవులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల బకాయిలు ఒకేసారి చెల్లించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వము మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అధికారంలోకి రాగానే డిఎ బకాయిలు, పిఆర్‌సి అమలు చేస్తామని హామీలు ఇచ్చి ఇంతవరకు వాటిని నెరవేర్చక నిర్లక్ష్యం చేస్తు పెన్షనర్ల జీవితాలతో ఆటలాడుకుంటుందని వెంటనే పెన్షనర్ల బకాయిలు ఒకేసారి చెల్లించాలి లేనిచో ఉద్యమ కార్యాచరణ జేఏసీ రూపొందిస్తుందని పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర పరిశీలకులు పన్నాల గోపాల్ రెడ్డి హెచ్చరించారు. మార్చి 20 24 నుండి రిటైర్డ్ అయిన పెన్షనర్ల బకాయిలు రానందున ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుటకు మంగళవారం తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలలో పెన్షనర్స్ జేఏసీ,రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముందు దీక్షలు కొనసాగుతున్నాయి.అందులో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో దీక్షలను గోపాల్ రెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బిక్షపతి ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి ,గణేష్ వెంకట్‌రెడ్డి,ముజాయిద్దీన్ అలీ,అంజయ్య సుధాకర్ వివిధ సంఘాల బాధ్యులుపాల్గొని సంఘీభావం తెలిపినారు.

## చేనేత రుణమాఫీ చేయకపోతే సిఎం ఇంటి ముందు ధర్నా

### రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** వారంలో జుల్లో చేనేత కార్మికుల రుణమాఫీ విడుదల చేసి ఖాతాలో జమ చేయకపోతే సీఎం ఇంటి ముందు ధర్నాకు దిగుతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. తెలంగాణ జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె పోచంపల్లి మండల వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికుల సమస్యల కోసం ఉద్యమిస్తున్న నిరసన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.కొండ లక్ష్మణ్ బాపూజీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆమె దీక్షలో కూర్చుని కార్మికుల సమస్యలు విని మాట్లాడారు. పద్మశాలీలు బీసీలు, రాజకీయంగా ఎదిగి పోరాటాలు చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు, కార్యవర్గ సభ్యులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు మాస్టర్ వీవర్స్ వ్యాపారులు చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బ్యాటరీతో నడిచే సైకిళ్లను దివ్యాంగులకు ఇవ్వడం ద్వారా వారు ఇంకా ఆర్థికంగా పైకి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో జిల్లాలో అర్హత ఉన్న దివ్యాంగులందరికీ దశలవారీగా బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్‌ను అందజేస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.బుధవారం ఇసిఐఎల్ సహకారంతో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం సమీపంలోని టీటీడీసీలో దివ్యాంగులకై ఏర్పాటు చేసిన బ్యాటరీ మోటార్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ప్రజావాణి,ఇతర సమయాలలో జిల్లాలో అనేకమంది దివ్యాంగులు తమకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్ కావాలని కోరిన కోరిక మేరకు ఈసీఐఎల్ యాజమాన్యంతో మాట్లాడి మొదటి విడతన జిల్లాలోని 105 మంది దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే మోటార్ సైకిల్ ఇప్పిస్తున్నామని,ముందుగా బుధవారం 50 మందికి వీటిని పంపిణీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో దివ్యాంగుల సర్వే నిర్వహించగా సుమారు 55వేల మంది దివ్యాంగులు ఉన్నట్లు తెలిసిందని, ముందుగా సుమారు 70 నుండి 80 లక్షల రూపాయల విలువ చేసే బ్యాటరితో నడిచే మోటార్ సైకిళ్లు ఇప్పిస్తున్నామని, ఇందుకు ఆమె ఇసిఐఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇసిఐఎల్ సిఎండి అనురాగ్ కుమార్ మాట్లాడుతూ నల్లగొండ లాంటి జిల్లాకు తమ సంస్థ ద్వారా దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. తమ సంస్థ చంద్రయాన్ తో పాటు, న్యూక్లియర్ పవర్ తయారీ వంటి అంశాలలో చేస్తున్నదని, సిఎస్ఆర్ నిధుల కింద సామాజిక కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు సహకారం అందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇసిఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రామస్వామి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కృష్ణ కుమార్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుబాబు, అలింకో డిజిఎం సందేశ్ సింగ్,జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,సునీల్ కుమార్, సాంబమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,డిసిహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి హాజరయ్యారు.

## కేసులు సత్వరం పరిష్కరించేందుకు కృషి

### సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా త్వరితగతిన, సమర్థవంతంగా వినియోగదారులు కేసులు సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారుల చట్టం 1986లో ఏర్పడిందని ఈ చట్టం ద్వారా వినియోగదారుడు ఏదైనా వస్తువు కొని మోసపోయినట్లయితే దానికి పరిహారం కోసం వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చన్నారు. వినియోగదారుడు మార్కెట్‌లో కొనుగోలు చేయునప్పుడు కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏది మంచో ఏది చెడో గ్రహించాలని, వ్యాపారులు తమ లాభార్జన కోసం తప్పుడు ప్రకటనలు, ఆఫర్లు ప్రకటిస్తారని వాటిని చూసి అత్యాశకు పోయి వినియోగదారులు మోసపోవద్దని కోరారు. ప్రస్తుతం డిజిటల్, ఆన్‌లైన్ నేరాలు పెరిగిపోయాయని వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారుడు మోసపోయినట్లయితే వినియోగాదురల ఫోరమును ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. డిసిఐసి కమీషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినియోగదారులు నేరుగా కేసును దాఖలు చేయవచ్చన్నారు. వినియోగదారులు నష్టపోయినప్పుడు వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం నేరుగా ఫోరంలో కేసు ఫైల్ చేసినట్లైతే తప్పకుండా న్యాయం కల్పించి నష్టపరిహారం ఇప్పించగలమన్నారు. పరిమిత సమయంలోపు కేసు ఫైల్ చేయవల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి మోహన్‌బాబు, ఆర్‌టిఓ జయప్రకాశ్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్‌శర్మ, సివిల్ సప్లై మేనేజర్ రాము, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, కమిషన్ సభ్యులు ప్రేమ్‌సాగర్, జిల్లాలోని గ్యాస్ డీలర్లు, రేషన్ షాపు డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లాలో నేరాల నియంత్రణ గణనీయమైన తగ్గుదల




### సైబర్ నేరాలు..ఆస్తి నేరాలు..మత్తు పదార్థాల నిర్మూలనలాంటి కీలక రంగాల్లో పురోగతి :జిల్లా ఎస్పి

**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ జిల్లా పోలీసు శాఖ 2025 సంవత్సరంలో నేర నియంత్రణ,ప్రజల భద్రత, మహిళలుపిల్లల రక్షణ, సైబర్ నేరాల నివారణ, ఆస్తి నేరాలని యంత్రణ,మత్తు పదార్థాల నిర్మూలన,రోడ్డు భద్రత,యువత సాధికారత, పోలీస్ సంక్షేమం వంటి అనేక కీలక రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రజల సహకారం,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,వృత్తి పర మైన దర్యాప్తు, సమర్థ వంత మైన అభియోగాలే ఈ ఫలితాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, గణనీయమైన తగ్గుదల 2024తో పోలిస్తే 20 25లో నల్లగొండ జిల్లాలో మొత్తం నేరాలు 8,834 నుండి8,493కి తగ్గాయని,తీవ్రమైన నేరాలు 221 నుండి 169కి తగ్గడం విశేషమని తెలి పారు.2025 జనవరి నుంచి డిసెంబర్ 20 వరకు ఘోర నేరాల కేసుల్లో రెండు మరణ శిక్షలు,జీవిత ఖైదు సహా మొత్తం 132 దో షసిద్ధులు సాధించారు. 2024తో పోలిస్తే శిక్షల శాతం 103 శాతం పెరిగిందన్నారు.ఆస్తి నేరాల కేసులు 2024లో 700, 2025లో 637,ఆస్తి నష్టం విలువ రూ.15.17కో ట్లు, రూ.5.28 కోట్లు ఆస్తి రికవరీ 5.53 కోట్లు,రూ.3.33 కోట్లు ఆస్తి నేరాల గుర్తింపు శాతం 36.47 శా తం నుండి 63.08 శాతంకు పెరుగుదల మొత్తం కేసుల గుర్తింపు శాతం 64.57 శాతం నుండి 69.07 శాతంకు పెరుగుదల ఈ గణాంకాలు జిల్లా పోలీసుల దర్యాప్తు సామర్థ్యాన్ని ప్రతి బింబిస్తున్నాయన్నారు.సైబర్ నేరాల వల్ల బాధితులు కోల్పోయిన మొత్తం 2024లో రూ. 16.31 కోట్లు,2025లో రూ.4.62 కోట్లు, అవగాహననే ప్రధాన ఆ యుధంగా భావించి డిఎస్పి స్థాయి అధికారి నేతృత్వంలోవ్యవస్థ ద్వారా గ్రామాలు, పట్టణాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు దీని వల్ల సైబర్ మోసాలపై ప్రజల్లో చైతన్యం పెరిగిందని ఎస్పి తెలిపారు.మహిళలు పిల్లల భద్రత షీటీమ్స్ ద్వారా అవగాహన ద్వారా రక్షించడం జరిగిందని తెలిపారు.

## ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఓపెన్ మోరి


### ప్రజారోగ్యంతో వైద్యశాఖ నిర్లక్ష్యం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వద్ద ఓపెన్‌గా ఉన్న మోరీలతో ప్రజారోగ్యానికి, ముఖ్యంగా చిన్న పిల్లల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతుందని, మూడు నెలల్లోపు చిన్నారులు సహా గర్భిణీలు, వ్యాక్సినేషన్ కోసం వచ్చే తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆరోగ్య శాఖ యంత్రాంగం స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వ్యాక్సిన్ కోసం వచ్చిన చిన్న పిల్లలు, తల్లులు మోరీలు నుంచి వచ్చే దుర్వాసనతో అక్కడ ఉండలేకపోతున్నారని మండిపడుతున్నారు. ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వద్దనే ఈ విధమైన నిర్లక్ష్యం కొనసాగడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. చిన్నారులకు వ్యాక్సినేషన్ వంటి కీలక సేవలు అందించే కేంద్రం చుట్టూ అపరిశుభ్ర వాతావరణం ఉండటం అత్యంత ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్థానికులు పలుమార్లు సంబంధిత పంచాయతీ, వైద్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



## సూర్యాపేట జిల్లాలో 12శాతం తగ్గిన నేరాలు

### సూర్యాపేట జిల్లా పోలీస్ వార్షిక నివేదికను వెల్లడించిన జిల్లా ఎస్పి కె నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన పోలీసు ప్రజాభరోసా కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా 12శాతం నేరాలను తగ్గించినట్లు జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వార్షిక నివేదికను వెల్లడించారు. పోలీస్ బరోసా కార్యక్రమం ద్వారా అసాంఘీక కార్యక్రమాలు, అక్రమ రవాణా, చట్టాల అమలు, మహిళల భద్రత, వేధింపుల నిర్మూలన, రోడ్డు భద్రత, సత్ప్రవర్తన పట్ల జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దీని ద్వారా 320 గ్రామాల్లోను, ఎస్‌సి, ఎస్‌టి, బడుగు బలహీన వర్గాలకు చెందిన 60 విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. 2024 సంవత్సరం కంటే 2025లో ముఖ్యంగా తీవ్రమైన నేరాలు 42.8శాతం, రోడ్డు ప్రమాదంలో 9 శాతం, 32.8 శాతం దొంగతనాలను తగ్గించడంలో జిల్లా పోలీసు శాఖ ప్రగతి సాధించిందన్నారు. గ్రామ పంచాయితీ ఎన్నికలను అత్యంత ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగిందని, ఎక్కడ కూడా ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లకు ప్రజలకు పోలీస్ శాఖ పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎన్నికల సందర్భంగా రూ.1లక్షా 20వేల నగదు స్వాధీనం చేసుకోగా, 144 కేసుల్లో రూ.10లక్షల 53వేల విలువైన 1740 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకోగా, 429 కేసుల్లో 1488 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. పోలీసు దర్యాప్తులో నైపుణ్యం పెరగడం, భద్రత కల్పించడం, తనిఖీలు, నిరంతర పెట్రోలింగ్ వల్ల జిల్లాలో తీవ్రమైన నేరాలు 42.8శాతం తగ్గాయన్నారు. 2024లో 161 తీవ్రమైన నేరాలు ఉండగా, 2025లో 92 కేసులు మాత్రమే నమోదైనట్లు వివరించారు. ఇందులో ముఖ్యంగా అత్యాచారుల విషయంలో 2024లో 84 కేసులు నమోదవగా, 2025లో 46 శాతం తగ్గి 45 కేసులు నమోదైనట్లు చెప్పారు. తీవ్రమైన దొంగతనాలు 2025లో 56శాతం తగ్గాయి, వంచన కేసులు పూర్తిగా నిర్మూలించామన్నారు. డేకాయిట్, రాబరీలను సగం మేర తగ్గించినట్లు తెలిపారు. సైబర్ మోసాలకు సంబంధించి ఈ సంవత్సరం 207 కేసుల్లో రూ.10కోట్లు మోసానికి గురవగా రూ.1కోటి 8లక్షలు రికవరీ చేసి బాధితుల ఖాతాలో జమ చేయించామని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణాను నిరోధిస్తూ ఈ సంవత్సరం 36 కేసులు నమోదు చేసి 230 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని, 99 మందిని అరెస్టు చేశామన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గంలో అమ్మేవారిని గుర్తించి 50 కేసులు నమోదు చేసి 616 క్వింటాల బియ్యము స్వాధీనం చేసుకొని 94 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టంగా నిర్మూలిస్తూ ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేస్తూ ఈ సంవత్సరం అక్రమ రవాణాకు సంబంధించి 426 కేసులు నమోదు చేసి 500 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం 9 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. 2024లో 622 రోడ్డు ప్రమాదాల్లో 278 మంది మరణించగా, 2025లో 563 ప్రమాదాలలో 26శాతం తగ్గి 204 మరణాలు సంభవించినట్లు చెప్పారు. పటిష్టమైన పెట్రోలియం, నిరంతర తనిఖీల వల్ల జిలాల్లో ఈ సంవత్సరం 32 శాతం దొంగతనాలు తగ్గాయన్నారు. వెట్టిచాకిరి, నిరాదరణకు గురైన పిల్లలను సంరక్షించడం కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ద్వారా ఈ సంవత్సరం 197 మంది బాలురులను 143 మంది బాలికలను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు, వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్ రెడ్డి, సిఐలు వెంకటయ్య, నాగేశ్వరరావు, రాజశేఖర్, చరమందరాజు, శివశంకర్, బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రికి వైకుంఠ ఏకాదశి ఆహ్వానం

### యాదగిరిగుట్ట ఇఒ వెంకటరావు ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేత

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వైభవోపేతంగా నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు రావాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి సాదర ఆహ్వానం లభించింది. బుధవారం హైదరాబాద్లో ముఖ్యమంత్రిని కలిసిన దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.వెంకటరావు, ఆలయ అర్చకులు ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధానార్చకులు, వేద పండితులు ముఖ్యమంత్రికి మంత్రపుష్పాలతో వేదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ నెల 30న జరగనున్న వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజున ఉత్తర ద్వార దర్శనానికి విచ్చేసి, స్వామివారిని దర్శించుకోవాలని ఈవో కోరారు. వైకుంఠ ఏకాదశి , అధ్యయనోత్సవాల సందర్భంగా యాదగిరిగుట్టలో భక్తుల కోసం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో వెంకటరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## ప్రజారోగ్యం మున్సిపల్ కార్మికుల చేతుల్లోనే

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం మున్సిపల్ కార్మికులు, సిబ్బంది చేతిలో ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య, నీటి సరఫరా సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణి, జీవీపీ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాట్లు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల బాధ్యత ఒక సామాజిక బాధ్యత లాంటిదని అన్నారు. అందరం కలిసి మిర్యాలగూడ పట్టణ అభివృద్ధిలో, పారిశుధ్యంలో భాగస్వాములమవుదామన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొచ్చినట్లయితే పరిష్కరిస్తానన్నార. పట్టణంలోని పందిర్లపల్లి చెరువు చుట్టు రూ.4కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి పరిసరాలు పచ్చనిచెట్లతో ఏర్పాటు చేసి పర్యాటక స్థలంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించామన్నారు. పట్టణంలోని డ్రైనేజీ నీరంతా చేరుకునే చెన్నచెరువు తవ్వకానికి, వాటర్ రీసైక్లింగ్ కోసం పలు సంస్థలతో చర్చిస్తున్నామన్నారు. పట్టణంలో పెరిగిన ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు టాకా రోడ్డు, చర్చిరోడ్డు వెడల్పు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. తాళ్లగడ్డ నుంచి హౌసింగ్‌బోర్డుకు నూతన రోడ్డు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సిబ్బంది, కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** టీ తాగటానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కోదాడలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలంలోని ద్వారకుంట గ్రామానికి చెందిన జక్కుల శివ (48) ప్రతిరోజు మాదిరిగానే ద్విచక్ర వాహనంపై కోదాడ పట్టణానికి టీ తాగేందుకు బయల్దేరాడు. ఈ క్రమంలో కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్దకు చేరుకున్న సమయంలో మేళ్లచెరువు వైపు నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఎదురుగా వస్తున్న శివ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. రహదారిపై వాహనాల వేగ నియంత్రణ లేకపోవడమే ఇటువంటి ప్రమాదాలకు కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా యోగ దినోత్సవ వారోత్సవాలు

ప్రజాపక్షం/మక్తల్ : అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం, డిసెంబర్ 21 నుండి ధ్యాన వారోత్సవాల్లో భాగంగా ఇవాళ మక్తల్ పట్టణంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలలో ధ్యాన దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్వై సాధకులు ఆచార్య ప్రకాష్, గురూజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం విశిష్టత , ప్రాముఖ్యత గురించి సవివరంగా వివరించారు. యోగా చేయడం వల్ల మనిషి ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండగలుగుతున్నారన్నారు. ప్రతి నిత్యం యోగా మనిషి జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల కలిగే ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రకాష్ గురూజీతో పాటు కళాశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి, ఎస్ఎస్వై యోగ సాధకులు, కట్ట సురేష్ కుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ఈనెల 26న సిపిఐ వంద సంవత్సరాల వేడుకలలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శనతో ర్యాలీ నిర్వహిస్తున్నామని నాగర్‌కర్నూల్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండుకూడలిలో జెండా ఆవిష్కరణ, కార్నర్‌మీటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని సిపిఐ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు , శ్రేయోభిలాషులు సానుభూతిపరులు అధికసంఖ్యలో పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గవర్నర్‌కు చిత్రపటాన్ని బహుకరించిన డిప్యూటీ తాహసీల్దార్ శివకుమార్



ప్రజాపక్షం/వీపనగండ్ల : వీపనగండ్ల మండలానికి చెందిన డిప్యూటీ తాసిల్దార్ శివకుమార్ తన స్వాహస్తాలతో రూపొందించిన చిత్రపటాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అందజేశారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఒక అధికారిక కార్యక్రమంలో ఈ ఘట్టం చోటుచేసుకుంది. చిత్రకళపై ప్రత్యేక ఆసక్తి కలిగిన శివకుమార్ అత్యంత శ్రద్ధతో, కళాత్మక నైపుణ్యంతో రూపొందించిన ఈ చిత్రపటాన్ని గవర్నర్‌కు సమర్పించగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలో ఉండి కూడా కళల పట్ల ఆసక్తిని కొనసాగించడం అభినందనీయమని గవర్నర్ శివకుమార్ ను ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఒక ప్రభుత్వాధికారి తన కళాత్మక ప్రతిభను గవర్నర్ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సూసైడ్ చేసుకోవడానికి వెళ్లిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన డయల్ 100 పోలీసులు



ప్రజాపక్షం/ మక్తల్ : మంగళవారం సాయంత్రం సమయంలో మంతన్గోడు గ్రామానికి చెందిన కళ్యాణ్ అనే వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి, అదే గ్రామానికి చెందిన అతని మిత్రుడు కతల్ అనే వ్యక్తి ఇంట్లో తండ్రి, అక్కతో గొడవ పడి సుసైడ్ చేసుకుంటాను అని చెప్పి సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం అందించారు. ఈ సమాచారంలో మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి ఆదేశాల మేరకు డయల్ 100 పీసీ అరుణ్ వెంటనే తక్షణ చర్యలు చేపట్టారు. కతల్ అనే వ్యకిత లొకేషన్‌ను ఐటీ సెల్ వారి సహకారం తో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రేస్ చేయగా, పతర్చేడు గ్రామ శి వారులో చెట్టు కింద ఉన్నట్లు గుర్తించి అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని సురక్షితంగా అదుపులోకి తీసుకొని, అతని కుటుంబ సభ్యులైన అక్కకు అప్పగించారు. ఈ సందర్భంగా కతల్ అక్క పోలీసుల సత్వర స్పందనకు, మానవత్వంతో వ్యవహరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డయల్ 100 కు వచ్చిన సమాచారంపై వేగంగా స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన మక్తల్ పోలీసుల చర్యలు అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

## గ్రామాభివృద్ధికి సేవకుడిగా పనిచేస్తా

ప్రజాపక్షం/అడ్డాకుల : మండల పరిధిలోని కందూరు గ్రామ సర్పంచిగా సేవ చేసే అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు ఒక సేవకుడిగా పనిచేస్తానని సర్పంచు బొయ రాధా రమేష్ అన్నారు. గ్రామ ప్రజల పెద్దలు, యువకులు , మహిళలు సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని కందూరు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాన్నికి అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. బుధవారం ఆయన ప్రజాపక్షం జాతీయ దినపత్రికతో మాట్లాడుతూ నా విజయానికి కృషి చేసిన కందూరు గ్రామ ప్రజలకు పెద్దలకు యువకులకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా శుభాభివందనాలు తెలుపుతున్నానని అన్నారు. గ్రామానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు పదవిలో ఉన్నంతకాలం వరకు గ్రామానికి ఒక సేవకుడిగా పనిచేస్తానని మీ అందరికీ దైవసాక్షిగా హామీ ఇస్తున్నామని సర్పంచు బోయ రాధా రమేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన లింగమ్మ



ప్రజాపక్షం/ నర్వ : మన పాతర్చేడు గ్రామంలో సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన మరుసటిరోజే లింగమ్మ మన్యం, బీరప్ప గుడి దగ్గర నుంచి ఎస్సీ వాడా వాటర్ ట్యాంక్ వరకు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు, ఆ బాటసారి వెళ్లే గ్రామస్తులకు ఇబ్బందికరంగా ఉన్న రోడ్డుకు ఇరువైపుల చెట్లను జెసిపి తో తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగమ్మ మన్యం, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లంకాల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోలు బండ వెంకటేష్ , ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎన్. వెంకటయ్య, గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వార్డ్ మెంబర్ గద్వాల కొండన్న, పోతురాజు వెంకటయ్య, నక్క ఎల్లప్ప, తెలుగు వెంకటేష్, బోయ పసుల నరసింహులు, ఎరుకలే సత్తన్న , కేసీ నరసింహులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ యొక్క పాఠశాల కు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ యొక్క రహదారి వెంబడి ఉన్న చెట్లను తొలగించడం జరిగింది.

## రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగింపు



ప్రజాపక్షం/ వీపనగండ్ల : గ్రామాలలో సర్పంచుల పాలన ప్రారంభం కావడంతో నూతనంగా ఎన్నికైన సర్పంచులు అభివృద్ధిపై దృష్టి సారించారు. మండల పరిధిలోని నాగర్ల బండ తండా రోడ్డు నుండి తూము కుంట క్రాస్ రోడ్డు వర కు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి వాహనదారులకు ఇ బ్బందులు కలిగించేవి. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో ప్ర మాదాలు చోటు చేసుకున్నాయి. వాహనదారులు, గ్రామస్తులు, పలుమార్లు అధికారు లు దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకపోవడంతో నాగర్ల బండ తం డకు కొత్త గా సర్పంచ్ అయిన గోపాల్ నాయక్ తూము కుంట క్రాస్ రొడ్డు నుండి నాగర్ల బండ తండా వరకు రోడ్డు రోడ్డుకు ఇరు వైపున ఉన్నా కంపచెట్లను జెసిబి తో తొలగింపు చర్యలను చేపట్టారు. దీంతో వాహనదారులు , గ్రామస్తులు హార్షం వ్యక్తం చేశారు.

## మహనీయులకు పూలమాలవేసిన సర్పంచ్

ప్రజాపక్షం/వంగూర్ : నూతన సర్పంచ్ ఎన్నికై మొదటిరోజు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళుతున్న స్థానిక సర్పంచ్ పురుగుల యాదయ్య బుధవారం మండలకేంద్రంలోని మహనీయులు జ్యోతిరావుపూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయానికి వెళ్లి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భాస్కర్, వార్డుమెంబర్లు, సిఐటియు మండలకార్యదర్శి శివరాములు, విశ్వకర్మసంఘం నాయకులు బుచ్చయ్యచారి, రవీంద్రచారి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రఫీ, కృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు.



# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### గ్రామాలలో అభివృద్ధిపనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి



ప్రజాపక్షం/కల్వకుర్తి : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని జీడిపల్లి, పంజుగుల, తుర్కలపల్లి గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుమెంబర్ ఠాకూర్ బాలాజి సింగ్ స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీడిపల్లి గ్రామంలో సర్పంచు కెంచ ఆంజనేయులు ఆధ్వర్యంలో జీడిపల్లి నుండి ఎల్లికట్ట గ్రామం వరకు రూ.2కోట్ల 80లక్షలతో బిటిరోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.5లక్షలతో ఎస్‌సి కమ్యూనిటి హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం యువజన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామసర్పంచ్ ఆంజనేయులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా పంజుగుల గ్రామంలో గ్రామ సర్పంచ్ పరుషరాములు, మాజీ జెడ్‌పిటిసి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పంజుగుల నుండి తర్నికల్ వరకు రూ.3కోట్ల 60లక్షలతో బిటిరోడ్డు, రూ.65లక్షలతో సిసిరోడ్డు, రూ.15లక్షలతో ఎస్‌సి సబ్‌ప్లాన్ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రూ.15లక్షలతో ప్రభుత్వ పాఠశాల పునర్ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా మరో 20లక్షలు ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. పనులు త్వరితగతిన చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మిని హెల్త్ సెంటర్‌కు రూ.5లక్షలు మంజూరు చేస్తానన్నారు. వాటర్‌ట్యాంకు మరమ్మతులకు రూ.2లక్షల నిధులు మంజూరు చేస్తానన్నారు. బిసి కమ్యూనిటిహాల్‌కు రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తానన్నారు. గ్రామంలో బస్సులు ఆపడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషిణితో చరవాణిలో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అనంతరం తుర్కలపల్లి గ్రామంలో గ్రామసర్పంచ్ వంగూరు లతాశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను, వివిధ అభివృద్ధి పనుల గురించి లతా శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి మాట్లాడుతూ తురకలపల్లి గ్రామంలో ఇటీవల దాదాపు రూ.70లక్షల రూపాయలతో సిసిరోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. బిసి కమిటీ హాలుకు రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల పర్యటనలో అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ తప్పిదం జరగకుండా గ్రామాల పర్యటనలో అధికారులు అందుబాటులో ఉండాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజిలు, సిసిరోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం తుర్కలపల్లి గ్రామంలో న్యాయవాది వెంకటరెడ్డి గ్రామపంచాయతీ లైటింగ్‌కు రూ.25వేల చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా గ్రామ సర్పంచ్ లతాశేఖర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమం లో తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపిడిఓ వెంకట్‌రాములు, పం చాయతీరాజ్ డిఇ బసవలింగం, ఆర్‌ఆడబ్ల్యూ డిఇ సంధ్యారాణి, మాజీ జడ్పిటిసి అశోక్‌రెడ్డి, ఎస్‌సి ఎస్‌టి మానిటరింగ్‌కమిటి సభ్యులు జిల్లెల రాములు, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షు లు విజయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ యువనాయకులు హరీష్‌రెడ్డి, జీడిపల్లి సర్పంచ్ కంచె ఆంజనేయులు, జీడిపల్లితండా సర్పంచ్ భీమ్లానాయక్, పంజుగుల సర్పంచ్ పరుషరాములు, తుర్కలపల్లి సర్పంచ్ లతాశేఖర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకుల గ్రామ పంచాయతీని తనిఖీ చేసిన డిపిఒ



ప్రజాపక్షం/అడ్డాకుల : మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయాన్ని ఆకస్మికంగా బుధవారం జిల్లా పంచాయితీ అధికారి డిపిఓ, డి. నిఖిల శ్రీ తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి పంచాయితీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం, నూతనంగా ఎన్నికైన సర్పంచు బొక్కలపల్లి దశరథ్‌రెడ్డి డిపిఓ డి.నిఖిల శ్రీ పూల బొక్కెన ఇచ్చి స్వాగతం పలికి ఆహ్వానించారు. పంచాయితీ పరిధిలోని జరుగుతున్న పారిశుద్ధ్య పనులు అభివృద్ధి చేయాలని సిబ్బందికి పలు సూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ విజయకుమార్, పంచాయితీ కార్యదర్శి సరస్వతి, గంగుల విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, షఫీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, వేగనాధ్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కీ సన్మానం



ప్రజాపక్షం/ నర్వ: నర్వ మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ హన్మంత్ రెడ్డి ని, ఉప సర్పంచ్ అజయ్, వార్డ్ మెంబెర్లను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సన్మానించారు. నర్వలో జరిగిన ఈ అభినందన సభలో మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## గచ్చుబావిని పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలోగల పురాతన శివాలయం కోనేరు గచ్చుబావివద్ద జరుగుతున్న మరమ్మత్తు పనులను బుధవారం రాత్రి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కోనేరువద్ద జరుగుతున్న పూడిక తీత పనులను వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పిసిబిమెంబర్ బాలాజిసింగ్, కమీషనర్ మహమూద్‌షేఖ్, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి మిరియాలశ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్‌డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, నాయకులు రామరాజు, సంతుయాదవ్, జంగయ్యగౌడ్, శేఖర్, భాస్కర్, వెంకటేష్ ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : కోయిల కొండ మండలంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. భూభారతి ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో నున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆమె ఆదేశించారు. మీ సేవ ద్వారా ప్రజలకు అందుతున్న సే వలు సక్రమంగా ఉన్నాయా, దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా జరుగుతున్నదా అనే అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన రైతు లు, విద్యార్థులు, ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యల ను తెలుసుకున్నారు. విద్యార్థులను కార్యాలయాలకు రప్పించవద్దని, అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆదాయం, కుల ధృవీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తుల పై వ చ్చిన ఫిర్యాదులను పరిష్కరించి అర్హులైన వారికి ధృవీకరణ ప త్రాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆమె స్పష్టం చేశారు. కార్యాలయాల పనితీరును మరింత మెరుగుపరచి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు మండల తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల బుకింగ్ యాప్ (యురియా) కొనుగోలు విధానం పంపిణీ పరిశీలిస్తున్న

ఎరువుల బుకింగ్ యాప్ (యూరియా) ద్వారా కొనుగోలు విధానం, పంపిణీని కోయిల్ కొండ మండలంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. బుధవారం కోయిల్ కొండ మండల కేంద్రంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ విధానం గురించి డీలర్ల, రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ ను కలెక్టర్ స్వయంగా పరిశీలించి రైతులకు యాప్ వినియోగాన్ని గురించి అవగాహన కలిగించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ మాట్లాడుతూ రైతులు వారి మొబైల్ నెంబర్ మార్పు చేసుకోవాలని, అనుకున్న రైతులు వారి క్లస్టర్ కి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర మార్చుకోగలరని ఆయన తెలిపారు. సమావేశంలో తహశీల్దార్, ఎం.పి.డి.ఓ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## చాయ్ దుకాణం ప్రారంభించిన మంత్రి

ప్రజాపక్షం/ మక్తల్: మక్తల్ పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో బుధవారం మంత్రి వాకిటి శ్రీహరి చాయి దుకాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంత్రిగా ప్రారంభించింది చిన్నదే అయిన దీనివలన ఒకరికి ఉపాధి కలుగుతున్నందుకు చాలా తృప్తిగా ఉందన్నారు. తనను నమ్ముకుని తన చేతి కింద పని చేసిన వారందరికీ ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతోనే ఎప్పుడు రద్దీగా ఉండే బస్టాండ్ ఏరియాలో నారాయణపేట ఆర్టీసీ డిఎంతో మాట్లాడి. బస్టాండ్ ముందు నెలవారి కిరాయి బేస్ మీద టీ కొట్టును సాగించేలా అధికారికంగా ఉత్తర్వులు తీసుకుని టీ కొట్టు ఏర్పాటు చేయడానికి ఆర్థిక సాయం చేశారు. రాజకీయంగా వెనుక తిప్పుకుని అవసరం అయిపోగానే గాలికి వదిలేసే ఈ రోజుల్లో మంత్రి మంచితనాన్ని జనాలు మెచ్చుకుంటున్నారు.



## నట్టల నివారణతో పశు ఆరోగ్యం : కలెక్టర్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలపరిధిలోని చిన్న ముద్దునూర్ గ్రామంలో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరై రైతులు, పశుపోషకులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచితంగా నిర్వహిస్తున్న ఈసామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రతిరైతు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నట్టలవల్ల పశువుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని, వాటికారణంగా రక్తహీనత, బరువుతగ్గడం, పాల ఉత్పత్తితగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు. రైతు ఆర్థికాభివృద్ధిలో పశు సంపద కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతు ఆదాయం పెరుగుతుందని, దాని ద్వారా కుటుంబ స్థాయిలోనే కాకుండా జిల్లాస్థాయిలో కూడా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈకార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేయడానికి మండలాలవారిగా 50 బృందాలుగా పశువైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈబృందాలు అన్ని గ్రామాల్లో తిరిగి గొర్రెలు, మేకలు సహా పశువులకు నట్టల మందులను తాగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జ్ఞానశేఖర్, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచ్, వార్డు సభ్యులకు మంత్రి జూపల్లి సన్మానం



ప్రజాపక్షం/వీపనగండ్ల : గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పాలనలో సర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు , విద్య, ఆరోగ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని తెలిపారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని మంత్రి అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శక పాలన అందించడమే ప్రజాసేవలో నిజమైన విజయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు జూపల్లి అరుణ్ కుమార్, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ మాఫియాకు అధికారిక అండదండలు!

- ఫిర్యాదుల వెనుక అధికార పార్టీ నేతల హస్తం
- నోటీసులు ఇప్పించ్చి.. సెటిల్‌మెంట్లకు దిగుతున్న వైనం
- రాయల్టీ వసూళ్లలో అధికారిక నిర్లక్ష్యం..ప్రభుత్వానికి తీరని నష్టం



ప్రజాపక్షం/రంగారెడ్డి: మైనింగ్ మాఫియాకు అధికారిక అండదండలు కొనసాగుతున్నాయి. తవ్వకాలపై మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయించడం, భారీ పెనాల్టీలతో నోటీసులు జారీ చేయించడం,ఆ తర్వాత వారితో సెటిల్‌మెంట్లు చేయిస్తుండటం వెనుక అధికార పార్టీకి చెందిన ఓ నేత హస్తం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తొలుత మైనింగ్‌శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి పోలీసు స్టేషన్లు, మండల రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేయించడం, వరుస తనిఖీల పేరుతో హడావుడీ చేయించడం, ఆ తర్వాత అక్రమ వసూళ్లకు పాల్పడటం పరిపాటిగా మారింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇందుకు సహకరించిన మైనింగ్, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు వాటాలు అందుతున్నాయి. రాజకీయ, అధికారిక అండదండలు పుష్కలంగా లభిస్తుండటంతో రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్,సరూర్‌నగర్,హయత్‌నగర్,ఇబ్రహీంపట్నం,మహేశ్వరం,గండిపేట,శంషాబాద్ మండలాల్లో మైనింగ్ మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోతోంది.కళ్లముందే ఖరీదైన ఖనిజం తరిగిపోతున్నా...పెద్ద మొత్తంలో రాయల్టీ ఎగ్గొట్టి, ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూర్చుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం సరిగ్గా పని చేస్తే తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వానికి సమకూరుతున్న ఆదాయం ఒక్క.. ఈ రంగారెడ్డి జిల్లా నుంచే పొందే అవకాశం లేకపోలేదని నిపుణులు స్పష్టీక రిస్తున్నారు.

### ప్రజల కళ్లల్లో మట్టికొట్టి.. రాయల్టీ ఎగ్గొట్టి...

నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఒఆర్‌ఆర్‌కు అటు ఇటుగా గెటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. గండిపేట్, మంచిరేవుల, కోకాపేట్, బుద్వేల్, నార్సింగి, ఎల్.బి నగర్, మన్సూరాబాద్, శంషాబాద్, వనస్థలిపురం, తుర్కయాంజాల్ కేంద్రంగా భారీగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి.సెల్లార్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ తవ్వకాల ద్వారా వచ్చిన మట్టిని రాయల్టీ చెల్లించకుండా బహిరంగ మార్కెట్లో టిప్పర్‌కు రూ.5000 చొప్పున విక్రయిస్తున్నారు. ఒక్కో గ్రానేట్‌ను సైజును బట్టి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. ఇక నిర్మాణాల్లో ఉపయోగించే రోబోశాండ్ టన్నుకు రూ.600 చొప్పున విక్రయిస్తు న్నారు. మైనింగ్ వ్యాపారులు నిర్మాణ ప్రదేశాల్లోనే క్రషర్లు ఏర్పాటు చేసి,ఎత్తైన గుట్టలు,సెల్లార్ తవ్వకాల్లో భాగంగా వచ్చిన రాళ్లను క్రషర్లలో వేసి డస్ట్‌గా మారుస్తున్నారు. కనీస చర్యలు చేప ట్టక పోవడంతో ధుమ్ము,ధూళి సమీప కాలనీలను ముంచేస్తోంది. కాలుష్యం కారణంగా స్థానికులు ఊపిరాడక అస్వస్థతకు గురవుతున్నారు. రాయల్టీ ఎగ్గొట్టి.. ప్రతి నెలా తమకు అడిగినంత మాముళ్లు ఇచ్చే వాళ్లకు రాచమర్యాదలు చేస్తూ..నిరాకరించిన వాళ్ల టిప్పర్లపై కేసులు నమోదు చేయిస్తున్నట్లు తెలిసింది.

### ఖరీదైన ఖనిజం కళ్లముందే తరిగి పోతున్నా...

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ రెవెన్యూ సర్వే నంబర్ 167/2లో ఓ నిర్మాణ సంస్థ భారీగా తవ్వకాలు చేపట్టి.. ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎంఎస్ తవ్వకాలపై గతంలో రూ.9.5 కోట్లకుపైగా ఫైన్ వేశారు. సరూర్‌నగర్ మండలం మన్సూరాబాద్ సర్వే నంబర్ 38లో ఓ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఏడు ఎకరాల విస్తర్ణంలో భారీ సెల్లార్ తవ్వుతోంది. తీసుకున్న అనుమతులకు మించి తవ్వకాలు చేప ట్టినట్లు తేలింది. గతంలో సెల్లార్ తవ్వతుండగా,మట్టి కూలి నలుగురు కూలీలు మృతి చెందిన ప్రదేశంలోనూ యథావిధిగా తవ్వకాలు మొదలయయి. ఈ అక్రమ తవ్వకాల వెనుక పెద్దల హస్తం ఉన్నట్లు తెలిసింది. శ్రీనగర్ రెవెన్యూ సర్వే నంబర్ 185,188,189లోనూ ఓ మైనింగ్ ఏజెన్సీ,అనుమతులకు భిన్నంగా తవ్వకాలు చేపట్టి,భారీగా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు ధృవీకరించారు.తవ్వకాలను ఆపాలంటూ రెవెన్యూ,పోలీసు,మున్సిపల్ అధికారులకు లేఖ రాసినా తవ్వకాలు ఆగకపోగా,యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. తట్టి అన్నారం సర్వే నంబర్ 121, పీలోనూ భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. తీసుకున్న అనుమతులకు మించి తవ్వకాలు చేపట్టినట్లు తేలింది. రూ.3.39 కోట్ల పెనాల్టీ విధించారు. కానీ ఒక్క పైసా కూడా వసూలు చేయలేదు. తాజాగా మన్సూరాబాద్,హయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోనూ అక్రమ సెల్లార్లను గుర్తించి,షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంగం హోటల్ ఎదురుగా కృపా కాలనీలోనూ సెల్లార్ త వ్వ కాల ద్వారా వచ్చిన మట్టిని రాయల్టీ చెల్లించకుండా బయటికి అమ్ముతున్నట్లు గుర్తించి, నోటీ సులు జారీ చేశారు.అడ్డగోలు తవ్వకాలు,మైనింగ్ అమ్మకాలపై ఎవరైనా స్థానికులు ఫిర్యాదు చేసినప్పుడు తనిఖీల కు వెళ్లడం,షోకాజ్ నోటీసులు జారీ చేయడం మినహా అడ్డుకున్న దాఖలాలు లేవు.కానీ పైసా కూడా వసూలు చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అంతు చిక్కడం లేదు.ఇట్టి విషయంపై పలువురు,పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.

# క్రీడ

# వైభవ్ 'వీర'బాదుడు!

## 574 పరుగులతో అరుణాచల్ ప్రదేశ్‌పై భారీ విజయం



వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో రాంచీ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో బిహార్ తరఫున సూపర్ సెంచరీతో చెలరేగిపోయాడు. కేవలం 36 బంతుల్లోనే శతకం బాది రికార్డ్ సృష్టించాడు. క్రీజులో ఉన్నంత వరకు సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ప్రత్యర్థి బౌలర్లకు ముచ్చెమటలు పట్టించాడు. వైభవ్ వీరబాదుడుతో 30 ఓవర్లు ముగిసే సమయానికి బిహార్ జట్టు 2 వికెట్లు కోల్పోయి 282 పరుగులు చేసింది. తృటిలో డబుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు.

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా బుధవారం బిహార్, అరుణాచల్ ప్రదేశ్ రాంచీ వేదికగా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో బిహార్ 397 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన బిహార్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుని, నిర్ణీత 50 ఓవర్లలో రికార్డు స్థాయిలో 6 వికెట్ల నష్టానికి 574 పరుగులు చేసింది. ఇది విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలోనే అత్యధిక స్కోర్. ఇంతకుముందు ఆ రికార్డ్ తమిళనాడు పేరిట ఉంది. ఆ జట్టు 21 నవంబర్ 2022లో అరుణాచల్ ప్రదేశ్ మీద నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 506 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ రికార్డ్‌ను బిహార్ బ్రేక్ చేసింది. రెండు సందర్భాల్లోనూ ప్రత్యర్థి జట్టు అరుణాచల్‌ప్రదేశ్ కావడం గమనార్హం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 42.1 ఓవర్లలో 177 పరుగులకు కుప్పకూలింది. బిహార్ బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ (190; 84 బంతుల్లో, 16 ఫోర్లు, 15 సిక్స్‌లు), ఆయుష్ లోహరుక (116, 56 బంతుల్లో, 11 ఫోర్లు, 8 సిక్స్‌లు), సకిబుల్‌గని (128*;40 బంతుల్లో, 10 ఫోర్లు, 12 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగిపోయారు. పీయూష్ సింగ్ (77; 66 పరుగులు, 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ సాధించాడు. దీంతో బిహార్ జట్టు భారీ స్కోర్ చేయగలిగింది. బిహార్ బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ 36 బంతుల్లో సెంచరీ చేస్తే, సకిబుల్‌గని 32 బంతుల్లోనే శతకం బాదాడు. అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లలో తడకమల్ల మోహిత్, టెక్కీ నేరి తలో రెండు, ధీరజ్ ఒక వికెట్ తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ బ్యాటర్లు విఫలమయ్యారు. కామ్షా యాంగ్ఫో (32) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. బిహార్ బౌలర్లలో ఆకాశ్ రాజ్, సూరజ్ కశ్యప్ తలో 3, హిమాన్షు తివారీ 2, సబీర్ ఖాన్ 1 వికెట్ తీసుకున్నారు.

### ఏబీ డివిలియర్స్ రికార్డ్ బ్రేక్..

దక్షిణాఫ్రికా బ్యాటర్ ఏబీ డివిలియర్స్ వెస్టిండీస్‌పై 2015లో 64 బంతుల్లో 150 పరుగులు చేశాడు. వైభవ్ సూర్యవంశీ తాజాగా లిస్ట్ ఏ క్రికెట్‌లో కేవలం 59 బంతుల్లోనే 150 పరుగులు చేసి, డివిలియర్స్ ప్రపంచ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. అలాగే లిస్ట్ ఏ క్రికెట్‌లో అత్యంత పిన్న వయసులో (14 సంవత్సరాల 272 రోజులు) సెంచరీ చేసిన బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు.

### ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ..

అహ్మదాబాద్ వేదికగా కర్ణాటకతో జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ తరఫున బరిలోకి దిగిన ఇషాన్ కిషన్ 33 బంతుల్లో సెంచరీ సాధించాడు. అతడు చివరికి 39 బంతుల్లో 125 పరుగులు సాధించి పెవిలియన్‌కు చేరాడు. ఇందులో 7 ఫోర్లు, 14 సిక్స్‌లు ఉన్నాయి. జార్ఖండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 412 పరుగులు చేసింది. కర్ణాటకకు 413 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.



# కోహ్లీ శతకం

## 4 వికెట్ల తేడాతో ఢిల్లీ విజయం

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా బెంగళూరు వేదికగా ఢిల్లీ, ఆంధ్ర జట్లు తలపడ్డాయి. ఢిల్లీ తరఫున బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ 83 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీ జట్టు 37.4 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 300 పరుగులు చేసింది. దీంతో ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 4 వికెట్ల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. విరాట్ కోహ్లీ (131; 101 బంతుల్లో, 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ శతకం సాధించాడు. నితీశ్ రాణా (77; 55 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రియాంశ్ ఆర్య (74; 44 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. అర్పిత్ రాణా (0), రిషభ్‌పంత్ (5), ఆయుష్ బదోని (1) నిరాశపరిచారు. హర్ష్ త్యాగి (4*), నవదీప్ సైనీ (5*) నాటౌట్‌గా నిలిచారు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు, హేమంత్ రెడ్డి చెరో రెండు, నితీశ్ కుమార్ రెడ్డి, కె.ఎస్.నరసింహ రాజు తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు ఆంధ్ర బ్యాటర్లలో రికీ భుయ్ సెంచరీతో (122; 105 బంతుల్లో, 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. షేక్ రషీద్ (31), నితీశ్ కుమార్ రెడ్డి (23), హేమంత్ రెడ్డి (27), సింగుపురం ప్రసాద్ (28) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లలో సిమర్జీత్ సింగ్ 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీసుకున్నాడు. ముంబయి, సిక్కిం మధ్య జైపూర్ వేదికగా జరిగిన మరో మ్యాచ్‌లో రోహిత్ శర్మ సెంచరీతో అలరించాడు. ఓ వైపు విరాట్, మరో వైపు రోహిత్ శతకాలు బాదడంతో రోకో అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

# రోహిత్ భారీ సెంచరీ..



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపూర్ వేదికగా ముంబయి, సిక్కిం తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబయి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిక్కిం నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ముంబయి 30.3 ఓవర్లలోనే 2 వికెట్లు నష్టపోయి 237 పరుగులు చేసింది. రోహిత్ శర్మ 62 బంతుల్లో సెంచరీ చేశాడు. చివరకు 155 (94 బంతుల్లో, 18 ఫోర్లు, 9 సిక్స్‌లు) పరుగులకు పెవిలియన్‌కు చేరాడు. లిస్ట్ ఎ క్రికెట్‌లో వన్డేల్లో రోహిత్ శర్మకు అత్యంత వేగవంతమైన సెంచరీ. అంతకు ముందు 2023లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో బంగ్లాదేశ్ మీద 63 బంతుల్లో శతకం బాదాడు. అంగ్క్రిష్ రఘువంశీ (38; 58 బంతుల్లో, 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ముషీర్ ఖాన్ (27*), సర్ఫరాజ్ ఖాన్ (8*) నాటౌట్‌గా నిలిచారు. సిక్కిం బౌలర్లలో అంకుర్ మాలిక్, క్రాంతి కుమార్ చెరో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు సిక్కిం బ్యాటర్లలో అశిష్ (79; 87 బంతుల్లో, 8 ఫోర్లు) రాణించాడు. కె.సాయి సాత్విక్ (34), క్రాంతి కుమార్ (34), రాబిన్ లింబో (31*) ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముంబయి బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 2, తుషార్ దేశ్‌పాండే, తనుష్ కోటియాన్, షామ్స్ ములానీ, ముషీర్ ఖాన్ తలో వికెట్ తీసుకున్నారు.

ఫోకస్ చరిత్ర



## మార్పులు.. అనుభవాల సమ్మేళనం

# శ్లావిక్ సంస్కృతి

యూరప్ తూర్పు ప్రాంతాల నుంచి మధ్య యూరప్ వరకు విస్తరించిన శ్లావిక్ ప్రపంచం, అనేక శతాబ్దాల చరిత్ర, భాషా గోత్రాలు, రాజకీయ మార్పులు, సామాజిక అనుభవాల సమ్మేళనంగా రూపుదిద్దుకుంది. రష్యా నుంచి బాల్కన్ ద్వీపకల్పం వరకు వ్యాపించిన శ్లావిక్ ప్రజలు ఈస్ట్, వెస్ట్ మరియు సౌత్ శ్లావ్స్ అనే మూడు ప్రధాన విభాగాలుగా విభజించబడినప్పటికీ, వారందరినీ కలిపే ఒక లోతైన సాంస్కృతిక ఆత్మ స్పష్టంగా కనిపిస్తుంది. పురాణాలు, భాషలు, కృషి ఆధారిత జీవితం, యుద్ధాలు, వలసలు, ప్రతిఘటనలు అన్నీ కలిసి శ్లావిక్ సంస్కృతిని ఒక సమగ్ర చారిత్రక ప్రవాహంగా నిలబెట్టాయి. శ్లావిక్ సంస్కృతికి మూలాలు ప్రాచీన యూరప్ మధ్య–తూర్పు ప్రాంతాల్లో ఉన్నాయి. క్రీ.శ. తొలి శతాబ్దాల నుంచే బాల్టిక్ అడవులు, కార్పెథియన్ కొండలు, నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించిన శ్లావిక్ తెగలు ప్రకృతితో సన్నిహితంగా జీవించాయి. పెద్ద నగర నాగరికతల కంటే సమూహ జీవితం, కుటుంబ వ్యవస్థ, పరస్పర రక్షణ, వ్యవసాయం మరియు పశుపోషణ వీరి బలంగా నిలిచాయి. సంపదకన్నా సమాజానికి ప్రాధాన్యం ఇచ్చిన ఈ జీవన విధానం శ్లావిక్ విలువలకు పునాది వేసింది. శ్లావిక్ సంస్కృతిని ఏకతాటిపై నిలిపిన ప్రధాన అంశం భాష. ఇండో–యూరోపియన్ కుటుంబానికి చెందిన శ్లావిక్ భాషలు ఒకే ప్రోటో–శ్లావిక్ మూలం నుంచి పుట్టి కాలక్రమంలో విభిన్న శాఖలుగా వికసించాయి. ఈస్ట్ శ్లావిక్ భాషలు కీవన్ రస్ సంప్రదాయాల ప్రభావంతో ఆర్థోడాక్స్ ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తే, వెస్ట్ శ్లావిక్ భాషలు జర్మానిక్ ప్రభావంతో అభివృద్ధి చెందాయి. సౌత్ శ్లావిక్ భాషల్లో బాల్కన్ ప్రాంతాల గ్రీకు, టర్కీ సాంస్కృతిక ప్రభావాలు మిళితమయ్యాయి. అయినా, విభక్తి వ్యవస్థ, ధ్వన్యాత్మక స్పష్టత, భావవ్యక్తీకరణలో గాఢత వంటి లక్షణాలు అన్ని శ్లావిక్ భాషలను ఒకే సాంస్కృతిక కుటుంబంగా నిలిపాయి. క్రైస్తవీకరణకు ముందు శ్లావిక్ ప్రపంచం ప్రకృతి ఆరాధన, దేవతలు, జానపద విశ్వాసాలతో నిండినది. అడవులు, నదులు, అగ్ని, గాలి వంటి ప్రకృతి శక్తులకు ఆత్మ ఉందన్న విశ్వాసం వారి పురాణాల్లో కనిపిస్తుంది. వజ్రదేవుడు పెరున్, అడవి మరియు పాతాళ దేవుడు వెలెస్, మరణానికి ప్రతీక అయిన మోరెనా వంటి దేవతలు శ్లావిక్ పురాణాల కేంద్రబిందువులు.

> శ్లావిక్ సాహిత్యం మానవ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. రష్యన్ రచయితలు మానవ ఆత్మలోని సంఘర్షణలను లోతుగా విశ్లేషించగా, పోలిష్ రచయితలు జాతీయత మరియు స్వేచ్ఛ భావాలను ప్రతిబింబించారు. బాల్కన్ సాహిత్యం యుద్ధాలు, మత వైవిధ్యాలు, విభజనల బాధను వ్యక్తం చేసింది. మొత్తం శ్లావిక్ సాహిత్యం మానవ బాధ, న్యాయం, విశ్వాసం, ప్రతిఘటన వంటి శాశ్వత అంశాలను స్పృశించింది.

ఇంటిని కాపాడే డొమోవోయ్ వంటి విశ్వాసాలు గృహ సంస్కృతిలో లోతుగా నాటుకుపోయాయి. ఈ పురాణాలు జీవితం–మరణం, ఋతు చక్రాలు, పునర్జన్మ వంటి భావాలను శ్లావిక్ ప్రజల ఆలోచనల్లో స్థిరపరిచాయి. 9 నుంచి 11వ శతాబ్దాల మధ్య క్రైస్తవ ధర్మం శ్లావిక్ ప్రపంచంలో ప్రవేశించింది. తూర్పు ప్రాంతాల్లో బైజాంటైన్ ప్రభావంతో ఆర్థోడాక్స్ సంప్రదాయాలు బలపడగా, పశ్చిమ ప్రాంతాల్లో రోమన్‌కాథలిక్ సంప్రదాయం స్థిరపడింది. అయితే ఈ మార్పు పాత పురాణాలను పూర్తిగా నిర్మూలించలేదు. పాత ఆచారాలు, ఋతుపండుగలు, వసంతోత్సవాలు క్రైస్తవ సంప్రదాయాల్లో కలిసిపోయాయి. ఈ విధంగా శ్లావిక్ సంస్కృతి మార్పును స్వీకరిస్తూనే తన మూలాలను కాపాడుకుంది. మధ్యయుగ కాలంలో కీవన్ రస్, పోలాండ్, బోహేమియా, సెర్బియా వంటి శ్లావిక్ రాజ్యాలు ఆవిర్భవించాయి. నదీ మార్గాల వాణిజ్యం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ, గోత్ర ఆధారిత సామాజిక నిర్మాణం ఈ రాజ్యాల ఎదుగుదలకు దోహదపడ్డాయి. ముఖ్యంగా కీవన్ రస్ రాజ్యం చట్టాలు, కళలు, వాణిజ్య సంబంధాల ద్వారా శ్లావిక్ నాగరికతకు బలమైన పునాది వేసింది. కళలు, సంగీతం, నృత్యాలు శ్లావిక్ జీవనానికి అద్దం పట్టాయి. సామూహిక వలయ నృత్యాలు సామాజిక సంఘీభావానికి ప్రతీకలుగా నిలిచాయి. లోకగీతాలు రైతు జీవితం, ప్రకృతి, ప్రేమ, పోరాటాలను ప్రతిబింబించాయి. బల్గేరియన్ అసిమెట్రిక్ రిథమ్స్, రష్యన్ బలాలైకా, పోలిష్ మజుర్కా వంటి సంగీత రూపాలు శ్లావిక్ సాంస్కృతిక వైవిధ్యాన్ని వెల్లడించాయి. తూర్పు శ్లావిక్ ప్రాంతాల్లో ఐకానో చిత్రకళ ఆధ్యాత్మిక లోతును ప్రతిబింబించింది. శ్లావిక్ సంస్కృతి ఒకే దేశానికి లేదా ఒకే కాలానికి పరిమితం కాని విస్తృత చారిత్రక అనుభవం. పురాణాలు, మత మార్పులు, యుద్ధాలు, వలసలు, ప్రతిఘటనలు అన్నీ కలిసి ఈ సంస్కృతిని ఒక శాశ్వత సామాజిక ఆత్మగా నిలబెట్టాయి. యూరప్ చరిత్రలో శ్లావిక్ సంస్కృతి ఒక నిరంతర పోరాటం, పునరావృత పునర్నిర్మాణం, మానవ గౌరవానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది.

> చరిత్రపరంగా శ్లావిక్ ప్రజలు వలసలు, ఆక్రమణలు, ప్రపంచ యుద్ధాలు, రాజకీయ విప్లవాలను ఎదుర్కొన్నారు. ఈ అనుభవాలు వారి సంస్కృతిని విచ్ఛిన్నం చేయలేదు.. బదులుగా పునర్నిర్మాణ సామర్థ్యాన్ని పెంపొందించాయి. ఆహార సంస్కృతిలోనూ వ్యవసాయ ఆధారిత జీవనశైలి, చల్లని వాతావరణానికి అనుకూలమైన వంటకాలు శ్లావిక్ గుర్తింపులో భాగమయ్యాయి. ఆధునిక కాలంలో గ్లోబలైజేషన్, జాతీయ రాజకీయాలు, వలసల ప్రభావం శ్లావిక్ ప్రపంచాన్ని సవాళ్లకు గురిచేస్తున్నాయి. అయినప్పటికీ, భాష, పండుగలు, సంగీతం, సాహిత్యం ద్వారా తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ శ్లావిక్ దేశాలు ఆధునిక ప్రపంచంలో తమ స్థానాన్ని నిర్మించుకుంటున్నాయి.




# 2025 పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సిపిఐ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు

## సర్పంచ్‌లు

| జిల్లా | | మండలం | గ్రామం | సర్పంచ్ |
|---|---|---|---|---|
| భద్రాద్రికొత్తగూడెం | 1 | పాల్వంచ | రేగులగూడెం | కుర్సం రాములు |
| | 2 | | మందెరకలపాడు | బానోతు లక్ష్మి |
| | 3 | | కారేగట్టు | పట్టం బాబురావు |
| | 4 | | పునుకుల | వజ్జా కృష్ణవేణి |
| | 5 | | ప్రభాత్‌నగర్ | బోజన్ నిషారాణి |
| | 6 | | లక్ష్మిదేవిపల్లి | భూక్యా మంజుల |
| | 7 | | నాగారం కాలనీ | తేజావత్ వినోద్‌కుమార్ |
| | 8 | | రంగాపురం | మాలోత్ అనీషా |
| | 9 | | దంతెలబోర ఎస్‌సి | సోదె వెంకటరమణ |
| | 10 | | బిక్కుతండ | భూక్యా ఝాన్సీ |
| | 11 | | సంగెం | బానోత్ రవి |
| | 12 | | తవిసెలగూడెం | జి.రమేష్ |
| | 13 | | ఇల్లందులపాడుతండ | తేజావత్ లక్ష్మి |
| | 14 | | సోములగూడెం | కేలోతు సునిత |
| | 15 | | కోడిపుంజులవాగు | అజ్మీర మహేశ్వరి |
| | 16 | | సత్యనారాయణపురం | జర్పుల సంధ్య |
| | 17 | చుంచుపల్లి | 4 ఇంక్లైన్ | అజ్మీరా సింధు |
| | 18 | | బాబుక్యాంప్ | సూనావత్ కుమారి |
| | 19 | | గౌతంపుర్ | సపావత్ కళ్యాణి |
| | 20 | | పెనుబల్లి | రెడ్డి సుజాత |
| | 21 | | పెనుగడప | కారం సీతారాములు |
| | 22 | | రామాజంనేయకాలనీ | సరిత ఠాగూర్ |
| | 23 | | ప్రశాంతినగర్ | వాడే రాములు |
| | 24 | | విద్యానగర్ | భుక్యా శాంతిశ్రీ |
| | 25 | లక్ష్మిదేవపల్లి | అనిట్టి | కొర్స వీరబాబు |
| | 26 | | బంగారుచెలక | మలకం ఉమామహేశ్వరి |
| | 27 | | చాతకొండ రూరల్ | వజ్జ ఈశ్వరమ్మ |
| | 28 | | హేమచంద్రాపురం | కంగల అంజలి |
| | 29 | | లాలుతండ | నూనావత్ హతిరామ్ |
| | 30 | | లక్ష్మిపురం | బాడిష మౌనిక |
| | 31 | | మైలవరం | తాటి లక్ష్మణ్ |
| | 32 | | పునుకూడుచెలక | పగిడ రాంబాబు |
| | 33 | | అశోక్‌నగర్ | జర్పుల దేవి |
| | 34 | | హమాలి కాలనీ | గుగులోత్ ప్రేమ్‌చంద్ |
| | 35 | | లోతువాగు | ఈసం కళ్యాణి |
| | 36 | | సీతారాంపురం | గుగులోత్ బీబు |
| | 37 | | శేషిగిరినగర్ | కృప రేచల్ |
| | 38 | | హరియాతండా | నూనావత్ అరుణ |
| | 39 | సుజాతనగర్ | ఇన్‌క్లేవ్2 | అరుణ |
| | 40 | | సీతంపేట | గరికె ఉపేందర్ |
| | 41 | | కోయకొండగూడెం | మాలోతు రామనాథం |
| | 42 | దుమ్ముగూడెం | నర్సాపురం | కుంజ కంకరత్నం |
| | 43 | | పెద్దఅర్లగూడెం | పాయం వెంకటేశ్వర్లు |
| | 44 | | బి.కొత్తగూడెం | కుంజ ప్రమీల |
| | 45 | | తూరుబాక | అజ్మీర శైలజ |
| | 46 | ఆళ్ళపల్లి | వెంకటాపురం | వజ్జ ఉమ |
| | 47 | చర్ల | కర్నపల్లి | శ్యామల తరుపతి రావు |
| | 48 | | తిప్పాపురం | సూప సునీత |
| | 49 | మణుగూరు | రామానుజపురం | బాడిశ కల్పన |
| | 50 | | సాంబాయిగూడెం | సిదెం ఉషారాణి |
| | 51 | చంద్రుగొండ | సీతాయిగూడెం | పిట్టల రామలక్ష్మయ్య |
| ఖమ్మం | 52 | చింతకాని | చిన్నమండవ | పర్సా రామచంద్రారావు |
| | 53 | | నేరడ | దూసరి నేతాజి |
| | 54 | | బస్వాపురం | ఆవుల నరసింహారావు |
| | 55 | | నాగిలిగొండ | ఏపూరి పద్మ |
| | 56 | | రాఘవాపురం | కాంపల్లి కోటమ్మ |
| | 57 | ఖమ్మం రూరల్ | పడమటితండ | బోడ బీమానాయక్ |
| | 58 | | పల్లెగూడెం | చుంచిరి సృజన |
| | 59 | | దారెడు | బత్తుల వెంకటేశ్వర్లు |
| | 60 | | గూడూరుపాడు | పుచ్చకాలయ శ్రీదేవి |
| | 61 | కామేపల్లి | ఊటుకూరు | ఈసం హనుమంతారావు |
| | 62 | సింగరేణి | బాజుమల్లాయిగూడెం | కోరం కోటమ్మ |
| | 63 | కొణిజర్ల | తనికెళ్ళ | గడల కళావతి |
| యాదాద్రి | 64 | యాదగిరిగుట్ట | మర్రిగూడెం | స్వప్న |
| | 65 | | ధర్మారెడ్డిగూడెం | కొల్లూరి రాజయ్య |
| | 66 | నారాయణపురం | మహ్మదాబాద్ | ముత్యాల అంజయ్య |
| | 67 | | కోతులాపురం | కె. వినోద శ్రీనివాస్ |
| | 68 | వలిగొండ | దుప్పల్లి | జావిద్ |
| నల్లగొండ | 69 | చండురు | కస్తాల | లేదన్న సత్యనారాయణ |
| | 70 | మునుగోడు | చలిమేడ | యాదయ్య |
| | 71 | నార్కట్‌పల్లి | పల్లెపహాడ్ | సంగిశెట్టి రాణమ్మ |
| | 72 | డిండి | రహమంతాపుర్ | పి. రాములమ్మ |
| | 73 | | ఖాన్‌పూర్ | టిప్రతిమావిజయేందర్ రెడ్డి |
| | 74 | | శేషాయికుంట | వరికుప్పల స్వప్న |
| | 75 | దేవరకొండ | ఫతులావత్‌తండ | పట్లావత్ భారతీ ధర్మ |
| | 76 | మర్రిగూడెం | కొట్టాల | లింగయ్య |
| | 77 | చందంపేట | గన్నేర్లపల్లి | మంగ్లీ |
| సూర్యాపేట | 78 | గరిడేపల్లి | రంగాపురం | కళ్యాణ |
| | 79 | | కానుగుబండ | పద్మ |
| | 80 | అనంతగిరి | శాంతినగర్ | వడకొప్పల ఉమాలింగయ్య |
| | 81 | చిలుకూరు | నారాయణపురం | మండవ జయమ్మ |
| | 82 | | జేరిపోతులగూడెం | గుగులోత్ లలిత |
| | 83 | కోదాడ | అల్వాలపురం | పి.సత్యనారాయణ |
| నారాయణపేట | 84 | నర్వ | రాంపూర్ | నాగరాజు |
| సిద్దిపేట | 85 | అక్కన్నపేట | అంతకపేట | కె. సృజన్‌కుమార్ |
| నిర్మల్ | 86 | బైంసా | గుండేగావ్ | రాష్ట్రపాల్ |
| | 87 | పెంబి | నాగపూర్ | బోసు వెంకటరాములు |
| హన్మకొండ | 88 | ఎల్కతుర్తి | గోపాల్‌పూర్ | కర్రె లక్ష్మీ |
| నాగర్‌కర్నూల్ | 89 | తాడూరు | గుంతకోడూరు | వర్ల వెంకటయ్య |
| రంగారెడ్డి | 90 | ఫరూక్‌నగర్ | దేవునిబండ | ఎం. శ్రీను |
| గద్వాల | 91 | మల్దెకల్ | మద్దెల బండ | తిమ్మప్ప |

## సిపిఐ నుండి గెలిచిన ఉపసర్పంచ్‌లు

| జిల్లా | మండలం | గ్రామం | | ఉపసర్పంచ్ |
|---|---|---|---|---|
| భ.కొత్తగూడెం | చుంచుపల్లి | విద్యానగర్ | 1 | వాసిరెడ్డి మురళి |
| | | పెనుబల్లి | 2 | చేతుల రాణి |
| | | రుద్రాంపూర్ | 3 | తోట రాజు |
| | | గౌతంపూర్ | 4 | గంగారాం |
| | | బాబు క్యాంప్ | 5 | పోలమూరి శ్రీనివాస్ |
| | | రామాజంనేయకాలనీ | 6 | కోడూరి నాగేష్ |
| | | ప్రశాంతినగర్ | 7 | ఇరిగినేని స్వప్న ప్రియ |
| | | 3వ ఇంక్లైన్ | 8 | పల్తి లక్ష్మి |
| | | 4వ ఇంక్లైన్ | 9 | గుత్తుల రాజేశ్ |
| | | వెంకటేశ్‌ఖని | 10 | చొప్పరి గాయత్రి |
| | లక్ష్మిదేవిపల్లి | కారుకొండ | 11 | కల్లెం వెంకట రాణమ్మ |
| | | హేమచంద్రాపురం | 12 | మౌలా బాలకృష్ణ |
| | | మెలారం | 13 | బనోత్ భద్య |
| | | పునుకుడుచెలక | 14 | ఇట్టి ఈశ్వర్ |
| | | బంగారు చెలక | 15 | పడిగె సమ్మక |
| | | లక్ష్మీపురం | 16 | సోయం ప్రశాంత్ |
| | | హమాలికాలనీ | 17 | కొనెట్టి రాజు |
| | | చాతకొండ | 18 | మండ గ్యాబ్రిల్ |
| | | అనిశెట్టిపల్లి | 19 | ఇ. వెంకటనర్సయ్య |
| | | శేషగిరి నగర్ | 20 | సిద్ధారపు రామిరెడ్డి |
| | | లోతువాగు | 21 | యాకుబ్‌పాషా (బడే) |
| | | అశోక్‌నగర్ కాలనీ | 22 | సిహెచ్ పద్మ |
| | పాల్వంచ | నాగారం | 23 | బానోత్ రంజిత్ |
| | | రంగాపురం | 24 | తేజావత్ ప్రసాద్ |
| | | నగరం కాలనీ | 25 | భూక్య అశోక్‌కుమార్ |
| | | తొగ్గుగూడెం | 26 | జార్పుల రాంబాబు |
| | | బుక్కుతండ | 27 | భూక్య రమేష్ |
| | | ఎల్లందులపాడుతాండ | 28 | గుగులోతు బిందు |
| | | కోడిపుంజులవాగు | 29 | జటోత్ శిల్ప |
| | | కర్రె గట్టు | 30 | వాసం యాదగిరి |
| | | మందెరాకులపాడు | 31 | కందుకూరి శ్రీను |
| | సుజాతనగర్ | సింగభూపాలెం | 32 | గోరెంట్ల ధర్మ |
| | | సీతంపేట బంజార్ | 33 | భూక్య సాలి |
| | | కొయ్యగూడెం | 34 | బనోత్ సాయికుమార్ |
| | | 2 ఇంక్లైన్ | 35 | సింగిరాల వెంకటేశ్ |
| | | సర్వారం | 36 | భూక్య సాలి |
| | దుమ్ముగూడెం | బి.కొత్తగూడెం | 37 | కాటిబోయిన లక్ష్మయ్య |
| | | నర్సాపురం | 38 | రావులపల్లి రవి కుమార్ |
| | | అలగూడెం | 39 | తాటి నాగేశ్వరరావు |
| | | కొత్తదంతెన | 40 | బొమ్మెర అనితాదేవి |
| | | చిన్న కమలాపురం | 41 | ఉబ్బ సత్యం |
| | | నడికుడి | 42 | కొమరం రంజిత |
| | చర్ల | తిప్పాపురం | 43 | కల్లూరి సీతారాములు |
| | | కుర్నపల్లి | 44 | మడవి శ్రీను |
| | మణుగూరు | సాయిబాయిగూడెం | 45 | పులిగాల రమేష్ |
| | | రామాంజరాము | 46 | కోడాలి రాణి |
| | చంద్రుగొండ | సీతయ్యగూడెం | 47 | సర్వేష్ |
| | ఎల్లందు | తిలక్‌నగర్ | 48 | ఎస్.కె.ఖాశీం |
| | జూలూరుపాడు | గుండెపుడి | 49 | తుమ్ముకోటయ్య |
| | ఆళ్ళపల్లి | వెంకటాపురం | 50 | కొమరం రాజేశ్ |
| | ములకలపల్లి | ములకలపల్లి | 51 | పువ్వాల లలితారావు |
| | | మూకమామిడి | 52 | కురసం సీతమ్మ |
| ఖమ్మం | చింతకాని | రాఘవపురం | 53 | అబ్బురి మహేష్ |
| | | వందనం | 54 | అమర్లపుడి శ్రీనివాస్ |
| | | కోమట్లగూడెం | 55 | ఆవులూరి రామిరెడ్డి |
| | | చిన్నమండవ | 56 | తంగిరాల మాధవి |
| | | బస్వాపురం | 57 | చంద్రకాని నర్సింహ్మారావు |
| | రఘునాథపాలెం | వి.వెంకటాయపాలెం | 58 | గుగ్గులోతు ప్రవీణ్ |
| | | చిమ్మపుడి | 59 | జుల వెంకటేశ్వర్లు |
| | కొణిజర్ల | పెద్దమునుగాల | 60 | సుంకర రాధాకృష్ణ |
| | | చిన్నగోపతి | 61 | తమ్మశెట్టి విజయలక్ష్మి |
| | సింగరేణి | బాజుమల్లాయిగూడెం | 62 | పోతురాజు ఉపేంద్ర |
| | నేలకొండపల్లి | బిరనపాడు | 63 | ఆలేటి మహేష్ |
| | ఖమ్మం రూరల్ | గూడురుపాడు | 64 | భట్టు సుభద్ర |
| | | ఆరుకోడు | 65 | ఆరెంపుల కొరవి వీరన్న |
| | బోనకల్ | బ్రాహ్మణపల్లి | 66 | ఏలూరి రమేష్ |
| | కూసుమంచి | దేవాలపల్లి | 67 | జిల్లా లింగయ్య |
| | తిరుమలాయ | పాలెంఎర్రగడ్డ | 68 | పాలకుర్తి వీరస్వామి |
| నల్లగొండ | డిండి | రామంతాపూర్ | 69 | నన్ని రమేష్ |
| | దేవరకొండ | తెలుగుపల్లి | 70 | గ్యార వెంకటేశ్ |
| | చింతపల్లి | హరిజనాపురం | 71 | కంబాలపల్లి లక్ష్మయ్య |
| | | రోటిగడ్డ | 72 | ఇస్లావత్ నవీన్ |
| | | అనాజీపురం | 73 | పి. శ్రీనివాస్‌రెడ్డి |
| | | తిరుమలాపురం | 74 | జాగు మంజుల |
| | మునుగోడు | సోలిపురం | 75 | నకిరేకంటి వనజ |
| | చండూరు | కస్తాల | 76 | కట్టా స్వరూప |
| | | కొండాపూర్ | 77 | గడ్డం యాదయ్య |
| | | దోనిపాముల | 78 | తిప్పర్తి రాములు |
| | | పుల్లెముల | 79 | ఊషయ్య |
| | నాంపల్లి | వడ్డెపల్లి | 80 | బూషిపాటి యాదయ్య |
| | | సుంకిశాల | 81 | మద్ది వెంకటేశ్ |
| | మర్రిగూడెం | తిరుగండ్లపల్లి | 82 | రామిడి భూపతి రెడ్డి |
| యాభువనగిరి | నారాయణపురం | నారాయణపురం | 83 | పల్లె మల్లారెడ్డి |
| | | లచ్చమ్మగూడెం | 84 | రావుల ప్రశాంత్ |
| | ఆత్మకూరు | పల్లెపహాడ్ | 85 | బత్తిని నరేష్ |
| | | సింగారం | 86 | పంజాల అంజనేయులు |
| | అడ్డగుడూరు | కంచనపల్లి | 87 | జెల్లి శ్రీకాంత్ |
| | యాదగిరిగుట్ట | చిన్నకందుకూరు | 88 | కాటం శ్రీకాంత్ |
| | | ధర్మారెడ్డిగూడెం | 89 | ఆలకుంట్ల చంద్రకళ |
| సూర్యాపేట | అనంతగిరి | శాంతినగర్ | 90 | గరిడేపల్లి స్వాతి |
| | చిలుకూరు | జర్రిపోతులగూడెం | 91 | ఉద్దండు దుర్గ |
| రంగారెడ్డి | రావులపల్లి | కుదురు | 92 | వెంకటరెడ్డి |
| కరీంనగర్ | చిగురుమామిడి | చిన్నముల్కనూరు | 93 | పైడిపల్లి వెంకటేష్ |
| | చిగురుమామిడి | ఇందుర్తి | 94 | చింతపూల అనిల్‌కుమార్ |
| సిద్దిపేట | సిద్దిపేట | సీతారాంపల్లి | 95 | మిట్టపల్లి సుధాకర్ |
| | అక్కన్నపేట | గౌరవెల్లి | 96 | మాచర్ల శ్రీనివాస్ |
| | | అంతకపేట | 97 | రామంచ కిషన్‌రెడ్డి |
| | | బొడిగెపల్లి | 98 | పిట్టల పుష్ప |
| మంచిర్యాల | లక్సెట్టిపేట | దౌడపల్లి | 99 | సంతపూరి మధుకర్ |
| మహబూబ్‌నగర్ | హన్వాడ | దాచికపల్లి | 100 | ఎన్.శంకర్ |
| నాగర్‌కర్నూల్ | తాడూరు | గుంతకోడూరు | 101 | రామకృష్ణ |
| | తెలకపల్లి | పెద్దపల్లి | 102 | ఎం.డి.సుల్తాన్ |
| వనపర్తి | పానగల్ | కేతపల్లి | 103 | పి.కృష్ణవేణి |
| నిర్మల్ | బైంసా | గుండేగావ్ | 104 | |



రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ తరఫున 91 మంది అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలుపొందగా 104మంది ఉపసర్పంచ్‌లుగా ఎన్నికైయ్యారు. మొత్తం 1015మంది వార్డు సభ్యులు గెలుపొందారు. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు జాబితాను విడుదల చేశారు

| జిల్లా | సిపిఐ నుండి గెలిచిన వార్డులు |
|---|---|
| కొత్తగూడెం | 459 |
| ఖమ్మం | 171 |
| నల్లగొండ | 103 |
| యాదాద్రిభువనగిరి | 56 |
| నాగర్‌కర్నూల్ | 35 |
| సూర్యాపేట | 37 |
| సిద్దిపేట | 29 |
| కరీంనగర్ | 18 |
| మంచిర్యాల | 13 |
| రంగారెడ్డి | 12 |
| ఆదిలాబాద్ | 07 |
| వనపర్తి | 07 |
| మహబూబ్‌నగర్ | 06 |
| జనగామ | 05 |
| గద్వాల | 03 |
| భూపాలపల్లి | 04 |
| నిజామాబాద్ | 08 |
| సిరిసిల్ల | 04 |
| వరంగల్ | 02 |
| మహబూబాబాద్ | 12 |
| హన్మకొండ | 10 |
| నారాయణపేట | 03 |
| నిర్మల్ | 11 |
| మొత్తం | 1015 |



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రాజ్యాధికార సాధనే బిసిల లక్ష్యం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** రాష్ట్రంలోని బిసి మేదావులు, రాజకీయ వేత్తలు, కళాకారులు ఒక తాటి పైకి వచ్చి రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని రాష్ట్ర బిసి నాయకులు మామిడి రామకృష్ణగౌడ్ అన్నారు. బుధవారం ఆర్‌కెపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న వనస్థలిపురం జింకల పార్కులో నిర్వహించబోయే ఐఖ్యతే మా బలం అధికారమే మా లక్ష్యం అనే నినాధంతో బిసి జన భోజనాల కార్యక్రమాన్ని బిసిలందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మ రఘురాంనేత, చామకూర రాజు, కె.వి.గౌడ్, విశ్వనాధుల పుష్పగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ డివిజన్‌గా బిఎన్‌రెడ్డి

### కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అభివృద్ధిల్లో అదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడంతో పాటు అభివృద్ధి అంటే బిఎన్‌రెడ్డి డివిజన్ చెప్పుకునేలా అభివృద్ధి చేయడం జరిగిందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని పద్మావతి కాలనీలో నూతనంగా మంజూరైన 22 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులు, సాహెబ్ నగర్ పేటేల్ గూడ గ్రామంలో మరో రూ.22లక్షల నిధులతో మరమ్మతులు చేస్తున్న సంక్షేమ సంఘం భవనం నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ కంటే బిఎన్‌రెడ్డి నగర్‌ను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రతి కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పంచడంతో పాటు ప్రధానమైన సమస్యలను పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు.కార్యక్రమంలో పద్మావతి కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, పటేల్ గూడ గ్రామ అధ్యక్షులు బోడ శేఖర్ ఆనంద్, అనంతవేణి కాలనీ అధ్యక్షులు అశోక్, కిషన్, బోడ దశరథ, ఉప్పల బాబు, కొంగర జంగయ్య, జెనిగె అశ్విన్ కుమార్, నరసంహా, అంజయ్య పాల్గొన్నారు.

## యాప్‌తో యూరియా కొనుగోలు

### మండల వ్యవసాయధికారి రవినాథ్



**ప్రజాపక్షం/యాచారం :** రైతులు తెలంగాణ వ్యవసాయశాఖ ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను కొనుగోలు చేయాలని మండల వ్యసాయాధికారి అర్.రవినాథ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో అయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం అన్ని సేవలు కల్పిస్తుందన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుందు ఈ యాప్ ఉంటుందని తెలిపారు. ఫర్టిలైజర్ బుక్ యాప్ సెర్చ్ చేసినట్లయిలే ఈ యాప్ కనబడుతుందని, రైతులు ఇంటి వద్ద నుండే యూరియా బుక్ చేసుకోవచ్చున్నారు. రైతుల ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేసి పట్టాదారు పాసుపుస్తకం సంఖ్యను ఎంటర్ చేసినట్లయితే ఒటిపి అధారంగా బుక్ చేసుకోవచ్చుని తెలిపారు. రైతులు ఈఅవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రధాన సమస్యలపై దృష్టి పెడతాం



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్:** గ్రామంలో ప్రధాన సమస్యలపై దృష్టి పెడతమని చిన్న రవిరాళా గ్రామ సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్ అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని 14 గ్రామాలకు ప్రమాణ స్వీకారం పూర్తి కాగా కొన్ని అనివార్య కారణాల వల్ల రెండు గ్రామాల ప్రమాణ స్వీకారం ఆగిపోయింది. తిరిగి బుధవారం చిన్న రవిరాళా గ్రామ సర్పంచ్ ప్రమాణ స్వీకారం చేయగా లస్కర్‌గూడా గ్రామం మాత్రం ఈనెల 29కు ముహూర్తం పెట్టారు. ఈ సందర్భంగా చిన్న రవిరాళా గ్రామ సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ పాలకవర్గం సమావేశంలో సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కావడి శిరీష రెడ్డి, వార్డు సభ్యులు బండారి అనిత, అభిటీ రామకృష్ణ, అభవతి బాలయ్య, నారెడ్డ్ రిషికారెడ్డి, రాపోల్ మల్లేష్, బదారి సత్యనారాయణ, చెరుకు భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేష్‌యాదవ్‌కు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బద్దుల వెంకటేష్‌యాదవ్ జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గడ్డిఅన్నారం డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ సునీల్‌బాబు నాయకులతో కలిసి వెంకటేష్‌యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి భారీ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, చిట్టిబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్లు



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** హయత్‌నగర్‌లోని లెక్చరర్స్ కాలనీలో కాలనీ వాసులు ప్రచురింపజేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ లెక్చరర్స్ కాలనీ వాసులు ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు యాదగిరి, ఆలయ కమిటీ కార్యదర్శి కట్ట నర్సి రెడ్డి, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, సంక్షేమ సంఘం సభ్యులు వెంకట్ రెడ్డి, రవికుమార్ గౌడ్, క్రిష్ణయ్య, రామస్వామి, సుధాకర్ రావుమల్లారెడ్డి పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# పనితీరు మరింత మెరుగుపడేలా కృషి

### రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్

### ఆశా కార్యకర్తలకు చీరల పంపిణీ





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఆశా కార్యకర్తలు వారి విధులను సక్రమంగా నిర్వర్తించి వైద్య ఆరోగ్య శాఖ పనితీరు మరింత మెరుగుపడే విధంగా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి ప్రభుత్వం పంపిణీ చేసిన యూనిఫామ్ ను(ఒక జత చీరలు) 1358 మంది ఆశా కార్యకర్తలకు ఐడిఒసి కాంప్లెక్స్‌లోని కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ ఆశాకార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒక జత యూనిఫాం అందజేస్తుందని, అందులో భాగంగానే నేడు చీరలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఆశాకార్యకర్తలు గ్రామ, పట్టణ స్థాయిలో స్థానికంగా ఉంటూ ప్రజలకు, వైద్య సిబ్బందికి మధ్య అనుసంధానంగా పని చేస్తూ వారి పరిధిలోని జనాభా ప్రకారం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా కృషి చేయాలని, అత్యవసర పరిస్థితులలో సమాచారాన్ని వెంటనే సిబ్బందికి తెలియచేయాలని తెలిపారు. మాతా, శిశు సంరక్షణ సేవలు, అసంక్రమిత వ్యాధులు, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలు విధులను సక్రమంగా నిర్వర్తించి వైద్య ఆరోగ్య శాఖ పనితీరు మరింత మెరుగుపడే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి కె.శ్రీనివాసులు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు, ప్రోగ్రాం అధికారులు, పాల్గొన్నారు.

### 24 శాతంహెచ్ ఆర్‌ఎకు వినతి

జిహెచ్‌ఎంసి పరిధి నుంచి 8 కిలోమీటర్ల లోపు పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు 24శాతం హెచ్‌ఆర్‌ఎ వర్తింపజేయవలని కోరుతూ సేవ్ టీచర్స్ సంఘం రంగారెడ్డి జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సేవ్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల మధుకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్, గౌరవాధ్యక్షుడు బొడ్డు రవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ ఘటనపై ఐక్యరాజ్యసమితిలో ఫిర్యాదు

### అంతర్జాతీయ న్యాయవాది రాజేశ్ కుమార్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలను తక్షణమే ఖండించాలని కోరుతూ బుధవారం ఐక్యరాజ్య సమితిలో ఫిర్యాదు చేసినట్టు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో ఇంటర్నేషనల్ లాయర్ డా.కరణం రాజేశ్ కుమార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఆరాచకాలను ఆపకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి పోతుందని హెచ్చరించారు. అందరూ బంగ్లాదేశ్‌లో శాంతిని ఏర్పాటయ్యేలా ప్రపంచ దేశాలు కృషిచేయాలని కోరారు.

## జనవరి 4న ఎఎస్‌టి సూపర్ సింగ్ గ్రాండ్ ఫినాలే

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** ఎఎస్‌టి సూపర్ సింగర్ పోటీ గ్రాండ్ ఫినాలే వచ్చే ఏడాది జనవరి 4న నిర్వహించనున్నట్టు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా తెలిపారు. ఈ గ్రాండ్ ఫినాలేలో మొత్తం 15 మంది పోటీదారులు పాల్గొంటారన్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లో నిర్వహించిన రెండో ఆడిషన్‌లో 45 ఏళ్లు, అంతకుపైబడిన వయసు ఉన్న మొత్తం 34 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సమాజ్ ఉపాధ్యక్షులు రూపేశ్ అగర్వాల్, వికాస్ కేశవ, అంచల్ గుప్తా, డా.సీమా జైన్, డా.దిలీప్ పంసారి, మహేంద్ర అగర్వాల్ పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందించేందుకు సౌకర్యాలు





### డిఎంహెచ్‌ఒ లలితాదేవి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుందని డిఎంహెచ్‌ఒ కె.లలితాదేవి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ డయాగ్నస్టిక్ ద్వారా నమూనాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన రెండు వాహనాలను డిఎంహెచ్‌ఒ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవాహనాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రయోగశాల నమూనాల సేకరణ సులభంగా అందుబాటులోకి రానుందని తెలిపారు. అదేవిధంగా ఆసుపత్రిలో విద్యుత్ అంతరాయాల వల్ల రోగులకు ఇబ్బంది లు కలగకుండా ఉండేందుకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన జనరేటర్‌లను ప్రారంభించారు. దీనివల్ల అత్యవసర సేవలు, వైద్య పరీక్షలతోపాటు చికిత్సలు సైతం నిరాటంకంగా కొనసాగుతాయని వివరించారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో మానసిక ఆరోగ్య క్లినిక్‌ను కూడా డిఎంహెచ్‌ఒ ప్రారంభించారు. ఈ క్లినిక్ ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సలహాలు, చికిత్సలు అందించడంతో పాటు అవగాహన కలిగించనున్నారు. జాతీయ మెంటల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యంగా భయం, ఓటమి, ఒంటరితనం, సర్దుబాటు సమస్యలు, వ్యసనాలకు బానిస కావడం, జ్ఞాపకశక్తి సమస్యలు మొదలగు సమస్యల పరిష్కారానికి టెలి మానసనే కార్యక్రమం ద్వారా నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. దీనికోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14416 అందుబాటులో ఉంటుంది డిఎంహెచ్‌ఒ తెలిపారు. కార్యక్రమంలో డిసిహెచ్ ఎస్.డాక్టర్ అనురాగిణి, డాక్టర్ రాకేష్, డాక్టర్ అంబికా, ప్రోగ్రాం అధికారి అక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి

### కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రాష్టం అభివృద్ధి సాధిస్తుందని జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, చేవెళ్ల నియోజక వర్గ ఇంచార్జ్ పామెన భీంభరత్ ఆధ్వర్యంలో రుద్రారం గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు గుఱ్ఱాల విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామా మాజీ సర్పంచ్ సర్వర్ణలత సతీష్‌తో పాటు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డి మాట్లాడుతూ రుద్రారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌గా గుఱ్ఱాల విష్ణువర్ధన్ రెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రతి నాయకులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం గుఱ్ఱాల విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గ్రామ ఇంచార్జ్‌గా అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ కావలి చంద్రశేఖర్, కావలి రమేష్, సీనియర్ నాయకులు గౌరీ సతీష్, తమ్మళి మానయ్య, అశ్వక్ అలీ, రామ్ రెడ్డి, మల్లా రెడ్డి, హైతాబాద్ సర్పంచ్ కర్రె శాంతమ్మ యాదయ్య, అంతారం సర్పంచ్ ఈగ ప్రభాకర్ రెడ్డి, సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య, నాయకులు భార్గవ్ రామ్, మాణిక్య రెడ్డి, మహమ్మద్ అజీమ్, రమేష్, పెంటా రెడ్డిచ రవి, మాణిక్యం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాగుడు మానమన్నందుకు భార్య హత్య

**ప్రజాపక్షం/మిటయాపూర్:** తాగుడు తిరుగుడుతో జలసాలకు అలవాటు పడిన భర్తను అవి మానివేయమని మొరపెట్టుకున్న పాపానికి భార్యపై అతికిరాతకంగా దాడి చేసి హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా మియాపూర్ లో చోటుచేసుకుంది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో భర్త చేతిలో భార్య మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజు, విజయలక్ష్మి అనే దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి గత ఎనిమిదేళ్లుగా మియాపూర్ గోకుల్ ప్లాట్స్‌లో నివాసం ఉంటున్నారు.రాజు ఇటీవల కాలంలో జల్సాలకు అలవాటు పడి బాధ్యతారహితంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. ఈ విషయమై భార్య విజయలక్ష్మి తరచూ మందలించడంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతూ వచ్చాయి.ఈ క్రమంలో ఇద్దరి మధ్య మరోసారి తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. భర్త ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఈ విషయాన్ని అతని కుటుంబ సభ్యులకు చెప్పాలని విజయలక్ష్మి నిర్ణయించుకుంది. ఇందుకోసం ఆమె ఇంటి నుంచి బయలుదేరగా.. దారిలోనే రాజు ఆమెను అడ్డగించాడు. ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం తీవ్రస్థాయికి చేరింది. ఆగ్రహంతో రాజు నియంత్రణ కోల్పోయి భార్యపై పిడిగుద్దులతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.దాడిలో విజయలక్ష్మి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. పరిస్థితి విషమించడంతో రాజు ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. అయితే చికిత్స పొందుతూ విజయలక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు వెల్లడించారు. ఇద్దరు చిన్నపిల్లలు తల్లిని కోల్పోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసుపై సమగ్ర విచారణ కొనసాగుతున్నట్లు మియాపూర్ పోలీసులు తెలిపారు.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కాంగ్రెస్సే అడ్డంకి

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కాంగ్రెస్ పార్టీయే ప్రధాన అడ్డంకని, మాజీ సిఎం కెసిఆర్ చెప్పిన వాస్తవాలను పక్కన పెట్టి, కాంగ్రెస్ మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు అంశంపై సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ముఖ్య నేతలతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ఎస్‌వైఆర్ గార్డెన్‌లో బుధవారం బిఆర్‌ఎస్ కీలక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, హరీశ్వర్ రెడ్డి, మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, భువనగిరిపార్లమెంట్ బిఆర్‌ఎస్ ఇంచార్జి క్యామ మల్లేష్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. 90 శాతం పనులు పూర్తయినా మిగిలిన 10 శాతం పనులను ఎందుకు పూర్తి చేయడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసి, కనీసం సమీక్షా కూడా చేయలేదన్నారు. పదే పదే పాలమూరు బిడ్డనని చెప్పుకునే సిఎం రేవంత్‌రెడ్డి పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యా యం చేస్తున్నారన్నారు. పాలమూరు ప్రాజెక్టుపై కెసిఆర్ చెప్పిన వాస్తవాలను పక్కన పెట్టి, కాంగ్రెస్ మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణ రైతులకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో కెసిఆర్ ప్రభుత్వం కాళేశ్వరం, పాలమూరు లాంటి అతిపెద్ద ప్రాజెక్టులు చేపట్టిందన్నారు. అందులో ఒకటి ఫలితాలు ఇస్తుంటే అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. పాలమూరును కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. అన్ని కేసులు కొట్టివేసిన తర్వాత 30 వేల కోట్ల రూపాయలతో కెసిఆర్ పాలమూరు పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. అందులో రూ.27 వేల కోట్లతో రిజర్వాయర్ల పనులు పూర్తయ్యాయన్నారు. ఇంకా రెండు కిలోమీటర్ల కాలువ తవ్వితే నీళ్లు వస్తాయని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టు పూర్తైతే 7 నియోజకవర్గాలకు సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించామన్నారు. దీంతో ఆయా ప్రాంతాలు సస్యశామలం అయ్యే వన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు రూపాయి కూడా కేటాయించలేదన్నారు. తట్ట మట్టి కూడా తీయలేదని ఆరోపించారు. 47 టిఎంసిలు సరిపోతాయని మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గత 10 ఏళ్లలో కెసిఆర్ రైతులకు ఉచిత కరెంట్, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందించారన్నారు. కెసిఆర్‌ని విమర్శించడం కాదు, ముందుగా మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా కూలిపోవాలని సిఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. రైతు, యువత, మహిళ అన్నివర్గాల వ్యతిరేక ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంద న్నారు. ప్రజలను జాగృతం చేయటానికి రంగారెడ్డి జిల్లాలో త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రజా వ్యతిరేకతోనే ప్రభుత్వానికి సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రానున్న ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తారని హెచ్చరించారు.

## కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి లేదు

### జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ పబ్బం గడపుకోవడమే తప్పా పాలమూరు రంగారెడ్డి పట్ల వారికి చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం షాద్‌నగర్ నియోజకవర్గ జాగృతి ఇంచార్జ్ చీమల రమేశ్, జాగృతి నాయకులు చలసాని విష్ణుమూర్తి, నాగని ప్రకాశ్‌తో కలసి నిర్వహించిన విలేఖరుల సమావేశంలో పాండురంగారెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ తెలంగాణ ఉద్యమ నినాదంలో నీళ్ళు, నిధులు, నియమకాలు అందులో "నీళ్లు" మొదటి అంశం. కానీ పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన అనంతరం వెనక్కి తిరిగి చూస్తే దక్షిణ తెలంగాణకు గుండెకాయ వంటి "పాలమూరురంగారెడ్డి" ఎత్తిపోతల పథకం కేవలం ఒక రాజకీయ నినాదంగానే ఉండి పోయిందే తప్ప,ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి, జిల్లా ప్రజలకు పెద్దగా ఒనగూరింది ఏమి లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలోనే పూర్తి చేశామని చెప్పుకొనే బిఅర్‌ఎస్.. పాలమూరు ప్రాజెక్టును మాత్రం పదేళ్లపాటు పాతరేశారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్, బిజెపితో ఉన్న స్నేహాన్ని కేవలం తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారే తప్ప, తెలంగాణ ప్రాజెక్ట్‌కు అనుమతుల కోసం ఒత్తిడి చేయలేదన్నారు. కేంద్రం పాలమూరు డిపిఆర్ ను వెనక్కి పంపిందంటే దానికి కారణం బిఅర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమని ఆయన మండిపడ్డారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సెరినిటీలో క్రిస్మస్, స్వయం పాలనా దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/నాగారం:** సేవాతత్పరతను, శాంతిని బోధించిన ఏసుక్రీస్తు బోధలు సర్వమానవాళికి ఆదర్శమని సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో సెరినిటీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు కీసర మాజీ ప్రాదేశిక సభ్యులు ముప్పు రాంరెడ్డి హాజరై చిన్నారులకు ఆశీస్సులు అందజేసి అభినందించారు. అదే విధంగా స్వయం పాలనాదినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై విద్యాబోధన చేశారు. బుధవారం చిన్నారుల ఆటపాటలతో ఆనందోత్సాలతో పండుగ వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి నోముల వసంత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధుల సంరక్షణ కోసమే 'గోల్డెన్ కేర్'

**ప్రజాపక్షం/చర్లపల్లి:** వృద్ధుల సహాయం, సంరక్షణ కోసం రూపొందించిన అత్యున్నతమైనది 'గోల్డెన్ కేర్' కార్యక్రమమని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. బుధవారం కుషాయిగూడ లక్ష్మి గార్డెన్ కన్వెన్షన్‌లో కమిషనర్ సుధీర్‌బాబు ఆలోచన దృక్పథంతో రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో వృద్ధులకు 3వ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా మొత్తం 244 మంది వృద్ధులకు సమగ్ర వైద్యసేవలు జెమ్‌కేర్ పాలోమి, సోలీస్ ఐ కేర్, సౌజన్య డెంటల్, మా ఇఎన్‌టి వారి సహకారంతో మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, డెంటిస్టు, ఆప్తమాలజీ విభాగాలలో నిపుణులైన వైద్యులు సంప్రదింపులు జరిపి ఇసిజి, రక్తపోటు, రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించారు. వృద్ధుల సంక్షేమం పట్ల తమ అంకితభావాన్ని ఈ సందర్భంగా అధికారులు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డిసిపి శ్రీధర్, ఉమెన్ సేఫ్టీ డిసిపి ఉషారాణి, అడిషనల్ డిసిపి వెంకటరమణ, కుషాయిగూడ ఎసిపి వెంకట్‌రెడ్డి, ఉమెన్ సేఫ్టీ ఏసిపి వెంకటేశ్వర్లు, ఆర్‌కె ఎస్‌పి జాయింట్ సెక్రెటరీ రాధికానాథ్, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి, సూర్యనారాయణ, సిఐ, ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.



## జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్, వుడ్స్ ఎంక్లేవ్‌లో సుమారు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పన, ప్రజల జీవన ప్రమాణాల పెంపు ద్వారానే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జీడిమెట్ల డివిజన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి పరుస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రా రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, బిక్షపతి, నర్సింహా రెడ్డి, ఉదయ్, శ్రీహరి రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్ల అభివృద్ధికి సహకరించాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గంలోని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాల పట్ల నిధులు కేటాయించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. బుధవారం ఆయన జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జోనల్ కమిషనర్లు రవికిరణ్, అపూర్వ చౌహాన్‌లను కల్సి డీలిమిటేషన్ వార్డుల పునర్విభజన, అభ్యంతరాల విషయమై చర్చించిన అనంతరం వినతిపత్రాన్ని సమర్పించారు. నియోజకవర్గంలో ఎఓసి అదనపు రహదార్లు, సిసి రోడ్ల నిర్మాణం, బాక్స్ డ్రైవ్ ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, నియోజకవర్గ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచటంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచటం, లాంటి పలు అంశాల పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులను కల్సిన వారిలో నియోజకవర్గ బిఆర్‌ఎస్ శ్రేణులు మేకల రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్,డోలి రమేష్, తదితరులు ఉన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని అయినాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ యాదమ్మ జ్ఞాపకార్థం వాలీబాల్‌టోర్నమెంట్‌ను సర్పంచ్ రజిత భాస్కర్ గౌడ్ స్థానిక నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక, మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు రాఘవేందర్ రావు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**ప్రజాపక్షం /వికారాబాద్ :** సెమీ క్రిస్మస్ వేడుకలు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రామయ్యగూడ ఎంఐజి కాలనీలో ఉన్న ఇమ్మానియేల్ ఎజీ చర్చి వారు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ పాస్టర్ ఎలియాజర్ ఏసుప్రభు జన్మదిన సందేశాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం చిన్నరులు, యువకులు వివిధ నాటకాలను ప్రదర్శించారు. ఏసు ప్రభు జన్మదినం, గొర్రెల కాపరిల నాటికలను ప్రదర్శించారు. ఏసుప్రభువు జన్మదినం ప్రపంచానికి వెలుగు నిచ్చింది అని ఎంతో గొప్పగావర్ణించారు. అనంతరం జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# సాధన చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదు

### యువ ఆపద మిత్ర వలంటీర్లకు హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ సూచన




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాధన చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదని యువ ఆపద మిత్ర వాలంటీర్లకు హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ సూచించారు. హైడ్రా ఆధ్వర్యంలో ఆపద సమయంలో ఎలా తనను తాను రక్షించుకోవాలో చుట్టు పక్కల వారిని ఎలా కాపాడాలో శిక్షణ తీసుకున్న 78 మంది యువ ఆపద మిత్రులకు ఆయన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎవి రంగనాథ్ మాట్లాడుతూ వారం రోజుల హైడ్రా శిక్షణలో నేర్చుకున్న అంశాలతో పాటు.. మీరు గొప్ప వ్యక్తులుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడంలో కూడా పూర్తి అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మీరంతా యువ ఆపద మిత్రులు మీ ప్రత్యేకతను చాటాలని సూచించారు. ప్రమాద సమయంలో గందరగోళానికి గురికాకుండా తక్షణ సహాయకులుగా రంగంలోకి దిగాలన్నారు. తర్వాత వివిధ విభాగాలకు చెందిన వారితో సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. అందుకే క్షేత్రస్థాయిలో పరిస్థితులను కూడా ఈ శిక్షణలో భాగం చేశామన్నారు. తోటివారికంటే మీరు ముందుండడమే కాదు. సహచరులకు కూడా అవగాహన కల్పించి ఆపద సమయంలో మీతో కలసి పనిచేసేలా సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు. జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణ ఉంటే బాగుంటుందని విద్యార్థినులు చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ శిక్షణ అవసరముందని చెప్పారు.

వాలంటీర్లకు ఎన్‌డిఎంఎ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ) ప్రారంభించిన యువ ఆపద మిత్ర పథకంలో భాగంగా నిజామాబాద్‌లోని గిరిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎంపికైన 78 మంది వాలంటీర్లకు గత బుధవారం నుంచివారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యగారు, అడిషనల్ కమిషనర్ ఆర్.సుదర్శన్, ఆర్‌ఎఫ్‌ఒ జయప్రకాష్, డిఎఫ్‌ఒ గౌతమ్, ఎడిఎఫ్‌ఒ మోహనరావు, మై భారత్ స్టేట్ కోర్డినేటర్ రాజేష్‌తో పాటు, ఎస్‌ఎఫ్‌ఒలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

### పెన్షన్‌దారుల జాయింట్ యాక్షన్ కమిటీ





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** గత 20 మాసాలుగా పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలను వెంటనే చెల్లించాలంటూ తెలంగాణా ప్రభుత్వ పెన్షన్ దారుల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం రాష్ట్ర పెన్షన్ దారుల జాయింట్ కమిటి మేడ్చల్ జిల్లా శాఖ చైర్మన్ కె.లక్ష్మయ్య, సెక్రెటరి తులసి సత్యనారాయణ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులు పెద్ద సంఖ్యలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుండి వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేసిన వారికి రావల్సిన ప్రయోజనాలను వెంటనే చెల్లించక పోవటంతో పెన్షన్ బకాయిలు పేరుకొని పోయాయన్నారు. ఫలితంగా విశ్రాంతి ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ వృద్ధాప్య దశలో తమ పిల్లల ఉన్నత చదువులు, వివాహాల విషయంలో నానా ఇబ్బందుల పాలవుతూ అప్పులు చేయాల్సిన పరిస్థితులతో మానసికంగా కుమిలి పోవాల్సి వస్తోందన్నారు.

దీనికి తోడు వృద్ధాప్య అనారోగ్య పరిస్థితుల్లో మెరుగైన వైద్యం పొందేందుకు ఇహెచ్‌ఎస్ నగదు రహిత చికిత్స సౌకర్యాన్ని అమలు చేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి అధికారం చేపట్టిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి రెండేళ్లు దాటినా కాలయాపనతో సరిపుచ్చుతున్నారే తప్ప ముందడుగు వేయకపోవటం మరింత ఇబ్బందులను పెంచుతోందన్నారు. గతంలో ఈ విషయమై ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకు వినతి పత్రాలు ఇచ్చినా, ఆగస్టు, నవంబరు మాసాల్లో ధర్నాలు చేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెన్షన్‌దార్ల బకాయిలను చెల్లించాలని వారు డిమాండ్ చేస్తూ వినతిపత్రం ద్వారా కోరారు.

# ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాకు గత సంవత్సరం నుండి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, వికారాబాద్ జిల్లా కోర్టులో సేవలందించి ఒక సంచలనం సృష్టించిన సున్న శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై జ్యుడీషియల్ అకాడమీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కోర్టును, న్యాయవాదులను ఎన్నడూ మర్చిపోలేనని అదేవిధంగా జిల్లా న్యాయవాదుల సహకారం చాలా అమోఘం అన్నారు. ఈ విధంగా వెళ్తే న్యాయవ్యవస్థ మూల సూత్రాలు పదిలంగా ఉంటాయని అంతేకాకుండా, సత్వరమే నూతనంగా మంజూరైన కోర్టు బిల్డింగ్ కు సంబంధించిన స్థల పరిశీలన విషయాన్ని కూడా పూర్తిచేసి వెళ్లనున్నారు.

జిల్లా న్యాయవాదుల సంఘం సంయుక్త కార్యదర్శి ఆనంద్ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, వెంకటేశ్వర్లు, వైష్ణవి, నరసింహ, కమల్‌రెడ్డి, యదవ్‌రెడ్డి, శుభప్రద్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# 'బలరాంనగర్'ను ఓల్డ్ నేరేడ్‌మెట్ డివిజన్‌గా పేరు మార్చాలి





**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** జిహెచ్‌ఎంసి డివిజన్ల పునర్విభజనలో భాగంగా నేరేడ్‌మెట్ ప్రాంతాన్ని చేకూర్చి బలరాంనగర్ డివిజన్ పేరిట ఏర్పడిన నూతన డివిజన్‌కు ఓల్డ్ నేరేడ్‌మెట్ డివిజన్‌గా పేరు మార్చాలని ఓల్డ్ నేరేడ్‌మెట్ గ్రామ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు పూలపల్లి సుందర్‌యాదవ్, కె.బలరాం యాదవ్,టి. మురళీగౌడ్, సృకేష్ గౌడ్, తదితరులు, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావును బుధవారం కల్సి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ డివిజన్‌కు రానున్న జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో బిజెపి నుండి పోటీచేసేందుకు స్థానికులకు మాత్రమే కేటాయించాలని కోరారు.

**డివిజన్ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**ఉప్పల్‌లో :** రామంతపూర్ డివిజన్ పౌరుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కార్పొరేటర్ బండారు శ్రీ వాణి వెంకటరావు తెలిపారు. బుధవారం వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ అధ్యక్షతన డివిజన్‌లోని అన్ని కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో కలిసి అభివృద్ధి పనులపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత ఐదు సంవత్సరాల కాలంలో రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీరు, శానిటేషన్ రంగాల్లో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన ప్రాజెక్టుల పై కూడా చర్చ జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు అందించడమే నా ప్రాధాన్యం అని రామంతపూర్‌ను అభివృద్ధి పరంగా ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం అని అన్నారు. కాలనీ అధ్యక్షులు మాట్లా డుతూ డివిజన్‌లో అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ప్రమాదకర స్థితిలో ఉన్న కరెంట్ పోల్‌లు, స్ట్రీట్‌లైట్లు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఇ నాగమణి, శానిటేషన్ డిఇఇ తరుణ్, ఎఎంసి పోచయ్య, జలమండలి మేనేజర్ రవీందర్, ఎలక్ట్రికల్ ఎఇ లావణ్య, హార్టికల్చర్ నరసింహ, వీధి దీపాల ఇన్‌చార్జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఎఐ కాపీయింగ్

### ఇద్దరు సెంట్రల్ వర్సిటీ విద్యార్థుల అరెస్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు హైటెక్ కాపీయింగ్‌కు పాల్పడడం తీవ్ర కలకలం రేపింది. ఎఐ సాయంతో పరీక్ష రాస్తున్న ఆ ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు తమ షర్ట్ బటన్లలో మైక్రో స్కానర్లు అమర్చుకుని ప్రశ్నాపత్రాన్ని స్కాన్ చేసి బయటకు పంపినట్లు గుర్తించారు. అవతలి వైపునుంచి ఎఐ ద్వారా వచ్చిన సమాధానాలను బ్లూటూత్ ద్వారా వింటూ రాస్తుండగా ఇన్విజిలేటర్ పట్టుకున్నారు. నిందితుల నుంచి అత్యాధునిక స్కానర్లు, బ్లూటూత్ పరికరాలను స్వాధీనం చేసుకుని పోలీసులు వారిని కస్టడీలోకి తీసుకున్నారు. ఎఐ టెక్నాలజీని వాడుకుని పరీక్షా విధానాన్నే సవాలుచేసిన ఈ ఘటన విద్యా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ముున్ముందు ఇలాంటి ఎన్ని చూడాల్సి వస్తుందోనని ఆవేదన వ్యక్తం అవుతోంది.



## బిల్లులు సకాలంలో వచ్చేలా చూస్తా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఘట్‌కేసర్ సర్కిల్ సమీపంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణానికి సంబంధించిన ఇతర పనులకోసం డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి కాంట్రాక్టరుకు రావల్సిన బిల్లులు సకాలంలో వచ్చేలా చూస్తానని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ పావని జంగయ్య, బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, ఆర్ అండ్ బి ఎఇ రంజిత్‌రెడ్డి, కాంట్రాక్టర్ సత్తిరెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేష్, కాంగ్రెస్ శ్రేణులు ఆంజనేయులు, వెంకటనారాయణ, నర్సింగరావు, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## 'తందనానా' లో శ్రీమహాలక్ష్మికి బంగారు పతకం

**ప్రజాపక్షం/నాగారం:** అన్నమయ్య అంతర్జాతీయ సంకీర్తన పోటీలు 'తందనానా–2025' నిర్వహించిన పోటీలలో నాగారం మున్సిపాలిటీకి చెందిన చిర్పల్లి శ్రీ మహాలక్ష్మి సబ్ జూనియర్ పోటీలో గెలుపొందగా ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా వెలగపూడి సచివాలయంలో బంగారు పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా నాగారం మాజీ జెడ్‌పిటిసి ముప్పు రాంరెడ్డి, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డిలు శ్రీమహాలక్ష్మి ని శాలువాతో సత్కరించి అభినందించారు.



## రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధి : ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/కాప్రా:** నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను రాజకీయాలతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందేందుకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, ఏ విషయమైనా తనను సంప్రదించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో లక్షా 70 వేల రూపాయల వ్యయంతో బుధవారం సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. రాజీవ్‌నగర్ కాలనీల చర్చి గడ్డమీద, కైలాసగిరి 30 అడుగల రోడ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద, హెచ్‌బి కాలనీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వార్డు కార్యాలయం వెనుక, కృష్ణానగర్ రోడ్ నంబర్3, 5, న్యూనరసింహ నగర్ వాగ్దేవి స్కూల్ వద్ద, ఓల్డ్ మీర్పేట్ రామకృష్ణ స్కూల్ ఎదురు వీధి, నరసింహనగర్ ఎనుముల మహేష్ వీధుల్లో సిసి రోడ్ పనులతో పాటు ఓల్డ్ మీర్పేట్ కమ్యూనిట్ హాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, జిహెచ్‌ఎంసి డిఇ రూప, ఏఇ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, శ్రీనివాస్, బిఆర్‌ఎస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు సన్మానం

**ప్రజాపక్షం /వికారాబాద్ :** నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచులకు జమాతే ఇస్లామి హింద్ వికారాబాద్ అధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సర్పంచులు, ఉపసర్పంచులు కీలకభూమిక పోషించాలని తెలిపారు. సామాజికవేత్తలు సమాజాన్ని సరైన దిశలో నడిపించడంలో తమ సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## 'దుర్గా రెస్టారెంట్' తీరుపై కస్టమర్ల మండిపాటు

* బిర్యానీ ఆర్డర్ ఇస్తే కుళ్లిన చికెన్ పీస్‌లు
* నిర్వాహకులను నిలదీసిన కస్టమర్లు



**ప్రజాపక్షం/తాండూరు:** దుర్గా గ్రాండ్యూర్ రెస్టారెంట్ తీరు మారడం లేదు. తాజాగా చికెన్ బిర్యానీ ఆర్డర్ ఇస్తే కుళ్లిన చికెన్ రావడంతో కస్టమర్లు నిర్వహాకులపై మండిపడ్డారు. ఇదేంట ని ప్రశ్నించిన కస్టమర్లపై నిర్వాహుకులు ఎదురు తిరుగారు. దీంతో దుర్గా గ్రాండ్యూర్ రెస్టారెంట్ నిర్వాహకులు కస్టమర్ల మధ్య వాగ్వివాదం నెలకొం ది. దీంతో తాండూరు రెస్టారెంట్‌ల నిర్వహణ తీరుపై పట్టణ ప్రజలతో పాటు భోజన ప్రియులు మండిపడుతున్నారు. రెస్టారెంట్లు, హోటల్స్‌పై మున్సిపల్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ లేకపోడంతో వారు ఆడిందే ఆట వారు వండిందే భోజనం అన్న చందం గా మారింది. తాజాగా తాండూరు హైదరాబాద్ రోడ్డు మార్గంలోని దుర్గా గ్రాండ్యూర్ రెస్టారెంట్ పట్టణానికి చెందిన కొందరు యువకు లు బిర్యాని తినడానికి వెళ్ళారు. జంబో ప్యాక్ ఆర్డర్ చేశారు. అది తినేందుకు ఆశగా చూసే లోపు అందులోని చికెన్ పీసు లు కుళ్లిపోయినట్లు అనిపించా యి. వెంటనే హోటల్ నిర్వహకులను నిలదీశారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం నెలకొంది. గత మూడు మాసాల క్రితమే ఇదే రెస్టారెంట్‌లో బిర్యాని ఆర్డర్ చేస్తే అందులో బొద్దింక రావడం తెలిసిందే. దీంతో నిర్వాహకు లు కస్టమర్‌లు కావాలని రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటన మరువక ముందే చికెన్ బిర్యానీలో కుళ్లిన చికెన్ పీసులు రావడం గమనార్హాం. ఇంత జరిగినా మున్సిపల్ అధికారులు గానీ, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# రీల్



## రొమాంటిక్ సీన్లకు రెడీ - అర్చన ఐయ్యర్


ఆది సాయి కుమార్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన చిత్రం 'శంబాల. ఈ చిత్రాన్ని నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ అర్చన ఐయ్యర్ మీడియాతో ముచ్చటించారు. నేను తెలుగమ్మాయినే. మాది చిత్తూరు జిల్లానే. కానీ విద్యాభ్యాసం అంతా బెంగళూరులోనే జరిగింది. నా మాతృభాష తెలుగే. 'శంబాల'కు మంచి స్పందన వస్తోంది. వేసిన ప్రతీ ప్రీమియర్ హౌస్ ఫుల్ అవుతోంది. 'శంబాల'లో నా పాత్రను ఆడియెన్స్ బాగా ఆదరిస్తున్నారు. 'శంబాల' నెరేషన్ పూర్తిగా వినకుండానే ఓకే చేశాను. ఇందులో స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది. రొమాంటిక్ పాటలు, స్టెప్పులు వేసే పాత్ర కాదని ముందే చెప్పారు. ఇలాంటి డిఫరెంట్ పాత్ర నా కెరీర్ ఆరంభంలోనే రావడం ఆనందంగా ఉంది. ఆదితో వర్క్ చేయడంతో చాలా విషయాల గురించి తెలుసుకున్నాను. ఆయనెంతో డౌన్ టు ఎర్త్. ఈ ప్రయాణంలో నాకెంతో అండగా నిలబడ్డారు. ఆయనతో మళ్లీ మళ్లీ నటించాలని అనుకుంటున్నాను. 'శంబాల' ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే ఆ ప్రపంచంలోకి వెళ్తారు. ఇలాంటి చిత్రాన్ని థియేటర్లో చూస్తేనే ఆ వైబ్, ఆ ఫీలింగ్ వస్తుంది. విజువల్‌గా, సౌండ్ పరంగా చాలా గొప్పగా ఉంటుంది. అన్ని రకాల ఎమోషన్స్‌ను టచ్ చేస్తూ తీసిన ఈ చిత్రం ఈ క్రిస్మస్‌కు సరైన ఆప్షన్ అని అనుకుంటున్నాను. ప్రస్తుతం పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో ఫ్యాంటసీ మూవీని చేస్తున్నాం. అది ఓ 500 ఏళ్ల క్రితం జరిగే కథ. చాలా భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఎప్పుడూ కూడా నాకు కంఫర్ట్‌గా ఉండే రోల్స్‌ను ఎంచుకుంటాను. స్టోరీకి తగ్గట్టుగా పాత్ర డిమాండ్ చేస్తే రొమాంటిక్ సీన్లను కూడా చేస్తాను. ఛాలెంజింగ్ రోల్స్ చేయాలనే కోరిక ఉంటుంది. మంచి చిత్రాలను చేయాలని, మంచి కథల్ని చెప్పాలని అనుకుంటున్నాను.నా తల్లిదండ్రుల సపోర్ట్ లేకపోతే నేను ఈ స్థాయికి వచ్చేదాన్ని కాదు. మా అమ్మ, అన్న ఎప్పుడూ నాతోనే ఉంటారు. నా పాత్రల ఎంపికలో వారి ప్రాధాన్యం కూడా ఉంటుంది. నా కలలకు ఎప్పుడూ సపోర్ట్ చేస్తుంటారు.

## 'సుమతీ శతకం' టీజర్ విడుదల



విషన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాతగా ఎంఎం నాయుడు రచన దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సుమతీ శతకం. అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో తేజ, మహేష్ విట్ట, ప్రసాద్, ఆకెళ్ళ గోపి కృష్ణ, కిరణ్ విజయ్, మిర్చి కిరణ్, నెల్లూరు నీరజ, మలక్‌పేట్ శైలజ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సుభాష్ ఆనంద్ సంగీతాన్ని అందించగా నహిద్ మహమ్మద్ ఎడిటింగ్ చేశారు. ఎస్ హలేష్ సినిమాటోగ్రాఫర్‌గా చేశారు. ఫిబ్రవరి 6వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర టీజర్ ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ విప్ జివి ఆంజనేయులు చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ 'నాకు బాగా కావలసిన వ్యక్తులు ఈ చిత్ర నిర్మాతలు. ఈ సినిమా టీజర్ చూస్తే సినిమా కచ్చితంగా హిట్ అవుతుందని తెలుస్తుంది. ప్రస్తుతం విజయాలు అందుకుంటున్న వరుసలో ఈ సినిమా ఉంటుంది' అన్నారు.

## 'చిరు' కొత్త స్టిల్



మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం 'మన శంకర వర ప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, అర్చన సమర్పిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు ముస్తాబవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన మెగాస్టార్ చిరంజీవి కొత్త స్టిల్ అదిరిపోయింది. బ్లాక్ సూట్, వైట్ షర్ట్, కళ్లకు డార్క్ గ్లాసెస్‌తో ఒక చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న మెగాస్టార్ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అన్ని పనులు పూర్తి చేసుకుని జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## 'సిగ్మా' టీజర్ రిలీజ్



సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం సిగ్మా. ఈ సినిమాతో కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సందీప్ కిషన్ హీరో నటిస్తున్న ఈ చిత్రం యాక్షన్ అడ్వెంచర్ కామెడీగా రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు అద్భుతమై రెస్పాన్స్ వచ్చింది. తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. 'మంచోడు.. మహానుభావుడు.. చెడ్డోడు రాక్షసుడు.. చూసే నీ చూపుని బట్టి, ఇప్పుడు ఈ క్షణం నన్ను నేను కాపాడుకోవడానికి ఎలాగైనా మారుతాను' అనే హీరో పవర్ ఫుల్ డైలాగ్ తో టీజర్ ప్రారంభమవుతుంది. ఈ లైన్ వెంటనే కనెక్ట్ అవుతూ విజిలెంట్ కథని సూచిస్తుంది. విజువల్‌గా టీజర్ చాలా రిచ్‌గా, క్లాసీగా ఉంది. సినిమాటోగ్రాఫర్ కృష్ణన్ వసంత్ కెమెరా వర్క్ ప్రతి ఫ్రేమ్‌ను ఎలివేట్ చేస్తూ, సినిమాకు గ్రాండ్ సినిమాటిక్ ఫీల్ ఇస్తుంది. లైకా ప్రొడక్షన్స్ మరోసారి తమ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో సినిమాను పెద్ద స్థాయిలో ప్రజెంట్ చేసింది. కథనం ఒక ట్రెజర్ హంట్ చుట్టూ తిరుగుతుందని టీజర్ సూచిస్తోంది.

## 'ధీరే ధీరే' పాట విడుదల

హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి.అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా 'ధీరే ధీరే' విడుదలైంది. 'ఫంకీ' చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తొలి పాట 'ధీరే ధీరే'కి అద్భుతమైన సంగీతం అందించారు. ఈ మధురమైన పాటను సంజిత్ హెగ్డే, రోహిణి సోర్ట్స్ ఆలపించగా, దర్శకుడు కె.వి. అనుదీప్ సాహిత్యం అందించారు. వినసొంపుగా ఉన్న ఈ 'ధీరే ధీరే' మెలోడిలో విశ్వక్ సేన్, కయాదు లోహార్ జోడి పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న థియేటర్లలో విడుదల కానుంది.



## 'రేజర్' ఇంటెన్స్ పవర్‌ఫుల్ గ్లింప్స్



యూనిక్ స్టోరీ టెల్లింగ్, వైవిధ్యమైన కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవి బాబు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 'రేజర్' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా, ఆయన గత చిత్రం ఎనుగుతొండం ఘటికాచలం వంటి లైట్‌హార్టెడ కామెడీకి పూర్తి భిన్నంగా, డార్క్ అండ్ గ్రిట్టీ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ బాబు నిర్మిస్తున్నారు. రవిబాబు–సురేష్ బాబు కాంబినేషన్‌లో మరోసారి వస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దర్శకత్వంతో పాటు ఈ చిత్రంలో రవిబాబు హీరోగా కూడా నటిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పాత్ర ఇంటన్సిటీ తగ్గట్టుగా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో అలరించబోతున్నారు. తాజాగా విడుదలైన 'రేజర్' టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తించింది. విజువల్స్ పూర్తిగా రా అండ్ బ్రూటల్ టోన్‌లో ఉండగా, రవి బాబు రౌడీలను ఎదుర్కొనే విధానం, రేజర్‌తో చేసే హింసాత్మక దాడులు వణుకు పుట్టించేలా ఉన్నాయి. ఈ గ్లింప్స్ ప్రతీకారంతో నిండిన క్రైమ్ కథ సూచిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న రేజర్, రవిబాబు కెరీర్‌లో మరో డిఫరెంట్ అండ్ ఫస్ట్–ఆఫ్–ఇట్స్–కైండ్ ప్రయత్నంగా నిలవనుంది. మిగతా నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు. సమ్మర్ 2026లో థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న 'రేజర్' రవిబాబు కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ సినిమాల్లో ఒకటిగా నిలవబోతోంది.

## 'మైసా' టీజర్ విడుదల



నేషనల్ క్రష్ రష్మిక లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మైసా'. దర్శకుడు రవీంద్ర పుల్లే దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఆకట్టుకున్న టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ల తర్వాత, తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. వణుకు పుట్టించే ఈ టీజర్, మైసా పాత్ర డార్క్ అండ్ ఇంటెన్స్ ప్రపంచాన్ని ప్రజెంట్ చేసింది. కథానాయిక తల్లి గొంతుతో వచ్చే 'నా బిడ్డ ఊపిరి మోయలేక అగ్గే బూడిదైంది. నా బిడ్డను సంపలేక.. ఆఖరికి సావే సచ్చిపోయింది' అనే పవర్ ఫుల్ వాయిస్‌తో టీజర్ మొదలైయింది. ఈ పాత్ర కోసం రష్మిక మందన్న కెరీర్లోనే అత్యంత రా అండ్ వైలెంట్ క్యారెక్టర్. రక్తం మరకలతో నిండిన రఫ్ లుక్‌లో 'మైసా' పాత్రలో రష్మిక ఫైర్ లా కనిపించింది. టీజర్ చివర్లో ఆమె చేసే గర్జన, మైసా పాత్రలో దాగున్న ఆగ్రహాన్ని, ఆవేశాన్ని అద్భుతంగా చూపించింది.

## వణుకుడే (మొదటి పేజీ తరువాయి)

సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. జనం పనుల మీద బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలికి భయపడి ప్రజలు కాలు బయట పెట్టలేకపోతున్నారు. ఉదయాన్నే వివిధ పనులపై బయటకు వచ్చే ఉద్యోగులు, చిరువ్యాపారులపై చలి ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. పొగమంచులో ప్రయాణం చేసేవారికి అనేక ఇబ్బం దులు తలెత్తుతున్నాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు చలితీవ్రత వల్ల అనారాగ్యం బారిన పడుతున్నారు.

**పదేళ్ల తర్వాత చలి పులి**

2015లో ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. పదేళ్ల తర్వాత ఇటువంటి చలి తీవ్రతను ఎదుర్కొంటున్నామని అంటున్నారు. చలికి తోడు పొగ మంచు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి, తెల్లవారు జామున చలిగాలులు వీస్తుండడంతో వణికిపోతున్నారు. తెల్లవార్లు పొగమంచు దారుణంగా కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు మంచు దట్టంగా అలుముకొని ఎదురుగా ఏముందో కనిపించడం లేదు.దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజిబులిటి 100మీటర్ల కన్నా తక్కువగా ఉండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పాదచారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్లపై నడుస్తున్నారు. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించినా దట్టమైన పొగ వల్ల ఎదురుగా ఏమీ కనిపించక తికమక పడుతున్నారు.

**చలితో పొంచిఉన్న వ్యాధులు**

చలితీవ్రత వల్ల సూర్యకాంతి ఉన్నా వేడి తెలియడం లేదు. సాయంత్రం 4గంటల నుంచే చలిప్రారంభమవడం, రాత్రంతా కొనసాగడం, మరుసటి రోజు ఉదయం 11 గంటల వరకు కూడా తీవ్రత తగ్గక పోవడం నగర వాసులను ఇబ్బంది పెడుతోంది. వృద్ధులు, దీర్ఘకాలిక రోగులకు ప్రమాదమని వైద్యులు హెచ్చరికలు ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, 5 సంవత్సరాలలోపు పిల్లలు ఆస్తమా, బ్రాంకైటిస్, హృద్రోగులు, షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలున్నవారు ఈ చలికాలంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చలితో శ్వాసకోశ వ్యాధులు త్వరగా ముదురుతాయని, న్యూమోనియా ప్రమాదం కూడా అధికమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

**అయ్యప్ప స్వాముల ఇక్కట్లు**

చలి తీవ్ర ప్రభావం చూపుతుండడంతో అయ్యప్ప స్వాములు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నియమం ప్రకారం వీరు స్వెటర్లు ధరించరాదు. నల్లని వస్త్రాలపైనే నగరంలోని పలు హరిహర క్షేత్రాలు, అయ్యప్ప దీక్షా శిబిరాల్లో చలికి వణుకుతూ పూజలు చేయడం కనిపిస్తోంది. వాకర్లు నడకసమయాలను మార్చుకుంటున్నారు. వృద్ధులు తమప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు.

**ఉన్ని దుస్తుల విక్రయాల జోరు**

చలి తీవ్రత వల్ల నగరంలోని బజార్లు, మార్కెట్లలో ఉన్ని దుస్తుల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. చలిని తట్టుకోలేక ప్రజలు స్వెట్టర్లు, శాలువాలు, గ్లవ్స్, టోపీలు, మఫ్లర్లు వంటి ఉన్ని దుస్తులను కొనుగోలు చేస్తున్నారు. చలితీవ్రత పుణ్యమా అని తమ వ్యాపారం పెరగడంతో ఉన్ని దుస్తుల విక్రయదారుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

## 'బాల పురస్కార్'కు శివాని, జ్యోతి ఎంపిక




**హైదరాబాద్:** భారతదేశంలో పిల్లలకు అందించే అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్‌కు ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఎఎంఎఫ్)కు చెందిన పారా అథ్లెట్లు శివాని, జ్యోతి ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని న్యూఢిల్లీలో ఈనెల 26వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మద్దికేర గ్రామానికి చెందిన శివాని, హర్యానాకు చెందిన జ్యోతి ఇద్దరూ ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందుతున్న పారా అథ్లెట్లు. పారా క్రీడల్లో అసాధారణ ప్రతిభ, పట్టుదల, నిరంతర శ్రమకు గుర్తింపుగా వీరు ఈ ప్రతిష్మాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. శివాని పారా అథ్లెటిక్స్‌లో జావెలిన్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో, జ్యోతి డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావెలిన్ త్రో విభాగాల్లో విశేష ప్రతిభను కనబరుస్తున్నారు. గత నాలుగేళ్ళుగా వీరు చూపిన అంకితభావం, క్రమశిక్షణ, అచంచలమైన సంకల్ప శక్తికి ఇది నిదర్శనం. వీరి గ్రాస్‌రూట్ స్థాయి నుంచి పూర్తి శిక్షణకు ఆదిత్య మెహతా ఫౌండేషన్ మద్దతు ఇచ్చింది.

రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం పారా క్రీడల్లో వీరి ప్రతిభకు లభించిన అత్యున్నత జాతీయ గుర్తింపుగా చెప్పవచ్చు. ఈ విజయానికి సహకరించిన ఇన్వెస్కో, ఫ్లట్టర్, జిఎంఎంసిఐ, ఆల్కాన్‌కు ఆదిత్య మెహతా ఫౌండేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారా అథ్లెట్లకు శిక్షణ, పునరావాసం, మార్గదర్శనం, పోటీ అవకాశాలు కల్పిస్తుంది.

## గతంలో మాట్లాడినప్పుడు వీరంతా ఎక్కడ?

### నేనేం మాట్లాడాను.. ఎందుకు టార్గెట్ చేశారు
### ప్రెస్ మీట్ పెట్టి మరీ క్షమాపణ చెప్పిన శివాజీ



**హైదరాబాద్:** లూలూ మాల్‌లో నిధి అగర్వాల్ పడిన ఇబ్బంది ఇంకా నా మెదడులోని ఉంది. ఆ సమయంలో ఆమె బట్టలు కనుక ఏదైనా ఒకటి జారిపోయి ఉంటే ఆ వీడియోలు జీవితాంతం ఉంటాయి? మీరు తీయమంటే తీస్తారా ? నేను మంచి బట్టలు వేసుకోండి అని చెప్పానే తప్ప ఆడవాళ్లను కించపరచాలని ఉద్దేశ్యం నాది కాదు. నేను మంచి కోసమే చెప్పాను కానీ నా దగ్గరి నుంచి రెండు పదాలు దొర్లాయి ఇది నా తప్పు. ఇప్పటికే క్షమాపన చెప్పాను. గతంలో కూడా నాకంటే ఎక్కువగా మాట్లాడినప్పుడు నామీద మాట్లాడిన వాళ్లంతా అప్పుడు ఎక్కడున్నారు. నన్నే ఎందుకు టార్గెట్ చేశారు? అని నటుడు శివాజీ వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన దండోరా అనే సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడినందుకు తెలంగాణ మహిళా కమిషన్ నోటీస్ ఇచ్చింది. ఈనెల 27న కమిషన్ ముందుకు హాజరవుతాను. అయినా వాళ్ళేమైనా ఉరిశిక్ష వేస్తారా? అని శివాజీ ప్రశ్నించారు. అనుష్కను, సాయి పల్లవిని, సౌందర్యను టచ్ చేసిన సంఘటనలు విన్నామా? మీరా జాస్మిన్ అందంగా ఫుల్‌గా చీర కట్టుకుని వస్తారు. భూమిక గురించి ఏవరన్నా మాట్లాడారా? ప్రోవోక్ చెయ్యకూడదు. ప్రోవోక్ చేసే అవకాశం ఎందుకు ఇవ్వాలి అని చెప్పాను. మీరు ఎలాంటి బట్టలైనా వేసుకోండి. మీ హక్కులను హరించేందుకు నేనెవర్ని అన్నారు. మహిళా కమిషన్ నోటీసు ఇవ్వడంతో దిగి వచ్చిన శివాజీ ప్రసాద్ ల్యాబ్‌లో ప్రెస్ మీట్ పెట్టి మరీ క్షమాపణ చెప్పారు. సినిమా ఇండస్ట్రీలోని కొంతమంది మహిళలు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారని చెప్పారు. చిన్మయి లాంటి వాళ్ళు కొంతమంది మహిళా కమిషన్‌కు ట్యాగ్ చేశారని, కేంద్ర ప్రభుత్వం వరకు ట్యాగ్ చేసుకుంటూ వెళ్లారని అన్నారు. అనసూయ ఈ విషయంలో ఎందుకు తలదూర్చిందో అని అన్నారు. త్వరలోనే అనసూయపై ఋణం తీర్చుకునే అవకాశం నాకు కలగాలని శివాజీ సెటైర్ వేశారు. ఇప్పటి వరకు ఇండస్ట్రీ నుంచి సుప్రియ, విష్ణు తప్ప ఎవరూ తనతో మాట్లాడలేదని శివాజీ పేర్కొన్నారు.

## రూపొందించాలి (మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి విద్య, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం నాటికి మధిర నియోజక వర్గ పరిధిలో చేపట్టిన మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. 1,73,000 మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని వారందరికీ ఆంగ్లం, గణితం, విజ్ఞాన శాస్త్రంలో అత్యుత్తమ బోధన చేసే వారిని గుర్తించి జిల్లా వ్యాప్తంగా ఆ అధ్యాపకులచేత బోధన చేయించాలని జిల్లా అధికార యంత్రాంగానికి భట్టి సూచించారు. ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూల్స్ పై సమీక్ష చేసిన విక్రమార్క వీటి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలేరులో కనీస పనులు ప్రారంభించకపోవడం వెనక కారణం ఏమిటని సంబంధిత అధికారిని ప్రశ్నించారు. గురుకులాల్లో బోధన పద్ధతులు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యం, అవసరమైన సౌకర్యాల కల్పనకు జిల్లా అధికారులు కృషి చేయాలని త్వరలో అన్ని సంక్షేమ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేస్తామని ఆయన హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూడాలని అన్ని గురుకులాలకు వీలైనంత త్వరలో సొంత భవనాలను నిర్మిస్తామని అందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం, మంచి నైపుణ్యాలు, నాణ్యమైన సౌకర్యాలు చిన్నతనం నుంచి అందిస్తే మన రాష్ట్రానికి మంచి సంపద సృష్టించే మానవ వనరులు తయారవుతాయని ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలల పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొన్ని పాఠశాలల్లో గోడౌన్స్‌లో కుక్కినట్లు విద్యార్థులను ఉంచుతున్నారని దీనిపై అధికారులు పరిశీలన చేయాలని ఆయన ఆదేశించారు.

ప్రైవేట్ విద్యా సంస్థలు రెన్యూవల్ చేసేటప్పుడు ప్రభుత్వం ఇచ్చిన చెక్‌లిస్టును పరిశీలించాలని ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా రెన్యూవల్ చేసినా, అనుమతులు ఇచ్చినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. జనవరి 15లోపు ఇంటర్ విద్యా సంస్థల మరమ్మతు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన భట్టి జిల్లాలో మంజూరైన ఐదు జూనియర్ కళాశాలల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను నెలకొకసారి ప్రభుత్వ వైద్యులు పరీక్షించి ఆరోగ్య కార్డులు అందజేయాలన్నారు. హాజరు విషయంలో ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని శాసన సభలోనే హాజరును ప్రవేశపెట్టినప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడానికి ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. జవాబుదారితనంతో పని చేసినప్పుడే ఫలితాలు వస్తాయని ప్రభుత్వ ఉద్యోగులు అలసత్వంవహించినా సహించబోమని ఈ ప్రభుత్వం ప్రజల పక్షాన పని చేస్తుందని ఆయన తెలిపారు ఈ సమీక్షా సమావేశంలో వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఐటిడిఏ పివో బి.రాహుల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లాలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తనికెళ్ల గురుకుల పాఠశాల సందర్శన**

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల బాలికల గిరిజన గురుకుల పాఠశాలను మల్లు భట్టి విక్రమార్క, వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. గురుకులంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయ బృందాన్ని అడిగి సమస్యలకు సంబంధించి వెంటనే ప్రభుత్వానికి ఒక నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు బోధన, మెనూ అమలు తదితర విషయాలపై ప్రశ్నించారు.

## గద్దెల తరలింపు (మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పెద్దల అభిప్రాయం తీసుకొని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్‌లో వనదేవతలు ఉండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులుభతరంగా మారుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. నేడు మొదటి ఘట్టం ప్రారంభమైందని, అన్ని కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం ప్రకృతి సిద్ధాంతాన్ని ఆచరించామని ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ మహేందర్ జి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు, మేడారం సర్పంచ్ పిరిల భారతీ వెంకన్న, ఆదివాసీ పూజారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ బెడద (మొదటి పేజీ తరువాయి)

తెచ్చుకుందని ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకువచ్చారు. పసిఫిక్, కరీబియన్ జలాల్లో అమెరికా 20 చమురు నౌకలను లక్ష్యంగా చేసుకుని వెంటాడుతోందని, డ్రగ్స్ పడవల పేరుదో అమెరికా రక్షణ దళం దాడులు చేసి ఇప్పటికే 100మందిని హతమార్చిందని ఫిర్యాదు చేశారు. ఈనెలారంభంలో వెనిజులా ముడి చమురు నౌకలను అమెరికా స్వాధీనం చేసుకున్న విషయంపై చర్చించేందుకు భద్రతా మండలి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. ఇప్పటికీ ఇంకా మరో మూడు ముడి చమురు నౌకలను వెంటాడుతూ, వాటిని కూడా స్వాధీనం చేసుకోవాలని అమెరికా రక్షణ బలగాలు ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. గ్రేట్ బ్రిటన్, జర్మనీ, ఇటలీ దేశాలు గత శతాబ్దంలో 1902 డిసెంబరు నుండి 1903 ఫిబ్రవరి వరకూ ఇదేవిధంగా వెనిజులా చమురు నౌకలపై నిర్బంధాలు విధించాయి. అదే సామ్రాజ్యవాద దౌర్జన్య చర్యలను ట్రంప్ వంద సంవత్సరాల తర్వాత మళ్ళీ కొనసాగిస్తున్నారు. వెనిజులా చమురు నౌకలు తిరగకుండా నిర్బంధం విధించాలని ఈనెల 16వ తేదీన ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటినుండీ రెండు దేశాలమధ్యా ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. కరీబియన్ సముద్ర జలాల్లో 15,000 మంది అమెరికా సైన్యాలు, విమాన వాహక నౌకలు, గైడెడ్ క్షిపణులు, విధ్వంసక ఆయుధాలు, ఆంఫీబియస్ అస్సాల్ట్ నౌకలను ట్రంప్ మోహరించారు.

దేశాధ్యక్షుడు నికొలస్ మదురో మాదక ద్రవ్యాల ముఠా నాయకులకు అండదండలు ఇస్తున్నారని ట్రంప్ ఎప్పటినుండో ఆరోపిస్తున్నారు. వెనిజులా ఉన్న చమురు, వెనిజులా భూ భాగం, ఆ దేశంలో ఉన్న ఖనిజాలన్నీ తమవేననీ, తమ ఆస్తులను తమకు స్వాధీనం చేయాలని వెనిజులాకు ట్రంప్ హెచ్చరిక జారీ చేశారు. దేశాధ్యక్ష పదవి నుండి మర్యాదగా వైదొలగిపోవడం చాలా శ్రేయస్కరమని కూడా మదురోకు ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. డ్రగ్స్ ముఠాలకు ఆశ్రయం ఇస్తున్న మదురో శిక్ష లేకుండా అధ్యక్ష బాధ్యతల్లో కొనసాగుతున్నారని ట్రంప్ ఆరోపణలు చేస్తున్నారు. వెనిజులాపై సైనిక దాడి అవకాశం ఉందని, దాన్ని తోసిపుచ్చలేమని 2017లో అధ్యక్షుడుగా ఉన్న సమయంలోనే ట్రంప్ మీడియాకు చెప్పారు. ఇప్పుడు ఆయన వెనిజులాను చుట్టుముట్టారు. మెనిజులాలో కమ్యూనిస్టుపాలకులను కూలద్రోసి తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని ట్రంప్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, మరోవైపు వెనిజులా చట్టసభ యాంటీ పైరసీ చట్టాన్ని ఆమోదించింది. కరీబియన్ సముద్రంలో తిరిగే తమ నౌకలను అమెరికా స్వాధీనం చేసుకుంటున్న పరిస్థితులమధ్య యాంటీ పైరసీ చట్టాన్ని ఆమోదించింది. ఈ విధంగా తమ నౌకలను గమ్యస్థానాలకు చేరనివ్వకుండా మధ్యలోనే అడ్డుకుని స్వాధీనం చేసుకోవడాన్ని పైరసీగా వెనిజులా పేర్కొంది. ఈ పైరసీని వ్యతిరేకించేందుకు ఒక చట్టాన్ని చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com